
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
17-11-2024
సంపుటి : 01 | సంచిక : 195 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS





9

## ఇక ఉగ్రవాదులు మనల్ని భయపెట్టలేరు

గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పాలసీలు తీసుకొచ్చాయి

మేము అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాం

హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని మోదీ కీలక ప్రసంగం

ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నగరంలో ఉన్న మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీలో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రిలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో మంటలు చెలరేగి 10 మంది శిశువులు చనిపోయినట్టు ఝాన్సీ జిల్లా కలెక్టర్ అవినాశ్ కుమార్ ధ్రువీకరించారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌లో మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగినట్లు ఝాన్సీ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ సచిన్ మోహార్ తెలిపారు.



# ఝాన్సీ మెడికల్ కాలేజీలో ఘోరం

## 10 మంది నవజాత శిశువుల సజీవ దహనం

### 16 మందికి గాయాలు.. రాష్ట్రపతి, ప్రధాని, యూపీ సీఎం దిగ్భ్రాంతి

**ఝాన్సీ:** ఉత్తరప్రదేశ్ ఝాన్సీ జిల్లా మహారాణి లక్ష్మీ బాయి మెడికల్ కాలేజీలోని పిల్లల వార్డులో అర్ధరాత్రి ఘోర అగ్నిప్రమాదం జరిగి 10మంది చిన్నారులు సజీవ దహనమయ్యారు. 16మంది గాయపడ్డారు. మృతుల్లో రోజుల వయస్సున్న నవజాత శిశువులు ఉన్నారు. ఘటనా సమయంలో నియోనటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో మొత్తం 54 మంది పిల్లలు అడ్మిట్ అయి ఉన్నారు. ఆస్పత్రిని ఈ విభాగంలో శుక్రవారం రాత్రి 10.45 గంటలకు ఆక్సీజన్ కాన్సన్‌ట్రేటర్‌లో విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. పిల్లల వార్డు గదుల్లో ఆక్సీజన్ మిగతా2లో...



ప్రమాదంలో పసిబిడ్డలను కోల్పోయిన తల్లుల శోకం

## శ్రీలంక ఎన్నికల్లో దిస్సనాయకే పార్టీ ఘన విజయం

ఎన్‌పీసీకి మూడింట రెండొంతుల మెజార్టీ

జాఫ్నాలోనూ ఆ పార్టీ హవా



**కొలంబో:** శ్రీలంక పార్లమెంటు ఎన్నికల్లో అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే సారథ్యంలోని నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పార్టీ అఖండ విజయం సాధించింది. మూడింట రెండొంతుల మెజార్టీతో దిస్సనాయకే పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. మిగతా2లో...

## వేదవాఙ్మయం సులభశైలిలో లభించడం గొప్ప విషయం



- ఘనంగా దర్శనమ్ ద్విదశాబ్ది మహోత్సవం..
- ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి

3

## తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా డా.గుమ్మడి వెన్నెల

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు నియమించాం
- ప్రిన్సిపల్ సెక్రటరీ వెల్లడి



2

## తెలంగాణలో నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 102 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

అభ్యర్థులకు కీలక సూచనలు చేసిన టీఎస్పీఎస్సీ




2



ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేయడమే

## ప్రభుత్వ లక్ష్యం

- తీరుమార్చుకోని కంపెనీల అనుమతులు రద్దు చేస్తాం
- ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి
- ప్రతీ కంపెనీ నర్సరీని కలిగి ఉండాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**విశ్వంభర, హైదరాబాద్:** ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో మిగతా2లో...

## మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

- బాధితుల పక్షాన పోరాటం చేసే బాధ్యత బీజేపీ తీసుకుంటుంది
- ఎప్పుడు బుల్డోజర్‌తో ఇల్లు కూలగొడతారో అనే భయంతో ప్రజలున్నారు
- బాధిత కుటుంబాలతో కలిసి రాత్రి బస చేసిన కిషన్‌రెడ్డి



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 90 | ₹ 112 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 162 | ₹ 185 |

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఐదుగురు నక్సల్స్ మృతి
- ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలు
- నక్సల్స్ నుంచి భారీగా ఆయుధాల స్వాధీనం



**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులకు, నక్సలైట్‌లకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సలైట్‌లు మరణించారు. మిగతా2లో...



## లగచర్ల ఘటనలో పోలీసుల అదుపులో మరో 8 మంది

పరిసర గ్రామాల్లో పరిస్థితిపై ఆరా తీస్తున్న పోలీసులు


ప్రత్యేక బృందాలతో గాలింపు

**విశ్వంభర, వికారాబాద్:** లగచర్లలో అధికారులపై దాడి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. తాజాగా మరో 8 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వీరిని పరిగి మిగతా2లో...

## నటి కస్తూరి అరెస్ట్

రాజేంద్రనగర్‌లో అదుపులోకి తీసుకున్న తమిళ పోలీసులు

చెన్నైకి తరలింపు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటి కస్తూరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నవంబర్ 3 నుంచి పరారీలో ఉన్న ఆమెను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో తమిళ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో చెన్నైకి తరలించారు. ఈ నెల 3న చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమానికి నటి కస్తూరి మిగతా2లో...

# ఏపీ సీఎం ఇంట విషాదం

- చంద్రబాబు తమ్ముడు రామ్మూర్తి నాయుడు కన్నుమూత
- శోకంలో మునిగిన చంద్రబాబు...
- నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు



**విశ్వంభర, హైదరాబాద్/అమరావతి:** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇంట విషాదం నెలకొంది. చంద్రబాబు సోదరుడు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు నాయుడు తన సోదరుడి మరణవార్త తెలియగానే పర్యటనను రద్దు చేసుకుని స్వగ్రామానికి బయలుదేరారు. ఆదివారం ఉదయం స్వగ్రామం నారావారిపల్లెలోనే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా రామ్మూర్తి నాయుడు గతంలో 1994 నుంచి 1999 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన చంద్రగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన 1999 అసెంబ్లీ ఎన్నికల్లో గల్లా అరుణ కుమారి చేతిలో ఓటమిపాలవడంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే ఆయన మొదటి నుంచి తిరుపతిలో ఎక్కువగా ఉండటంతో పార్టీలో పెద్దగా పాపులర్ కాలేకపోయారు. కాగా నారా రామ్మూర్తి నాయుడు కుమారుడే సినిమా నటుడు నారా రోహిత్. నారా రోహిత్ ఇప్పటికే హీరోగా పలు సినిమాల్లో నటించాడు. రామ్మూర్తి నాయుడు మరణవార్తతో స్థానిక టీడీపీ శ్రేణుల్లో విచారం నెలకొన్నది.

**శోకంలో మునిగిన చంద్రబాబు...**

తన తమ్ముడు నారా రామూర్తినాయుడు మరణంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని శనివారం నేరుగా హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామ్మూర్తినాయుడు నన్ను విడిచి వెళ్లిపోయాడని శోకతప్త హృదయంతో తెలియజేస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజాజీవితంలో పరిపూర్ణ మనసుతో ప్రజలకు సేవలు చేశాడని , మా నుంచి దూరమై కుటుంబంలో విషాదం నింపాడని, రామూర్తినాయుడు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానని వివరించారు. రామూర్తినాయుడు మృతిపట్ల మంత్రి నారా లోకేష్, మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవి , అనగాని సత్యప్రసాద్, డీబీవీ స్వామి , అచ్చెన్నాయుడు, నారాయణ ప్రగాఢ సానుభూతిని, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్నాన్న రామూర్తినాయుడు మరణం తీవ్ర విషాదం నింపిందని లోకేష్ అన్నారు. పిన్ని, తమ్ముళ్లు ధైర్యంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు.

**చంద్రబాబుకు ప్రగాఢ సానుభూతి: పవన్‌కల్యాణ్**

నారా రామూర్తినాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోదర వియోగంతో బాధపడుతున్న చంద్రబాబుకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ప్రధాని మోదీకి మెమరీ లాస్

**ముంబయి:** జో బైడెన్ మాదిరిగానే ప్రధాని నరేంద్రమోదీకి జ్ఞాపకశక్తి లాస్ అయిందని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ మధ్య మేం ఏది మాట్లాడితే మోదీ కూడా అదే మాట్లాడుతున్నారని, బహుశా ఆయనకు జ్ఞాపకశక్తి నశించి ఉంటుందని ఆయన అన్నారు.'ఇటీవల ప్రధాని మోడీజీ స్పీచ్ విన్నట్టు నా చెల్లి నాతో చెప్పింది. ఈ మధ్యన మేమేం మాట్లాడినా ఆయనా అదే చెప్తున్నారని తెలిపింది. బహుశా ఆయనకు మెమరీ లాస్ అయిందేమో. జో బైడెన్ సైతం జెలెన్ స్కీ వస్తే రష్యా ప్రెసిడెంట్ పుతిన్ వచ్చినట్టు చెప్పారు. ఆయనలాగే మన ప్రధానికి కూడా మతి పోయిందేమో' అని మహారాష్ట్ర సభలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు..

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో గ్రూప్-3 పరీక్షలకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 102 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలన్నారు. ఒరిజినల్ ఐడీతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 9.30కి ప్రారంభమయ్యే పేపర్-1కు అభ్యర్థులు 8.30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మధ్యాహ్నం పరీక్షలకు 1.30 గంటలలోగా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.ఉదయం జరిగే పరీక్షలకు 9.30 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని ఇప్పటికే టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ కాపీని భద్రంగా పెట్టుకోవాలని తెలిపింది. తొలిరోజు పేపర్-1 పరీక్షకు తీసుకొచ్చిన హాల్‌టికెట్‌ను మిగతా పరీక్షలకు ఉపయోగించాలని పేర్కొంది. నియామక ప్రక్రియ ముగిసేవరకు ప్రశ్నపత్రాలు, హాల్‌టికెట్లను భద్రంగా పెట్టుకోవాలని కమిషన్ సూచించింది.

## శ్రీలంక ఎన్నికల్లో దిస్సనాయకే పార్టీ ఘన విజయం

(మొదటి పేజీ తరువాయి)

225 సీట్లు ఉన్న పార్లమెంటులో 159 స్థానాల్లో ఎన్‌పీపీ విజయం సాధించిందని శుక్రవారం ఎన్నికల కమిషన్ ప్రకటించింది. తమిళులు అధికంగా ఉన్న జాఫ్నాలోనూ ఎన్‌పీపీ హవా కనిపించింది. ఆ ప్రాంతంలో అత్యధిక ఓట్లును దక్కించుకుని చరిత్రను తిరగరాసింది. దామాషా పద్ధతిలో ఆరింట మూడు సీట్లను తన ఖాతాలో వేసుకుంది. దీంతో దక్షిణంలో సంప్రదాయక తమిళ పార్టీలను ఓడించిన మొదటి సింహళ పార్టీగా ఎన్‌పీపీ నిలిచింది. ఈ ఎన్నికల్లో ఎన్‌పీపీ 68 లక్షలకుపైగా (61 శాతం) ఓట్లు సాధించింది. సాజిత్ ప్రేమదాస నేతృత్వంలోని సమజి జన బలవేగయ పార్టీ 40 సీట్లతో రెండో స్థానంలో నిలిచింది. కొలంబోలోని భారత హైకమిషనర్ సంతోష్ ఝా అధ్యక్షుడు దిస్సనాయకేను కలిసి అభినందనలు తెలిపారు.

## లగచర్ల ఘటనలో పోలీసుల అదుపులో మరో 8 మంది

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ కేసులో ఇప్పటికే 17 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చర్లపల్లి జైలులో ఉన్నారు, మిగతా 16 మందిని పరిగి నుంచి సంగారెడ్డి జైలుకు తరలించారు.మరోవైపు లగచర్ల ఘటనపై వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీ మహేశ్ భగవత్ వివరాలు సేకరిస్తున్నారు. లగచర్లతో పాటు పరిసర గ్రామాల్లో పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. పరారీలో ఉన్నవారి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

## ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ఇందుకోసం కావాల్సిన అన్ని రకాల చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.పామాయిల్ కంపెనీల పురోగతిపై మంత్రి సమీక్షించారు. పురోగతి చూపించని ఆయిల్ కంపెనీలపై అసహనం వ్యక్తం చేశారు. తీరుమార్చుకోని కంపెనీల అనుమతులు రద్దు చేసి, టీజీ ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తామన్నారు. 2025 చివరి నాటికి ప్రతి కంపెనీ వారికి కేటాయించిన జోన్లలో ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఇప్పటికే 64,040 హెక్టార్లలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ చేసినట్లు చెప్పారు. ''2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకోగా.. ఇప్పటివరకు 25,470 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేసుకున్నాం. ఆయిల్ పామ్ కంపెనీలు వారికి కేటాయించిన జోన్లలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కర్మాగారాల ఏర్పాటుకు ఆయా సంస్థలు తక్షణమే చర్యలు చేపట్టాలి. ప్రతీ కంపెనీ నర్సరీని కలిగి ఉండాలి. అత్యధికంగా నూనె శాతాన్ని ఇచ్చే వంగడాలను, గ్యానో డెర్మలాంటి వ్యాధులను తట్టుకొనే వంగడాలను, తక్కువ ఎత్తు పెరిగే పొట్టి రకాలకు సంబంధించిన నాణ్యమైన మొలకలను తెప్పించుకొని నర్సరీలలో పెంచి రైతులకు సరఫరా చేయాలి. ప్రస్తుతం టన్నుకు పామ్ ఆయిల్ గెలల ధర రూ.6000కు పైగా పెరిగిందని.. త్వరలోనే టన్ను ధర రూ. 20వేలు దాటే అవకాశం ఉంది'' అని మంత్రి తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)



భద్రతాబలగాల్లో కూడా ఇద్దరికి గాయాలయ్యాయి. వారిలో ఒకరికి కాలిలో బుల్లెట్ దిగగా, మరొకరికి తలలోకి వెళ్లింది. అయితే ఇద్దరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. కంకేర్ నారాయణపూర్ జిల్లా సరిహద్దులోని మాద్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి భద్రతాబలగాలు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఎన్ కౌంటర్ ఇంకా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. కాగా ఛత్తీస్‌గఢ్‌లో అతిపెద్ద నక్సల్స్ ఆపరేషన్ అక్టోబర్ 4న అబుజ్మడ్ అడవుల్లో జరిగింది. నక్సలైట్లపై నిర్వహించిన ఆ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో 31 మంది నక్సలైట్లు మరణించారు. ఎన్‌కౌంటర్ జరిగిన పది రోజుల తర్వాత అక్టోబర్ 14న మావోయిస్టులు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో ఎన్‌కౌంటర్‌లో మరణించిన నక్సల్స్ 31 మంది కాదని, మొత్తం 35 మంది అని పేర్కొన్నారు. అక్టోబర్ 18న బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. ఆ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 38 మంది నక్సలైట్లు మరణించారని తెలిపారు.

## దేశంలోనే తొలి మహిళా బస్ డిపో

- దేశ రాజధానిలో ప్రారంభం
- సఖి డిపోగా నామకరణం
- మేనేజర్, డ్రైవర్లు, కండక్టర్లు మహిళలే



**న్యూఢిల్లీ:** అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్న మహిళలు రవాణా రంగంలోనూ తమ హక్కులను పొందాలనే ఉద్దేశంతో దేశంలోనే తొలి 'మహిళా' బస్ డిపో ను రాష్ట్ర రవాణా మంత్రి కైలాశ్ గహ్లోత్ ఇక్కడ ప్రారంభించారు. ఇప్పటికే చాలామంది మహిళలు బస్ కండక్టర్లుగా, ఇతర సిబ్బందిగా తమ సేవలు అందిస్తున్నారని..ఇకపై డ్రైవర్లుగానూ తమ ప్రతిభను చాటుకుంటారని అన్నారు. దేశంలో ఇది ఒక కొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సరోజిని నగర్ లో పూర్తిస్థాయి మహిళా సిబ్బందితో కూడిన ఈ డిపోకు సఖి డిపో అని పేరు పెట్టినట్లుగా పేర్కొన్నారు. ఇందులో డిపో మేనేజర్, డ్రైవర్లు, కండక్టర్లు ఇలా సిబ్బంది అంతా మహిళలే అని..దీని కోసం మొత్తం 225 మంది సిబ్బందిని కేటాయించామని ఆయన తెలిపారు.

**నిరసన తెలిపిన మహిళా ఉద్యోగులు**

దేశంలోనే తొలి 'మహిళా' బస్ డిపోను ప్రారంభించడం మంచిదే అయినా.. ప్రస్తుతం రవాణా రంగంలో పని చేస్తున్న తమకు సరైన సౌకర్యాలు లేవని మహిళా ఉద్యోగులు మంత్రి ఎదుట నిరసన చేపట్టారు. ఫిక్స్‌డ్ జీతం, పర్మినెంట్ ఉద్యోగాలకు మంత్రి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధులకు హాజరు కావాలంటే ఉదయం 6 గంటలకే ఇళ్ల నుంచి బయల్దేరి..కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాలని..అయినా ఒక్కోసారి సమయానికి పని ప్రదేశానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మహిళా ఉద్యోగులతో మాట్లాడిన మంత్రి కైలాశ్ గహ్లోత్ వారి డిమాండ్లు నెరవేరుస్తామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## ఝాన్సీ మెడికల్ కాలేజీలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)




పూర్తిగా వ్యాపించి ఉండటం వల్ల మంటలు భారీగా విస్తరించాయని ఆస్పత్రి సూపరిండెంట్ సచిన్‌మహోర్ తెలిపారు. మంటల ధాటికి వార్డులోని పిల్లల బెడ్లు, ఇతర సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అటు చిన్నారుల మృతితో ఆస్పత్రి ప్రాంగణంలో కన్నవారి రోదనలు మిన్నంటాయి.

**'12 గంటల్లో నివేదిక ఇవ్వండి'**

సమాచారం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపకదళం చర్యలు చేపట్టింది. ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. ప్రమాదంపై 12 గంటల్లోగా నివేదిక సమర్పించాలని ఝాన్సీ డివిజనల్ కమీషనర్ పోలీస్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను ఆదేశించారు.

**రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**

మహారాణి లక్ష్మీబాయి వైద్య కళాశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో నవజాత శిశువుల మరణ వార్త బాధాకరమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ వేదికగా రాష్ట్రపతి సంతాపం ప్రకటించారు. హృదయవిదారక ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పిల్లల కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోదీ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటనను భరించే శక్తిని మృతుల కుటుంబాలకు ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డ చిన్నారులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మరోవైపు ఆస్పత్రి ఘటనలో మృతిచెందిన శిశువుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడ్డ చిన్నారులకు రూ.50 వేల పరిహారాన్ని ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు.

**'ఇప్పుడేం చెప్పలేం'**

ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్, ఆరోగ్య మంత్రి అర్ధరాత్రి ఝాన్సీకి చేరుకున్నారు. ఘటనాస్థలిని పరిశీలించారు. విచారణ నివేదిక వచ్చిన తర్వాత దీనిపై ఓ క్లారిటీ వస్తుందని తెలిపారు. "శనజాత శిశువులు మరణం చాలా దురదృష్టకరం. ఈ ఘటనపై మొదటి దర్యాప్తు ఆరోగ్య శాఖ చేపడుతుంది. రెండో విచారణ పోలీసులు చేస్తారు. అగ్నిమాపక విభాగం కూడా అందులో భాగం అవుతుంది. అంతేకాకుండా మేజిస్ట్రేట్ స్థాయి విచారణ కూడా ఆదేశించాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవ్వరినీ వదిలిపెట్టం. కుటుంబ సభ్యులతో పాటు మేము చిన్నారుల మృతదేహాలను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాము. ఇప్పటివరకు ఏడుగురి చిన్నారుల మృతదేహాలను గుర్తించాం. మరో మూడు మృతదేహాలను గుర్తించలేదు. నవజాత శిశువులను కోల్పోయిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటాం. ఫిబ్రవరిలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ జరిగింది. జూన్‌లో మాక్ డ్రిల్ కూడా నిర్వహించారు. అయితే ఈ దుర్ఘటన ఎలా జరిగిందో అనే విషయం విచారణ నివేదిక వచ్చిన తర్వాతే చెప్పగలం." అని పాఠక్ తెలిపారు.

**ఆమె అగ్గిపుల్ల వెలిగించడం వల్లే ప్రమాదమా?**

ఝాన్సీలోని మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్ కళాశాలలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో మంటలు వ్యాపించి పది మంది శిశువులు సజీవదహనం ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్న సమయంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దుర్ఘటనకు ఓ నర్సు నిర్లక్ష్యమే కారణమని ప్రత్యక్ష సాక్షి ఒకరు ఆరోపించారు. హమీర్‌పూర్‌కు చెందిన భగవాన్ దాస్ అనే వ్యక్తి కుమారుడు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నాడు. ఘటన జరిగిన సమయంలో భగవాన్ దాస్ అక్కడే ఉన్నాడు. యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ నర్సు ఆక్సిజన్ సిలిండర్ పైప్‌ను కనెక్ట్ చేస్తున్న సమయంలో దానిపక్కన మరో నర్సు అగ్గిపుల్ల వెలిగించిందని అందువల్లే ప్రమాదం జరిగిందని అతడు తెలిపాడు. అది ఆక్సిజన్ అధికంగా ఉన్న ప్రదేశం కావడంతో క్షణాల్లో మంటలు చుట్టుముట్టాయని.. వెంటనే నలుగురు పిల్లలను తన మెడకు బట్టలో చుట్టుకొని బయటకు పరిగెత్తానని అన్నాడు. ఇతరుల సాయంతో మరికొంతమంది చిన్నారులను కాపాడగలిగామన్నాడు. మంటలు వ్యాపించి.. దట్టంగా పొగలు కమ్ముకోవడంతో ఆసుపత్రిలో ఉన్నవారు భయంతో పరుగులు తీశారని.. దానివల్ల తొక్కిసలాట జరిగి అనేకమంది గాయాలపాలయ్యారని పేర్కొన్నాడు. అయితే మంటలు అంటుకున్న సమయంలో సేఫ్టీ అలారాలు మోగకపోవడం, వార్డులో గడువు ముగిసిన అగ్నిమాపక పరికరాలు ఉండడంతో అందరు చిన్నారులను రక్షించలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ ప్రమాదంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ స్పందిస్తూ అగ్నిప్రమాదానికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని.. చిన్నారుల మరణాలకు కారణమైన వారిని వదిలిపెట్టమని అన్నారు.

**యూపీ ఆస్పత్రి ఘటన.. దర్యాప్తునకు నలుగురు సభ్యుల కమిటీ**

ఝాన్సీలోని ఆస్పత్రిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం ఘటనపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఉత్తరప్రదేశ్ ఆరోగ్యశాఖకు చెందిన నలుగురు ఉన్నతాధికారులతో కూడిన కమిటీ అగ్నిప్రమాద ఘటనపై దర్యాప్తు జరిపి ఏడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. కమిటీ వైద్యవిద్య డీజీ నేతృత్వంలో దర్యాప్తు జరపనుంది.

## మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ బాధితుల పక్షాన పోరాటం చేసే బాధ్యతను బీజేపీ తీసుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ రోజు బాధిత ప్రాంతాల్లో వారితో కలిసి నిద్రపోతున్నామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతమైన అంబర్‌పేట తులసీనగర్‌లో బాధిత కుటుంబాలతో కలిసి రాత్రి బస చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, ఎప్పుడు బుల్డోజర్‌తో ఇల్లు కూలగొడతారో అనే భయంతో ప్రజలున్నారని చెప్పారు. ప్రజలకు భరోసా కల్పించేందుకే బీజేపీ అనేక బస్తీల్లో రాత్రి బస చేస్తుందన్నారు. మూసీ బాధితుల బాధ్యత తమ పార్టీ తీసుకుంటుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు.

## నటి కస్తూరి అరెస్ట్..

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. అక్కడి జనాలను ఉద్దేశించి మాట్లాడుతూ తమిళ రాజులకు సేవ చేసుకునేందుకు వచ్చిన వారే తెలుగువారంటూ వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకున్నారు. ఆమె వ్యాఖ్యలపై కొందరు పోలీసులను ఆశ్రయించారు. దాంతో, కస్తూరి ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. కానీ, సదరు హైకోర్టు ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అందుకని పోలీసులకు చిక్కకూడదనే ఉద్దేశంతో ఆమె ఫోన్ స్విచాఫ్ చేసి హైదరాబాద్‌లో తలదాచుకుంది. 300 సంవత్సరాల కిందట ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు వచ్చిన తెలుగు వారు.. ప్రస్తుతం 'మాది తమిళ జాతి' అంటున్నారన్నారు. ఎప్పుడో ఇక్కడకు వచ్చిన బ్రాహ్మణులను తమిళులు కాదని చెప్పేందుకు మీరెవరంటూ ద్రవిడ సిద్ధాంత వాదులపై ఆమె మండిపడ్డారు. ఇతరుల ఆస్తులను లూటీ చేయొద్దని.. ఇతరుల భార్యలపై మోజుపడొద్దని, ఒకరికంటే ఎక్కువ మంది భార్యలను చేసుకోవద్దని బ్రాహ్మణులు చెబుతుండడంతోనే తమిళనాడులో వారికి వ్యతిరేకంగా ప్రచారం జరుగుతోందంటూ కస్తూరి విమర్శించారు. కస్తూరి వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆమె క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై మహాజన సంఘం రాష్ట్ర సభ్యుడు ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

## తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా డా.గుమ్మడి వెన్నెల

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా గద్దర్ కూతురు డాక్టర్ గుమ్మడి వెన్నెలను నియమిస్తూ ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు డాక్టర్ వెన్నెలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నియమిస్తున్నట్లు ప్రిన్సిపల్‌సెక్రటరి వెల్లడించారు.ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక ఔనత్యాన్ని ఇనుమడించే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. గతంలో తెలంగాణ సాంస్కృతిక సారథిగా రసమయి బాలకిషన్ పనిచేశారు.

## న్యాయం అడిగితే.. దాడులు చేస్తారా?

- సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గం
- బాసర ఐఐఐటి విద్యార్థిని ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- స్వాతిప్రియ కుటుంబానికి న్యాయం చేయాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**విశ్వంభర, హైదరాబాద్:** ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ఐఐఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆత్మహత్య చేసుకున్న బాసర ఐఐఐటీ విద్యార్థిని స్వాతిప్రియ కుటుంబానికి న్యాయం చేయాలని అడిగితే విచక్షణ రహితంగా దాడి చేయిస్తారా? అని ప్రశ్నించారు. బాసర ఐఐఐటీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. ''విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదు. విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం హేయమైన చర్య. బాసర ఐఐఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. అరెస్టు చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలి. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి'' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.నాలుగు రోజుల క్రితం స్వాతిప్రియ అనే విద్యార్థిని బాసర ఐఐఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు.

# మహారాష్ట్ర వచ్చింది ఓట్ల కోసం కాదు

- మరాఠా వీరులకు నివాళులర్పించడానికి
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- మహారాష్ట్రలో నవంబరు 20న అసెంబ్లీ ఎన్నికలు
- ఎన్డీయే అభ్యర్థుల తరపున పవన్ కల్యాణ్ ప్రచారం



**డెగ్లూరు:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శనివారం మహారాష్ట్రలో ఎన్డీయే అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మహారాష్ట్రలోని డెగ్లూరులో జరిగిన ఎన్నికల సభలో పవన్ కల్యాణ్ మరాఠీలో ప్రసంగించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి.

జై భవానీ, జై శివాజీ, జై మహారాష్ట్ర అంటూ ప్రసంగం ప్రారంభించారు. తాను మరాఠీలో ప్రసంగిస్తానని, ఏవైనా తప్పులు ఉంటే క్షమించాలని కోరారు. ఇది ఛత్రపతి శివాజీ పరిపాలించిన భూమి, ఇది ఆయన నడిచిన నేల, ఇంతటి వీరత్వం కలిగిన గడ్డ మహారాష్ట్ర.. మరాఠా ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు అంటూ ప్రసంగించారు.

తాను ఇక్కడికి ఓట్లు అడిగేందుకు రాలేదని, మరాఠా వీరులకు నివాళులర్పించడానికి వచ్చానని పవన్ పేర్కొన్నారు. మరాఠా యోధుల పోరాటాన్ని గుర్తుచేసుకోవడానికి, శివాజీ మహరాజ్ పరిపాలనను, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని గుర్తుచేసుకోవడానికి వచ్చానని వివరించారు. స్వరాజ్యం అర్థం తెలిపిన నేల, అంబేద్కర్ జన్మించిన నేలపై నివాళులర్పించేందుకు వచ్చానని పేర్కొన్నారు.

"గత పదేళ్లుగా నేను ఎన్డీయేతో కలిసి ఉన్నాను. బాలాసాహెబ్ ఠాక్రే మరణించినప్పుడు నివాళులర్పించిన వ్యక్తిని నేను అన్నారు. శివసేన వ్యవస్థాపకుడు, హిందూ హృదయ సామ్రాట్ బాలా సాహెబ్ ఠాక్రే నుంచి ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదాన్ని నేర్చుకున్నాను. అయితే, ఆయన జీవించి ఉన్నప్పుడు ఆయనను కలవలేకపోయాను. ఏ విషయంపై అయినా అధికారంతో సంబంధం లేకుండా పోరాటం చేయడం ఆయన నుంచి నేర్చుకున్నాను.

ఇక, ఎన్డీయే ప్రభుత్వం విషయానికొస్తే... ఎన్డీయే హయాంలో డెగ్లూరులో ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం, పోలీస్ స్టేషన్, హేమద్పంతి ఆలయ అభివృద్ధి జరుగుతోంది. అభివృద్ధి కొనసాగాలంటే ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజల సహకారం కావాలి. డెగ్లూర్ అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్డీయే సభ్యుడి విజయం ఎంతో అవసరం అన్నారు.

మనం సనాతన ధర్మం కోసం నిలబడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సినిమాల్లో గొడవలు పెట్టుకోవడం, పోరాటాలు చేయడం ఎంతో ఈజీ. కానీ రియల్ లైఫ్ లో ధర్మ పోరాటాలు చేయడం ఎంతో కష్టం. మనం సనాతన ధర్మం కోసం పోరాడాలి, నిలబడాలి. మనం మతాలుగా విడిపోయినా సెక్యులర్ దేశంగా అవతరించాం. సనాతన ధర్మం కోసం పనిచేద్దాం. మనం ధైర్యంగా ఉంటే ఎవరు తల్వార్ పట్టుకుని వచ్చినా మనల్ని ఏమీ చేయలేరు" అని పవన్ స్పష్టం చేశారు. అంతకుముందు, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ ప్రసంగిస్తూ... ఇవాళ డెగ్లూరుకు వచ్చింది పవన్ కల్యాణ్ కాదు... ఆంధీ కల్యాణ్ (తుపాను కల్యాణ్) అని అభివర్ణించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలిచాక... పవన్ ఢిల్లీ వెళ్లారు. ఆ సమయంలోనే ప్రధాని మోదీ మొదటిసారిగా పవన్ ను ఆంధీ (తుపాను) అని అభివర్ణించారు. ఇప్పుడు అశోక్ చవాన్ కూడా అదే ప్రస్తావించారు.

ఇక, డెగ్లూరు సభలో ఏపీ ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ప్రసంగిస్తూ... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురించి ప్రధాని మోదీ పార్లమెంటులో కూడా చెప్పారని, పవన్ ఆలోచన ఏపీలో 175 సీట్లలో 164 సీట్లు గెలిచేలా చేసిందని కొనియాడారు.

షోలాపూర్ లో పవన్ కు బ్రహ్మరథం

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహారాష్ట్రలో ఇవాళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తెలిసిందే. ఎన్డీయే అసెంబ్లీ అభ్యర్థుల తరపున సభలు, రోడ్ షోలకు పవన్ హాజరవుతున్నారు. డెగ్లూర్, నాందేడ్ వంటి ప్రాంతాల్లో పవన్ సభలకు విశేష స్పందన లభించింది.

ముఖ్యంగా, షోలాపూర్ నగరంలో పవన్ రోడ్ షోకు మహారాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పట్టారు. షోలాపూర్ లో అడుగుపెట్టిన జనసేనానికి అపూర్వ స్వాగతం లభించడం చూస్తే... అది మహారాష్ట్రనా, లేక ఏపీనా అనిపించింది.

డీజే పాటలు, బ్యాండ్ కోలాహలం నడుమ అట్టహాసంగా పవన్ రోడ్ షో సాగింది. రోడ్డు పక్కన ఇళ్లలోని వారు కూడా పవన్ పై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. పవన్ అందరికీ అభివాదం చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



## వేదవాఙ్మయం సులభశైలిలో లభించడం గొప్ప విషయం



**విశ్వంభర, హైదరాబాద్ :** నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్ లలితకళాతోరణంలో.. దర్శనం పత్రిక ద్విదశాబ్ది మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి మైసూరు అవధూత దత్త పీఠాధీశ్వరులు గణపతి సచ్చిదానంద స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఈ పత్రిక ఆధ్యాత్మిక పత్రికారంగంలో అనేక సంవత్సరాలపాటు నిరంతరాయంగా, నిర్విఘ్నంగా కొనసాగించం వెంకటరమణ శర్మ వల్లనే సాధ్యమైందన్నారు. ఈ పత్రికలో వేదవాఙ్మయంలోని అపారజ్ఞానరాశిని సంక్షిప్త సుందరంగా సులభశైలిలో లభిస్తుందన్నారు. దీనిలో అనేకాధ్యాత్మికాంశాలు వివిధ వ్యాసరూపాలలో ఉంటాయన్నారు. వేదాలలోని ఉపనిషత్తులతో ప్రపంచీకృతం అయిన వాదోపవాదాలూ, చర్చలూ, ప్రశ్నోత్తరాలూ ఇందులో ఉంటాయన్నారు.చతుర్విధ పురుషార్థ సాధనకు పట్టుకొమ్మలైన రామాయణ, భారత, భాగవతేతిహాసాలలోని రమణీయకథలూ, కమనీయ ఘట్టాలూ సుందర వర్ణనలతో ఉంటాయన్నారు. ప్రస్థాన త్రయాలలోని ఉపనిషత్తులనూ, బ్రహ్మసూత్రాలనూ, భగవద్గీతనూ అన్ని కోణాలనుండి అధ్యయనం చేసి విడమరచి చెప్పే విద్వాంసుల రచనలు ఈ పత్రికకు అలంకారాలు అన్నారు. బీఆర్ఎస్ నేత హరీష్ రావు మాట్లాడుతూ 20 ఏళ్లనుంచి నిర్విఘ్నంగా పత్రికను నడిపిస్తున్న మారమాముల వెంకటరమణ శర్మకు అభినందనలు తెలిపారు. దర్శనమ్ అధినేత మారుమాముల వెంకటరమణ శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక పత్రిక నిరంతరాయంగా కొనసాగేందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమానికి సోలిస్ కంటి ఆస్పత్రివారు అన్న ప్రసాద సంతర్పణ చేశారు.




## చైతన్య పాఠశాలలో ఘనంగా స్వయంపాలన



**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలోని చైతన్య పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా శనివారం స్వయంపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో విద్యార్థిని విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని కలెక్టర్, డీఈవో, ఎంఈవో తదితర వేశాధారణలతో అలరించారు.

ఈ సందర్భంగా చైతన్య పాఠశాల కరెస్పాండంట్ మేరెడ్డి యల్లారెడ్డి విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏది ఉండదని చిన్ననాటి నుండి లక్ష్యాలను ఎంపిక చేసుకొని వాటి సాధన కొరకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సారెడ్డి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు శరత్, ఆనంద్ హసేన్ మియా, మనోహర్, శ్రావణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీకి జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి రాజీనామా



**విశ్వంభర, ఎల్బీనగర్ :** చంటి ముదిరాజ్ (జాతీయ ప్రధాన కార్యదర్శి), సూర స్రవంతి (రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు), మల్లం వెంకటేశం (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), గుండెల రాయుడు (రాష్ట్ర కార్యదర్శి), సాధబోయిన రాజు(వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు), అంతటి అజయ్ కుమార్ (రంగారెడ్డి జిల్లా కార్యదర్శి), దయ్యాల ప్రణయ్ కుమార్ (కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్), దాదాపు గత రెండు సంవత్సరాలుగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీలో కొనసాగుతున్నట్లు వారు తెలిపారు. కొన్ని అనివార్య, వ్యక్తిగత కారణాల దృశ్యా తాము సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీని వీడాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీలో తమకు సహకరించిన పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల మహేష్ గౌడ్, బొమ్మరగోని ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తమ్ముడి మృతితో బాధపడుతున్న చంద్రబాబుకు రాహుల్ గాంధీ ఫోన్




**విశ్వంభర, డెస్క్ :** ఏపీ సీఎం చంద్రబాబు తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడి మృతితో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇవాళ ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు... ఏఐజీ ఆసుపత్రి వద్ద బాధలో ఉన్న ఇతర కుటుంబ సభ్యులను చూడగానే మరింత వేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో, సోదరుడి మృతితో తీవ్ర విచారానికి గురైన చంద్రబాబుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేసి పరామర్శించారు. విషాదంలో ఉన్న చంద్రబాబు కుటుంబానికి రాహుల్ గాంధీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.






# వీరశైవుల వాఙ్మయమంతా శివమయమే




సాహిత్యం సమకాలీన సమాజానికి దర్పణం. సాహిత్య చరిత్రలో ఏ కాలాన్ని పరిశీలించినా ఈ అంశం స్పష్టమవుతున్నది. ఆయా కాలాల సామాజిక సాంస్కృతిక జీవనమే ఆయా రచనల్లో ప్రతిబింబిస్తుంది. శైవకవుల యుగంలోనూ ఆయా కాలాల సామాజిక సాంస్కృతిక జీవనం వారి సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది.

నన్నయ, తిక్కన మధ్యకాలాన్ని శివకవియుగంగా పేర్కొన్నారు. సుమారు 1100 సంవత్సరం నుంచి 1225 సంవత్సరం వరకు శివ కవుల యుగంగా డాక్టర్ పింగళి లక్ష్మీకాంతం తన ఆంధ్ర సాహిత్య చరిత్రలో నిరూపించారు. పరమేశ్వరుని తమ దైవంగా భావించి కాయకమే కైలాసం అంటూ శివారాధకులను పరమ ప్రీతితో సేవించిన వారే వీరశైవులు. వీరి దృష్టిలో వాఙ్మయమంతా వీరశైవమే. శివుని ఢమరుకం నుండి వెలువడిన శబ్దాలే అక్షరాలు. వీరి సాహిత్యమంతా శివమయమే. నన్నెచోడుడు, మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమన ఈ యుగంలో సుప్రసిద్ధ శివ కవులుగా ప్రసిద్ధి చెందినప్పటికీ మీరు అనంతర కాలంలో శైవ కవిత్వం రాసిన కవుల కవిత్వాన్ని కూడా ఈ వ్యాసంలో పరిగణనలోకి తీసుకుంటున్నాను. నన్నెచోడుడు,బద్దెన, పావులూరి మల్లన, మల్లికార్జున పండితారాధ్యుడు, యథావాక్కుల అన్నమయ్య, పాల్కురికి సోమనాథుడు, రావిపాటి తిప్పన, శరభాంకుడు, చిమ్మపూడి అమరేశ్వరుడు, ఎర్రన, మడికి సింగన, శ్రీనాథుడు, నిశ్శంక కొమ్మన, దగ్గుపల్లి దుగ్గన, పోతన మొదలైన ప్రాచీన కవులంతా శైవ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వారే . వీరి సాహిత్యంలోని సామాజిక సాంస్కృతిక చారిత్రక దృక్పథాలను తెలియపరచడం ఈ వ్యాసం లక్ష్యం.

**చారిత్రక దృక్పథం :**

చరిత్రకు, సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉంటుంది. చరిత్ర లేని సాహిత్యం, సాహిత్యాన్ని ప్రతిబింబించని చరిత్ర రెండు అసంపూర్ణాలే. శైవ కవిత్వాన్ని అధ్యయనం చేసే సాహిత్య విద్యార్థులకు పరిశోధకులకు చారిత్రక దృక్పథం ఎంతో అవసరం. వైదిక మతంలో యజ్ఞ యాగాదుల నిర్వహణ అధికారం బ్రాహ్మణులకు తప్ప ఇతరులకు లేని కాలంలో బ్రాహ్మణేతరుల ఆధ్యాత్మిక అవసరాలు తీర్చే క్రమంలో భక్తి భావన అభివృద్ధి చెందింది అనేది చారిత్రక సత్యం. శైవ భక్తి తత్వంలో అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం ఉంది అని శైవ కవిత్వం ద్వారా అవగతం అవుతున్నది. బసవ పురాణంలోని భక్తులు అనేక సబ్బండవర్ణాల వారు కావడం ఇందుకు నిదర్శనం. శైవ కవిత్వ ఉద్యమ స్వరూప స్వభావాలను అవగాహన చేసుకోవాలంటే నాటి చారిత్రక నేపథ్యాన్ని ముందు అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పుస్తకం ఆరవ శతాబ్దం నాటికే శివాలయాల నిర్మాణం జరిగినట్లుగా శాసనాధారాలు తెలియజేస్తున్నాయి. తమిళ దేశంలో శైవభక్తులు నయనార్లుగా జైన బౌద్ధాలను నిరసిస్తూ శైవ సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. పూర్వ తెలుగు ప్రాంతపు చాళుక్యులకు తమిళ దేశపు చోళులతో ఏర్పడిన రాజకీయ వైవాహిక సంబంధాల కారణంగా ఈ శైవం తెలుగు ప్రాంతాలకు కూడా వ్యాపించింది.( చూ: తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ పుట సంఖ్య 2). ఓరుగల్లు రాజధానిగా తెలుగు నేలను అప్రతిహతంగా పరిపాలించిన కాకతీయులు మొదట్లో జైన మతం అవలంబించినప్పటికీ అనంతరం శైవ మతాన్ని స్వీకరించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇదే సమయంలో కన్నడ దేశంలో బిజ్జలుడి కొలువులో ప్రధానిగా పనిచేసిన బసవేశ్వరుడు వీరశైవ మతాన్ని ఒక ఉద్యమంగా ప్రచారం చేశాడు. బసవ పురాణంలో ఇటువంటి చారిత్రక సంఘటనలు దర్శనమిస్తాయి. హైందవ మతంలో సంఘసంస్కరణోద్యమానికి బీజం వేసింది వీరశైవ మతమే. రాజ కవి అయిన నన్నె చోడుడు తన కుమార సంభవం ద్వారా శైవ మతానికి విశేష ప్రాచుర్యాన్ని కల్పించాడు. శివకవి యుగం అనంతరం కూడా శ్రీ నాథుడు, పోతన తమ శైవకావ్యాల ద్వారా ఆయా కాలాలలో శివ తత్వాన్ని ప్రచారం చేశారు. శ్రీ నాథుడు ఈశ్వరార్చన కళాశీలుడుగా ప్రసిద్ధిగాంచాడు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ధూర్జటి గొప్ప శివకవిగా కీర్తి గడించాడు. ధూర్జటి రాసిన శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం, తెనాలి రామకృష్ణుని ఉద్భటారాధ్య చరిత్ర రాయల కాలంలో శివ భక్తిని చాటిన గ్రంథాలు. ఈ విధంగా చరిత్ర దృష్టితో చూసినప్పుడు కన్నడ, తమిళ , తెలుగు దేశాల ఆనాటి దేశీయ వాతావరణం శైవ కవిత్వానికి దోహదం చేసిందని, ఆనాటి సమాజంలోని అసమానతలు ప్రజలు శైవభక్తి వైపు మొగ్గడానికి కారణం అయ్యాయని, సాహిత్యంలో విప్లవాత్మక మార్పులకు శైవ కవిత్వం బీజం వేసిందని తెలుస్తున్నది.

**సామాజిక దృక్పథం:**

సమకాలీన సమాజాన్ని చిత్రించిన కవిత్వమే సజీవంగా నిలుస్తుంది. తెలుగు సాహిత్యారంభం నుంచి వచ్చిన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే ఈ విషయాన్ని గమనించవచ్చు ఆయా కాలాలలో ప్రజల జీవన విధానం, వృత్తులు, పరిపాలనా విధానాలు, నేరాలకు విధించే శిక్షలు, మొదలైన అనేక అంశాలు సాహిత్యంలో చర్చకు వస్తాయి. శైవ సాహిత్యంలోనూ ఈ అంశాలన్నీ కనిపిస్తున్నాయి. కుమార సంభవం ఏడవ అశ్వాసంలో హిమవంతుని నగరమైన ఓషధి ప్రస్థం నగర వర్ణన ఆనాటి సమాజంలోని నగరాలను ప్రతిబింబిస్తుంది. పాల్కురికి సోమనాథుని బసవ పురాణంలో ఎడ్లతో లాగి నీళ్లను తోడిపోసే జల యంత్రానికి సంబంధించిన వర్ణన కనిపిస్తుంది. వడ్రంగి నిపుణత్వాన్ని గురించి తెలియజేస్తూ

"చటుల సంస్కృతి జీవ ఘట చక్ర కర్మ
పటు పరివర్తన భ్రమణంబు గూర్చి
కీలువందించి యాక్రియరాటనముల
వాలి ఆడించు నా వడ్రంగి అతడు" అంటూ బసవపురాణంలో ఆనాటి వ్యవసాయ విధానాన్ని తెలియజేశారు. ఇదే అంశం కుమార సంభవంలోనూ కుండలతో నీళ్లు తోడి పోసే పద్ధతిగా గుండ్రల రాట్నాన్ని గురించి నన్నెచోడుడు వర్ణించాడు. బసవ పురాణంలో పాల్కురికి సోమనాథుడు దొంగతనం చేస్తున్న పద్ధతులను కూడా చక్కగా వివరించాడు.

సూచీ ముఖం బైన చొనుపంగ రాని
యేచిన చీకటి నిండ్ల పంచలకు
జీడిముడి పలుకుల చేరి యుల్వరిని
గడియ కన్నంబును గడప కన్నంబు
గోడ కన్నంబును గురి నేల కన్న
మోడక త్రవ్వి ఇల్లొయ్యన జొచ్చి ... అంటూ ఆనాటి చోర కళను చక్కగా అభివర్ణించారు.

ఇదేగాక బసవ పురాణంలో పాలను కొలిచే పాత్రలు, గురుగులు , బానలు, కుండలు, ఉట్టి పయిన నెయ్యి, కుండలో పటిక బెల్లం మొదలైన వాని ప్రస్తావన గొడగూచి కథ సందర్భంలో కనిపిస్తుంది. శ్రీనాథుని కాశీఖండంలో ఇంటి ముందు ఉండే అరుగులు, పందిళ్లు, ఇంటి వెనుక పెరడు మొదలైన గృహ సంబంధ అంశాలు కనిపిస్తాయి. అంగడి నుండి ఇంటికి వచ్చిన వైశ్యుడు అరుగుపై విశ్రాంతి తీసుకునే సన్నివేశాన్ని ఈ కింది పద్యంలో వర్ణించాడు.

అంగడి నుండి బియ్యము పదార్థములుంగొని వచ్చి దప్పిపై సంఘము దూల నుప్పొనుచు నల్లన కోమటి సెట్టి మందిర ప్రాంగణ సీమ వేదిపై పందిరి నీడను విశ్రమించి.... ఈ పద్యం ద్వారా ఆనాటి గృహసీమల ముందు అరుగులు ఉంటాయని తెలియుచున్నది.

**సాంస్కృతిక దృక్పథం:**

మనిషి జీవన విధానమే అతని సంస్కృతి. మానవుని సాంస్కృతిక జీవనంలో పండుగలు, ఆచార వ్యవహారాలు, ఆటపాటలు, వినోదాలు, వస్త్రధారణ, సంప్రదాయాలు, నమ్మకాలు మొదలైన అంశాలన్నీ భాగమవుతాయి. నేడు హోలీ పండుగగా జరుపుకుంటున్న వేడుక నన్నె చోడుడి కాలం నాడు వసంతోత్సవంగా జరుపుకునే వారని కుమార సంభవం కావ్యం ద్వారా తెలుస్తున్నది. శివపార్వతుల వివాహానంతరం బంధువులంతా వసంతోత్సవం జరుపుకున్నట్లు కుమార సంభవంలో ఉంది. బసవ పురాణంలో నందికేశ్వర వ్రతం ప్రస్తావన కనిపిస్తుంది. ఇది వరుసగా తొమ్మిది సోమ వారాలు ఆచరించే వారని తెలుస్తుంది. శివ పూజ సోమవారాల్లోనే చేసే సంప్రదాయం పండితారాధ్య చరిత్ర కాలం నుంచే ఉన్నట్లు ఆ గ్రంథం ద్వారా తెలుస్తుంది. శివరాత్రి మహత్యం గ్రంథంలో సంక్రాంతి పండుగ, నాగుల చవితి, రథసప్తమి మొదలైన పండుగల ప్రస్తావన కనిపిస్తుంది.

వీరభద్రుని జాతరలు పాల్కురికి సోమన కాలం నుండే జరుగుతున్నాయి. బసవపురాణంలో గొడగూచి

"వీరభద్రుని జాతర వేళ నిన్బండి
యేరొప్ప బనిచెద నా ప్రాలు ద్రావు... అంటూ శివుణ్ణి తనతో బండి ఎక్కించుకొని వీరభద్రుడికి జాతరకు తీసుకుపోతానని, పాలు తాగమని వేడుకుంటుంది. ఈ సన్నివేశం ద్వారా ఆనాటికే వీరభద్రుని జాతర ప్రసిద్ధి చెందింది అని తెలుస్తుంది. పాలకుర్తి నివాసి అయిన సోమనాథుడు బహుశా తన సమీప గ్రామమైన కొరవి వీరభద్రుని జాతర గురించి ఈ సన్నివేశంలో ప్రస్తావించి ఉండవచ్చు. నేటికీ కొరవి వీరభద్రుని జాతర తెలంగాణలో సుప్రసిద్ధ జాతర. శ్రీనాధుని భీమ ఖండంలోనూ జాతర ప్రస్తావన కనిపిస్తుంది. భీమేశ్వరంలో జరిగే జాతరకు సాక్షాత్తు ఇంద్రుడే అప్సరసలతో వచ్చాడని భీమ ఖండంలో వివరించారు.

మానవ జీవితంలో అత్యంత ప్రధానమైన ఘట్టం వివాహం. ఇది మన సంస్కృతిలో భాగం. వివాహ సంబంధ ఆచారాలను శైవ కవులు ఆయా కాలాల సంప్రదాయాలను సందర్భానుసారం వారి గ్రంథాలలో వివరించారు.పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో బసవేశ్వరుడి వివాహ ఘట్టాన్ని అత్యంత రమణీయంగా వర్ణించారు.

"మకర తోరణములు మణి తోరణములు
ముకుర తోరణములు మునుగట్ట బనిచి
గలయంగా వీధుల కస్తూరి యలుకు
డెలమి ముక్తాఫలంబుల ముగ్గులిడుదు"( బసవ పురాణం పాల్కురికి సోమన, పరిష్కర్త: వేటూరి ప్రభాకర్ శాస్త్రి పుట సంఖ్య 22 ) అనే వాక్యాలను పరిశీలిస్తే వివాహ సందర్భంలో తోరణాలు అలంకరణ, కస్తూరి తో అలకడం, ముగ్గులు పెట్టడంవంటి సంప్రదాయాలు ఉండేవి అని తెలుస్తుంది. బసవ పురాణంలో కట్న కానుకల ప్రసక్తి కూడా కనిపిస్తుంది. వివాహానంతరం కల్యాణ కటకానికి వచ్చిన బసవేశ్వరుడికి అనేక కానుకలు, నూతన వస్త్రాలు ఇవ్వడం గమనించవచ్చు.

**" వచ్చువారును చూచువారును గట్ట**
నిచ్చు వారును చూసి ఏగెడివారు" (బసవపురాణం ద్వితీయ శ్వాసం పుట 29) అనే కవిత్వ పాదం కట్ట కానుకల ప్రస్తావన అంశాన్ని నిర్ధారిస్తుంది. మడివేలు మాచయ్య కథలోనూ కట్నం ప్రస్తావన ఉంది.

ఆటపాటలు కూడా మన సంస్కృతిలో భాగమే. చిన్నపిల్లల బొమ్మలు ఆటల ప్రస్తావన బసవపురాణం లో కనిపిస్తుంది. గొడగూచి అనే బాలిక గొప్ప శివ భక్తురాలు. తాను తీసుకుపోయిన పాలు శివుడు తాగాలని మారాం చేస్తుంది. ఎవడు తాగకపోయేసరికి తనకు పోలెలు ఇస్తానని, తాను ఆడుకునే గురుగులు ఇస్తానని ఆశ చూపుతుంది.

"మూల పన్నారులయావిలో బోలెలున్నవి పంపు బోయి తెచ్చెదను"( బసవ పురాణం తృతీయ అశ్వాసం పుట 71) బసవపురాణంలో కోలాటం ఆటలు, పేరిణి నృత్యాలు, కేళిక మొదలైన సాంప్రదాయక నృత్యాల ప్రస్తావన బసవేశ్వరుని వివాహ ఘట్టంలో కనిపిస్తుంది. కుమార సభవంలోనూ చిలుక బొమ్మలు దంతపు బొమ్మలు మేలు గాజులు బొమ్మరిల్లు బొమ్మల పెళ్లిళ్లు మొదలైన ప్రస్తావన కనిపిస్తున్నది. శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం లో తిన్నడు చెంచు బాలకులతో మాట్లాడిన సందర్భంలో దాగుడుమూతలు వెన్నెల కుప్పలు గుడి గుడి గుంచాలు, గ్రచ్చకాయలు మొదలైన గ్రామీణ క్రీడలను గురించి ప్రస్తావన కనిపిస్తుంది.

ఈ విధంగా శైవ కవులు తమ గ్రంథాల ద్వారా ఆనాటి చారిత్రక, సామాజిక సాంస్కృతిక జీవన స్థితిగతులను తమ రచనల ద్వారా ముందు తరాలకు అందించారు. నిడివి పరిమితి దృష్ట్యా సంక్షిప్తంగా మాత్రమే ఆయా అంశాలను ఈ వ్యాసంలో ప్రస్తావించినాను. మరింత లోతైన అధ్యయనం చేయడం ద్వారా నాటి సమాజం నుండి నేటి సమాజానికి అందిన సాంస్కృతిక సామాజిక విలువలను మరింత విస్తృతంగా తెలపడానికి అవకాశం ఉంది.

- సాగర్ల సత్తయ్య
7989117415

# మహా భారతంలో వ్యక్తిత్వవికాసం



ఈ సమస్త సృష్టిలో ప్రాణులన్నీ శ్రేష్టమైనవి. అందులో మానవుడు సర్వ శ్రేష్టమైనవాడు. మనిషికి ఇతర ప్రాణులకు మధ్యన వ్యత్యాసాన్ని కలిగించేవి ఐదు మాత్రమే. అవి వివేకము, విచక్షణ, వ్యక్తిత్వ వికాసము, మనసు, బుద్ధి. అయితే ఈ ఐదింటిలో వ్యక్తిత్వ వికాసము కలిగిన వ్యక్తి సమాజానికి జాతికి దేశానికి ఎంతో ఆదర్శనీయుడు అవుతాడు. సనాతన హైందవ ధర్మంలో చతుర్వేదాలు, రామాయణ, భారత, భాగవత ఇతిహాసాలు, అష్టాదశ పురాణాలు ముఖ్యంగా వ్యక్తి వికాసానికి కావలసిన విషయాలను వివరిస్తున్నాయి. వాటిలో పంచమ వేదంగా కీర్తినొందిన మహాభారతం వ్యక్తిత్వ వికాసానికి కావలసిన విషయాలను, సందర్భాలను ఆ వ్యక్తులను ఆలోచింపజేస్తూ మానవాళికి ఎలాంటి సందేశాన్ని ఇచ్చిందో ఈ వ్యాసంలో తెలుసుకుందాం!

మానవుడు సుఖశాంతులతో బతకాలంటే పదిమంది మెచ్చుకునే విధంగా నడుచుకోవాలి. ఓరిమి కలవారిని అల్పులుగా భావించకూడదు. ఎదుటివారికి బాధ కలగకుండా మన పనిని చాకచక్యంగా పూర్తి చేసుకోవాలి. ప్రియంగా మనస్సును ఆకట్టుకునే విధంగా ఎదుటివారికి తృప్తి కలిగించే విధంగా మాట్లాడాలి. మాట్లాడే తీరుతోనే ఎవరితోనైనా స్నేహబంధం ఏర్పడుతుంది. వివేకం పలుకుబడి అన్ని మాటలలోనే ఇమిడి ఉన్నాయి. అందువల్లనే 'పెదవి దాటితే పృథ్వి దాటుతుంది' అనే మాట అందరం గుర్తుంచుకోవాలి. బాగా ఆలోచించి జాగ్రత్తగా మాట్లాడాలి అంటుంది మహాభారతం.

విషమ సమస్యలు ఎదురైనప్పుడు ప్రధానులతోనే సంప్రదించాలి. 1000 మంది మూర్ఖులను ఆదరించి చేర దీయడం ఎంత అవివేకమో, వివేకము కలిగిన ఒక విద్వాంసుడిని దూరం చేసుకోవడం కూడా అంతకంటే ఎక్కువ హానికరం. దేహారోగ్యానికి శుచిగా ఉండే మితాహారం ఎలా అవసరమో, మానసిక వికాసానికి అనుభవజ్ఞుల మేధావుల సాంగత్యము, అనుదినము సత్పురుషులైన శాస్త్రకోవిదులైన వ్యక్తులతో గోష్టి అంతే అవసరం అంటోంది మహాభారతం.

మనసుకు ఉల్లాసం కలిగించే సల్లాపాలు పలికేవారు కోకొల్లలు. అప్రియమైన హితబోధ చేయగల మంచి స్నేహితుడు దొరకడం కూడా కడుదుర్లభం. కటువుగా ఉన్నా శ్రేయోదాయకమైన హితవు వినగలవాడే ఉత్తమ స్థితిని పొందుతాడు అంటుంది మహాభారతం.మానవులకు క్రోధం మరణహేతువు. క్రోధాన్ని జయించిన వారికి అభ్యుదయ పరంపరలు ప్రాప్తిస్తాయి. స్వర్గాన్ని కోరుకునే మనిషి ధర్మ కర్మాచరణంతో సంసార సాగరం దాటాలి. మృదు స్వభావంతో మెలిగే మనిషికి అసలు శత్రువులే ఉండరు. అందుకే వారిని అజాతశత్రువులు అంటారు. దేశ కాల పరిస్థితులను, బలాబలాలను గ్రహించి సామోపాయంతో కార్యాలను సాధించాలి అంటోంది మహాభారతం. ఏ పని చేయని జీవికి జీవిత లక్ష్యం సిద్ధించదు. ప్రారబ్ధాన్ని నమ్మి పనులను మానకూడదు. ఆత్మవిశ్వాసం సమస్తానికి సర్వులకు మూలహేతువు. సాహసంతో పాప కర్మలకు అంకురార్పణ చేస్తే అవి దుష్ఫలితాలనే ఇస్తాయి. ఉత్తములతో సంప్రదించి సాగించే సన్నాహాలకు దైవ బలం ఎంతో తోడ్పడుతుంది అని చెబుతోంది మహాభారతం.

సభల్లో పాల్గొనేవారు కాళ్లు చేతులు ఇష్టానుసారంగా ఆడించడం, అనవసరమైన సందర్భాల్లో వెకిలిగా నవ్వడం, వికార చేష్టలు చేయడం, పక్కవారిని తమ మాటలతో విసిగించడం ఇవి తగదు. సందర్భానుసారంగా మందహాసాన్ని చేయలే కానీ మరీ బిర్రబిగించుకొని పెదవులు ముడుచుకొని ఉండరాదు అని సభా మర్యాదను తెలియజేస్తుంది మహాభారతం.

మనం చేసే సత్కార్యాలన్నింటి కంటే సన్మార్గంలో నడవడం ఉత్తమమైనది. ఉత్తమ ప్రవర్తన కలిగిన వారు ఇహంలో కీర్తిని, పరంలో సద్గతిని పొందుతారు. ఉత్తమ జీవితానికి లక్షణం నీతి తప్పకుండా బతకడం అని హితవు పలుకుతుంది మహాభారతం. ధర్మ నిష్ఠలతో శీల సంపన్నులై నడిచే వారిని సంపదలన్నీ వరిస్తాయి.మనోవాక్కాయాలతో ప్రాణికోటిపై దయా హృదయం కలిగి ఎవరికీ ద్రోహం చేయకుండా ఉండడమే శీలం. శీలం వల్ల ధర్మం. ధర్మం వల్ల సత్యం. సత్యాన్ని ఆశ్రయించి ప్రవర్తన. ప్రవర్తనను బట్టి ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వం ఆధారపడి ఉంటాయి. అని మహాభారతం వివరిస్తుంది.

ఏ పని అయితే మనకు బాధ కలిగిస్తుందో, ఆ పనులు మనం చేసి ఎదుటి వారికి బాధ కలిగించకుండా ఉండడమే పరమధర్మం. మనస్సును నిశ్చలంగా ఉంచితే జ్ఞానం వికసిస్తుంది. ఆశను జయించిన వానికంటే సుఖంగా ఉండేవాడు ఈ ప్రపంచంలోనే లేడు. ఆహార, విహార, శయ్యా విషయమై ఏ పట్టింపు లేకుండా దొరికిన దానితో తృప్తి పడుతూ నిరాడంబరమైన వైరాగ్య భావముతో కూడిన జీవితాన్ని గడపడం ప్రాజ్ఞుల లక్షణం. అని మహాభారతం వివిధ పాత్రల ద్వారా సమస్త మానవాళికి తెలియజేస్తుంది. 'విశ్వ శ్రేయః కావ్యం' అనే ఉన్నతమైన వాక్యానికి సాకారమే శ్రీ మహాభారతం అని గ్రహించాలి.

**మహా భారతంలోని పాత్రలు, వ్యక్తిత్వాలు**

- ధృతరాష్ట్రుడు, పాండురాజుల వలే... అన్నదమ్ములు కలిసి రాజ్యం వికసింప చేయాలి. శాంతిభద్రతలకు సుస్థిరతను కల్పించాలి
- భీష్మ పితామహుని వలే... పిల్లలు చిన్నవారైతే వారి రక్షకుడుగా ధార్మికుడు, ధార్మిక శక్తితో అండగా నిలవాలి.
- కుంతీదేవి వలే... భర్త పోయిన (లేకున్నా) పిల్లలను సమర్థవంతంగా పెంచి పోషించాలి.
- ధృతరాష్ట్రుడి వలే... అన్నదమ్ముల పిల్లలను సమాదరించాలి.
- పంచ పాండవుల వలే... తండ్రి లేని పిల్లలు 10 మందిలో తలలోని నాలుక వలె మెలగాలి.
- దుర్యోధనుడి వలే... అధికార దాహం, దుర్మార్గపు పోకడ, దుర్మార్గపు దృష్టి ఉండరాదు.
- విధురుడి వలే... ధర్మాన్ని తప్పకుండా ఎల్లవేళలా ఆచరించాలి. ఆదుకోవాలి.
- శకుని వలే...మోసంతో జూదం ఆడరాదు.
- ధర్మరాజు వలే... ఇతరుల ప్రేరేపణకు గురై అసలు జూదం ఆడరాదు. ఆడితే అధోగతి తప్పదు. ధర్మానికి కట్టుబడి ఉండాలి.

మనలో మనకు ఎన్ని విభేదాలు ఉన్నా అన్య శత్రువు మన మీద దాడి చేసినప్పుడు మనం అందరం అన్నదమ్ములం. 105గురం అనే ఐక్యతతో మెలగాలి. ధర్మపక్ష విజయానికి యుక్తి ఉపయోగించాలి. విజయానంతరం అందరినీ సమదృష్టితో చూడాలి. పట్టాభిషేకం, పరిపాలన ఏనాటికైనా ధర్మానిదే అని గుర్తించాలి.

- విరటుని కొలువులో పాండవుల వలే... కాలం అనుకూలించనప్పుడు తగ్గి ఉండడం నేర్చుకోవాలి ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలుసుకోవాలి.
- భీముడు కీచకుని వధించడంలా... సమయభంగం కాకుండా, అతి రహస్యంగా అవతలివారికి చిక్కకుండా శత్రువును సంహరించాలి.
- ద్రౌపదీదేవి వలే... స్త్రీలు అన్నదమ్ముల మధ్య అభిప్రాయ భేదాలు రాకుండా ఎప్పుడు వారిని సమైక్యంగా ఉంచునట్లు వ్యవహరించాలి.
- అర్జునుడి వలే... ఎల్లప్పుడూ వినయ విధేయతలతో వ్యవహరిస్తూ, గోవుల పట్ల, శిశువుల పట్ల, మహిళల పట్ల, పెద్దల పట్ల, వృద్ధుల పట్ల గౌరవ భావంతో మెలగాలి. అనవసరమైన బాధలను విడవాలి. పెద్దవారు చెప్పిన అనగా (గీతాచార్యుడు చెప్పిన భగవద్గీతను విన్నట్లుగా) మంచి విషయాలను శ్రద్ధతో వినాలి.
- కర్ణుడి వలే... నిష్కల్మషమైన మనసు తో స్నేహాన్ని చేయాలి. దానగుణం కలిగి ఉండాలి.
- శ్రీకృష్ణుడి వలే... దైవం కూడా ధర్మాన్ని సింహాసనం పై కూర్చోబెడతాడు. దైవానిది కూడా ధర్మపక్షమే.

ఇంతటి మహత్తర బృహత్తర గ్రంథాన్ని మనకందించిన ఆ వేదవ్యాసుడు మనందరికీ నిత్య ప్రాతఃస్మరణీయుడు. వందనీయుడు. అభినందనీయుడు. మనమంతా మహాభారతాన్ని శ్రద్ధాసక్తులతో అనునిత్యం పఠిద్దాం. సనాతన ధర్మాన్ని ఆచరిద్దాం. సనాతన హైందవ ధర్మాన్ని పరిరక్షిద్దాం.



వ్యాసకర్త: "సాహిత్య కళా విభూషణ"
-చౌదూరి నరసింహారావు
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

## దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం



విశ్వంభర, వెల్దండ: నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రానికి చెందిన వారణాసి ముత్యాలమ్మ శనివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ వారణాసి రామస్వామి కుటుంబానికి 5 వేల రూపాయలు దహన సంస్కారాల కోసం ఆర్థిక సాయం అందజేశారు. ముత్యాలమ్మ కుటుంబానికి అండగా ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, గుద్దటి కిష్టాలు, కొండిగాడి శ్రీను, ఆనంద్, రంగరాతి వెంకటయ్య, వారణాసి రాములు, హనుమంతు, బొక్కల గణేష్, శ్రీశైలం, శివ పాల్గొన్నారు.

## దిశ సమావేశంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే




విశ్వంభర, రంగా రెడ్డి: రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సామాజిక, మానవ వనరుల అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు కోసం జిల్లా అభివృద్ధి కోఆర్డినేషన్, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. నేడు ఇట్టి సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న 28 శాఖలకు సంబంధించిన 67 అంశాలపై చర్చించడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే విడుదల కాబడిన నిధులు, ఇప్పటి వరకు మంజూరైన పనుల పురోగతిని సమీక్షిస్తూ,త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నాగోల్ చౌరస్తాలో సంస్మరణ సభ



విశ్వంభర, ఎల్బీనగర్: నాగోల్ జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి దివంగత అనంతుల వేణుగోపాల్ గౌడ్, దివంగత కొత్త జగన్ నేత ల జ్ఞాపకార్థం మిత్రబృందం ఆధ్వర్యంలో నాగోల్ చౌరస్తాలో సంస్మరణ సభ ఏర్పాటుచేసి అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యమంలో నౌస ప్రెసిడెంట్ కందికంటి ఖన్నా గౌడ్ మేకల సత్యనారాయణ, మెండు వెంకట్ రెడ్డి, సురేష్, ప్రదీప్ కుమార్, సిద్ది రమేష్, నాళ్ళ ఉమామహేశ్వర్ గుప్త, పల్లే లింగం గౌడ్, వర్కల బాలరాజు, అనంతులా శ్రీనివాస్, నల్ల ప్రభాకర్, మునీందర్ రెడ్డి, అరుణ్ భాయ్, వీసం శ్రీనివాస్ రెడ్డి, బాలు, ఎర్రం శ్రీనివాస్, పలువురు మిత్రులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న వరంగల్‌లో ముఖ్యమంత్రి పర్యటన



విశ్వంభర, హన్మకొండ: ఈ నెల 19 వ తేదీన వరంగల్ నగరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో హన్మకొండలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమీక్ష సమావేశానికి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అండ్ కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. వారిని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి రవీందర్ రావు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## సర్వేలో ఎమ్మెల్యే, ఎంపీల ఆస్తుల వివరాలు బయట పెట్టాలి



విశ్వంభర, ఎల్బీనగర్: రాష్ట్రంలో జరిగే కులగణన సర్వే లో ఏమ్మెల్యే , యంపీ, ప్రజా ప్రతినిధులు ముందుగా వాళ్ల సర్వే చేయించిన తరువాతే ప్రజల సర్వే చేయాలని సీపీయం సరూర్ నగర్ సర్కిల్ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్, యం గోపీనాయక్ లు అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల ఆస్తులు సర్వే చేయించి మీడియా ముందు వివరాలు వెల్లడించిన తర్వాతనే రాష్ట్ర ప్రజల ఇంటింటి సర్వే చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, వినోద్, ముస్తఫా, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు సర్వం సిద్ధం

**▪ పరీక్షలు జరిగే పాఠశాలలు, కాలేజీలలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు లోకల్ హాలిడే ▪ కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



విశ్వంభర, లిమహబూబాబాద్: ఈ నెల 17,18 న జరిగే గ్రూప్ -3, పరీక్ష కేంద్రాల ప్రత్యేక అధికారులు, చీఫ్ సూపెరెండెంట్లు, రూట్ ఆఫీసర్స్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ సంబంధిత అధికారులతో కలెక్టర్ కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన అన్ని పరీక్షా కేంద్రాలను అధికారులు ముందు రోజే చేరుకొని అన్ని సదుపాయాలు ఉన్నాయి లేనిది గమనించి, లేనట్లయితే సంబంధిత అధికారులతో ప్రతిది సమకూర్చుకోవాలని కోరారు. పరీక్ష కేంద్రంలో నిరంతర విద్యుత్, మంచి నీరు, టాయిలెట్స్ సౌకరులు కల్పించాలని, ముఖ్యంగా అంగవైకల్యం ఉన్న అభ్యర్థులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో పరీక్ష రాసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, అవసరం ఉన్న వారికి స్క్రైబ్ లు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అదేశించారు. ప్రతి ఒక్క రూట్ అధికారులు తమకు కేటాయించిన రూట్‌లో పరిక్ష ప్రశ్న పత్రాలు తరలించి సమయంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా పోలీసు బందోబస్తుతో ప్రరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలని దారిలో ఏటువంటి సమస్య ఏదురు అయిన వెంటనే సంబంధించిన అధికారులకు తెలియజేయ్యాలన్నారు. ప్రతి ఒక్క డిపార్ట్మెంట్ అధికారులు పరిక్ష కేంద్రంలోకి కేవలం ఐడెంటిటీ కోసం హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా మరి ఏ ఇతర ప్రభుత్వ ఆమోదించిన గుర్తింపు కార్డు మాత్రమే సమర్పించే విధంగా చర్యలు ఉండాలని అన్నారు. ఏ ఒక్క అభ్యర్థి తమ వెంట సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ , ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రం లోకి అనుమతించకుండా పకడ్బందీ చర్యల చేపట్టాలన్నారు. కేంద్రం లో ఉన్న ఐడెంటికల్ అధికారులు సరి అయిన సమయంలో బయె మెట్రిక్ పద్ధతిలో అటెండెన్స్ తీసుకోవాలని, అటెండెన్స్ తీసుకునే క్రమంలో ఏటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే తమ పై-అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఒక్క ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎప్పటికప్పుడు పరిక్ష కేంద్రాలను సందర్శించే విధంగా చర్యలు ఉండాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.బలరాం నాయక్,ఆర్‌డిఓ కృష్ణవేణి, గ్రూప్ 3, ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టరేట్ సూపర్డెంట్స్ భద్రకాళి,బాలకృష్ణ, టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత చీఫ్ సూపరెండెంట్లు, లోకల్ రూట్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటికల్ అధికారులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే

**▪ విచారణకు హాజరైన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ▪ ట్యాపింగ్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం ▪ ఇప్పటికే చిరుమర్తి విచారణ పూర్తి, ▪ మరో ఎమ్మెల్యే విచారణతో ఆందోళనలో బీఆర్ఎస్ శ్రేణులు**



విశ్వంభర, కల్వకుర్తి: ట్యాపింగ్ అంశంలో కొంత కాలంగా సైలెంట్గా సాగిన పోలీసులు, దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ నేతలకు నోటీసులు అందడంతో కేసు మలుపు తిరిగి బీఆర్ఎస్ నేతల్లో గుబులు పుట్టిస్తుంది. సిట్ ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు ఆధారంగా నల్గొండ, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలకు చెందిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడం, వారిని వరుసబెట్టి విచారణకు పిలవడంతో ప్రతిపక్ష బీఆర్ఎస్ శ్రేణుల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణను సిట్ వేగవంతం చేసింది. ఇన్నాళ్లు పోలీసులు అధికారులను ప్రశ్నించిన దర్యాప్తు బృందం, ప్రజాప్రతినిధుల లింకులపై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కు నోటీసులు అందాయి. దీంతో ఆయన శనివారం విచారణ నిమిత్తం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో హాజరయ్యారు. పోలీసులు విచారణ ను రికార్డు చేశారు. కాగా, ఈ కేసులోనే ఇటీవల నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ను కూడా పోలీసు అధి కారులు ప్రశ్నించారు. ఇదే కేసులో అరెస్టై జైల్లో ఉన్న మాజీ అడిషనల్ ఎస్పీ తిరుపతన్నతో గతంలో ఫోన్లో మాట్లాడిన కాల్ డేటా ఆధారంగా లింగయ్యను పలు కోణాల్లో విచారించారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఈ వ్యవహారంలో ఏ క్షణంలో ఏం జర గబోతున్నదనే చర్చ జోరందుకుంది. ఇన్నాళు అధికారులు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా దర్యాప్తు చేసిన అధికారులు ఈ కేసులో సాంకేతిక పరమైన ఆధారాలు సంపాదించినట్లు తెలుస్తున్నది. ఆ సమచారంతోనే ఈ వ్యవహారంలో అనుమానం వచ్చిన వారిని విచారణకు పిలిచి వారి స్టేట్మెంట్లను నమోదు చేస్తుండడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. ఈ కేసులో పోలీసులు పలువురిని అరెస్టు చేయగా అసలు సూత్రధారుల కోసం వేట కొనసాగుతుంది.

# శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ

## దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం




విశ్వంభర, షాద్ నగర్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్తీక శనివారం సందర్భంగా భక్తులు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దేవాలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలం గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, స్వాతి గ్రాఫిక్స్ నరేందర్, రఘునందన్ రెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మికాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో

# సర్పంచ్ నుండి జడ్పీటీసీ వరకు గెలవాల్సిందే



విశ్వంభర, షాద్ నగర్: షాద్ నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్ లో శనివారం బీజేపీ మండల అధ్యక్షులు డా. దొడల వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వ సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈయొక్క సమావేశానికి ముఖ్య అతిథి గా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ నుండి జడ్పీటీసీ వరకు గెలవడానికి కృషిచేయాలని అన్నారు. మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు మల్లి పునరావృతం అవుతాయి కాబట్టి నాయకులు కార్యకర్తలు కష్టపడాలని అన్నారు. శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతా సభ్యత్వం గడువు ముగుస్తుంది కావున ఫరూఖ్ నగర్ మండలం లో వంద శాతం పూర్తి చేసేవిదంగా అందరూ కష్టపడాలని అన్నారు. అందె బాబయ్య మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్రప్రభుత్వ పథకాలను గడప గడప కు తీసుకెళ్ళినప్పుడే విజయం సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిమోర్చా రాష్ట్ర నాయకులు వెంకనోళ్ల వెంకటేష్, సీనియర్ నాయకులు లష్కర్ నాయక్, యువమోర్చ నాయకులు వంశీకృష్ణ, విట్యాల నర్సింహా, వినోద్ నాయక్, రఘు గౌడ్, పిట్టల సురేష్,శంకర్ నాయక్, మరియు వివిధ గ్రామాల పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జీ లు, క్రియాశీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిఎఫ్‌సీసీ ఈసీ మెంబర్ కోదుమూరి దయాకర్ రావుకు ఘన సన్మానం



విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈసీ మెంబెర్ గా రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి కోదుమూరి దయాకర్ రావు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారస్థులు, బెస్ట్ సేవా సొసైటి వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య , వ్యాపారవేత్త ఉప్పల కోటయ్య లు కోదుమూరి దయాకర్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి ఈసీ మెంబెర్ గా ఎన్నిక అయినందున వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారికి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆయన మరెన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ మునుముందు ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు.

## హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా సామ మాణిక్య రెడ్డి



విశ్వంభర, చేవెళ్ల : దేవుని ఎర్రవల్లి గ్రామానికి చెందిన సామ మాణిక్య రెడ్డికి చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ బిఎస్ఎన్ఎల్ టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ గా నియామక పత్రాన్ని ఆయన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సామ మాణిక్య రెడ్డి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం, సర్వలింగం, శ్రీనివాస్ శ్రీశైలం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి విరాళం అందించిన మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ప్రియాంక దంపతులు



విశ్వంభర, షాద్ నగర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి ఉమ్మడి కొత్తూరు, నందిగామ మండలాల మాజీ ఎంపీపీ మంచనపల్లి శివశంకర్, ప్రియాంక దంపతులు తమ వంతు 5 లక్షల విరాళం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణం కోసం మాజీఎంపీపీ శివ శంకర్ గౌడ్ ఆయన సతీమణి ప్రియాంక ఇరువురు ఎంతో సేవా భావంతో ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ మొత్తం కళాశాల ఎమ్మెల్యే కట్టే సత్తా ఉన్నప్పటికీ మంచి పని కోసం అందరిని భాగస్వాములు చేయడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. పదిమంది సాయం చేసిన పని చరితలు చిరస్థాయిగా నిలిచిపోయే అవకాశం ఉంటుందని ఆ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగా నరసింహా యాదవ్, జమ్రుద్ ఖాన్, శ్రీశైలం, కొమ్ము కృష్ణ, ముబారక్, హుస్సేన్, చంద్రపాల్ కుమార్ గౌడ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నిరసన తెలిపిన ఔట్సోర్సింగ్ వర్కర్స్




విశ్వంభర, మెట్ పల్లి: ఔట్సోర్సింగ్ వర్కర్స్ తో సహా కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని నిరసన తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వమే ఒకటవ తారీకు నుండి 5వ తారీఖు లోపు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని, కార్మికుల పై పని భారాన్ని తగ్గించాలని, బస్తీలు రోజురోజుకూ పెరుగుతున్నాయి కాలనీలకు అనుగుణంగా కార్మికులను కూడా పెంచాలని, కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి ఐదు లక్షల రిటర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఇంట్లో ఒక్కరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, అలాగే జగిత్యాల జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ ను ఏర్పాటు చేయాలి పై సమస్యలను పరిష్కరించకుంటే డిసెంబర్ నెలలో పోరాటాలు చేస్తామని సూచించారు. పర్మినెంట్ చేసేంతవరకు నిరసన కార్యక్రమాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు కార్యదర్శులు కోశాధికారి బర్ల లక్ష్మణ్, ఎల్ శ్రీకాంత్, యు శ్రీను, కే రమేష్, మధురమ్మ, వై నరసయ్య, టి సుమన్, సాయిలు, వాజిద్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## మన పరిసరాలు.. మన బాధ్యత..



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలమేరకు శనివారం మహబూబాబాద్ జిల్లా పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్లలో లోపల, బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చెత్త చేదారం లేకుండా శుభ్రం చేసి పోలీస్ స్టేషన్ ను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతీ వారంలో ఒక రోజు ఒక గంట పోలీస్ స్టేషన్ సుందరంగా ఉండుటకు సమయం కేటాయించాలని ఎస్పీ అన్నారు. పోలీస్ స్టేషన్లో అధికారులు మరియు సిబ్బంది కలిసి వారి స్టేషన్లో పరిసరాలు శుభ్రపరుచుకున్నారు.

## కిసాన్ మోర్చా ఆద్వర్యంలో రైతుల సమస్యలపై వినతిపత్రం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి భాషకళ్ళ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సమస్యల మీద చర్చించడం జరిగింది. ఐకేపీ సెంటర్లలో ధాన్యం నిల్వ ఉండడం, ధాన్యాన్ని ఏ గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేయకపోవడం, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సుతిలి, హమాలి డబ్బులు రైతు ఖాతాలో జమ చేయకపోవడం, 40 కేజీల బస్తా మీద 500 గ్రాములు బస్తా తూకం తీసేయకపోవడం వలన ధాన్యం ఎక్కువ తీసుకోవడం, మిల్లర్ల మోసాల మీద, లారీలు సరిగా రాకపోవడం లాంటి వివిధ అంశాల మీద రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఏపీఎం తో, సీసీ తో, డీటీ తో సమావేశమై రైతుల సమస్యల మీద చర్చించి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి నల్లబోతు మధు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మాలల సింహగర్జన కరపత్ర ఆవిష్కరణ



విశ్వంభర, త్రిపురారం: నల్గొండ జిల్లా త్రిపురారం మండలంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1 న హైదరాబాద్ లో జరగబోయే మాలల సింహగర్జన కరపత్ర ఆవిష్కరించారు. మాలల సింహగర్జనకు నల్లగొండ జిల్లా నుండి లక్షలాదిగా ప్రజలు తరలి వెల్లాలనే కార్యక్రమంలో భాగంగా శనివారం త్రిపురారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నల్లగొండ జిల్లా ఛైర్మన్ మరియు గోలిసైదులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాలమహానాడు రాష్ట్ర నాయకులు కామెర్ల జానయ్య, కో ఛైర్మన్ రేకుల సైదులు, బొగరి విజయ్ కుమార్, కలిసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నూనె చెన్నులు,కస్తూరి జలంధర్, కోరే కోటేష్, అల్లారమేష్,ఎర్రముల మధు,శ్రీనిధి,యాదయ్య, కొల్లి రాము,పెరకసైదులు, బైరంసత్తయ్య, మండల వెంకట్,పెరమళ్ళ మధు, కొల్లి లక్ష్మణ్ శివనేని ఎలక్షన్ రావు, మేకల రమేష్, దోమలశివ,కస్తూరి గౌతమ్, ఎర్రమళ్ళ కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి కాలనీలో లక్ష దీపోత్సవ వేడుకలు



విశ్వంభర, సరూర్ నగర్: ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీలోని వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక లక్షదీపోత్సవ వేడుకలు నిర్వహించారు. లక్ష దీపోత్సవం వేడుకలలో వందలాది మంది మహిళలు పాల్గొని పరమ శివున్ని తలుచుకుంటూ కార్తీక దీపాలను వెలిగించారు. దీంతో దేవాలయం పరిసర ప్రాంతాలు దీపాల వెలుగులతో నిండిపోయాయి. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కార్యదర్శి అయిత అంజయ్య గుప్తా, కోశాధికారి కృష్ణయ్య, కన్వీనర్ తమ్మన శ్రీధర్, గౌరిశెట్టి అరుణ్, సుదర్శన్, చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, సుజాత, అరుణ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి దేవాలయానికి హుండీ అందజేత



విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని శ్రీ అంతిరింతిరి కొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం లో శనివారం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్ది అనిత మల్లేష్ దంపతులు దేవాలయానికి హుండీ ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ దంపతులిద్దరిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పబ్బు పరమేష్ గౌడ్,దుడ్డు ఆంజనేయులు యాదవ్,ఉప్పుల రాజు,రవి. రామచంద్రయ్య,మల్లేష్, కొండల్,కృష్ణ, నరసింహ, శ్రీశైలం, విజయ్,శ్రీశైలం,మహేష్ పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతుల ధాన్యం అమ్మాలి

- రైతును రాజు చేయడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీ నాయక్



విశ్వంభర, మహబూబాబాద్: కేసముద్రం మండల కేంద్రంలోని పెనుగుండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం అమ్మి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలిపారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. దాన్నే ప్రజా ప్రభుత్వం అని, వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. ఆనాడు బీఆర్ఎస్ రైతులకు లక్ష రుణమాఫీ చేస్తే, నేడు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని అన్నారు. దేశానికే అన్నం పెట్టే రైతన్నలు ఉన్నారు కాబట్టే ధాన్యగారంగా తెలంగాణ మారుతుందని తెలిపారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవ్వరు దళారులను నమ్మి మోసపోవద్దు అని సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వాతావరణంలో జరుగుతున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల లో ఎవరైనా మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ ఛైర్మన్, సొసైటీ ఛైర్మన్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీసీసీ ఉపాధ్యక్షులు,మండల పార్టీ అధ్యక్షులు, డైరెక్టర్లు, గ్రామ అధ్యక్షులు,మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డ్ నెంబర్లు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సృజనాత్మకతను వెలికి తీయండి



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం హైస్కూల్ స్థాయి విద్యార్థిని విద్యార్థులకు దేశాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర అనే అంశం మీద అదేవిధంగా కళాశాల స్థాయి విద్యార్థిని విద్యార్థులకు నిరుద్యోగం ఉపాధి కల్పన అనే అంశం మీద వ్యాచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులుగా మీరు ప్రతి రోజు ఒక గంట గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉన్నంత శిఖరాలు అధిరోహించడానికి తోడ్పడుతుంది అన్నారు . మున్సిపల్ వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, టి శ్రీలత, లైబ్రేరియన్ జి విజేందర్ సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్, గూడ నరేందర్, బి భూలక్ష్మి, అబ్బ గాని భాస్కర్, బి నరేష్ ఎ, శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లగచర్ల గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలి

- మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్



విశ్వంభర, కడ్తాల్: కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామపంచాయతీ పరిధిలో ఫార్మా కోసం గిరిజన రైతుల భూసేకరణ సరైనది కాదని కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ అక్రమంగా గిరిజనుల భూములు తీసుకొని వారిపైనే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అమాయకపు గిరిజనుల భూములను లాక్కోనే ప్రయత్నం చేస్తున్నారని గిరిజనుల పైన దాడులు చేపట్టడంతో పాటు అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు పెట్టిన రైతులను వెంటనే విడుదల చేసి వారిపై పెట్టిన కేసులు కొట్టేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల కల్వకుర్తి నియోజకవర్గం నుండి దాదాపుగా 2000 మంది గిరిజనులతో కొడంగల్ చౌరస్తాలో రాస్తారోకో చేపడతామని డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న గిరిజనులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గద్దెనెక్కించిన ప్రజలే త్వరలో గద్దె దించే పరిస్థితి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, లోకేష్ నాయక్, ఛత్రు నాయక్, కస్న నాయక్, మాజీ ఉపసర్పంచ్లు శారద పాండు, రమణ, మాజీ వార్డు సభ్యులు శ్రీను, సోమల, భీమన్, అంజి నాయక్, జగన్, నాయకులు బిచ్య నాయక్ రాములు నాయక్, పాండు, కోట్య, రమేష్ రవి, గణేష్, భీమ్లా, ధర్మ, రాజశేఖర్, రాజు, శ్రీను, శ్రీకాంత్, తిరుపతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్-19కు గీతం విద్యార్థి ధనుష్ ఎంపిక

- కూచ్ బెహార్ ట్రోఫీ 2024-25కు రాష్ట్ర క్రికెట్ జట్టులో స్థానం



విశ్వంభర, హైదరాబాద్: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ బీటెక్ (సీఎస్ఈ) ద్వితీయ సంవత్సరం విద్యార్థి అన్నెం దేవి ధనుష్ ప్రతిష్టాత్మకమైన కూచ్ బెహార్ ట్రోఫీ-2024-25 సీజన్ లో పాల్గొనేందుకు అండర్-19 ఆంధ్ర రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. దేవి ధనుష్, ప్రతిభావంతులైన కుడి చేతివాటం (రైట్ హ్యాండ్) బ్యాట్స్ మన్. దాదాపు తొమ్మిదేళ్లుగా తన క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, ప్రస్తుతం హైదరాబాద్ లోని ప్రఖ్యాత ఎం.ఎస్.కే. ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ధనుష్ అంకితభావం, కృషి ఫలించి, రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.ఇటీవలి అండర్-19 జిల్లా మ్యాచ్ లలో ధనుష్ అసాధారణమైన ప్రతిభను కనబరిచి, కృష్ణా జిల్లా తరపున అత్యధిక పరుగులు చేశాడు. గీతం విశ్వవిద్యాలయం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ గస్టో-2023-24లో ఉత్తమ బ్యాట్స్ మెన్ అవార్డును పొందాడు. అండర్-14 రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ లో ఆకట్టుకునే ప్రదర్శన చేసి, అండర్-16 జోనల్ మ్యాచ్ లకు చేరుకోవడం, క్రీడలో ధనుష్ సామర్థ్యాన్ని మరింత పెంచింది. ధనుష్ విజయాలను విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ప్రసంశించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, క్రీడలు-ఎన్.సీ.సీ. డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ ఉపాధ్యాయ్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి, మేనేజర్ కే.వీ.తపస్వి తదితరులు, ధనుష్ మరిన్ని విజయాలను సాధించాలని అభిలషించారు.

## మధ్యాహ్న భోజనానికి సరిపడ నిధులు కేటాయించాలి



విశ్వంభర, షాద్ నగర్: ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులు కేటాయించాలని షాద్ నగర్ డివిజన్ లోని పలు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగా రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వ పాఠశాలలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత కొరవడిందని, మధ్యాహ్న భోజనానికి సరిపడ నిధులు కేటాయించకపోవడం, ఒక విద్యార్థి భోజనానికి 9.95 రూపాయలు మాత్రమే ఇస్తున్న పరిస్థితి ఉన్నదని, వీటి ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందటం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. కావున పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి తక్షణమే నిధులు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లేదంటే విద్యార్థులతో ర్యాలీలు, రాస్తారోకో లు చేస్తామని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఎస్ఎఫ్ఐ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు సుమయిర్, శివ శంకర్ ఎస్ఎఫ్ఐ నాయకులు అస్మాన్, షైబాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు బీఎన్ఎస్, మోటారు వాహనాల చట్టాలపై అవగాహన



విశ్వంభర, షాద్ నగర్: కొత్త చట్టాల ప్రకారం లైసెన్సు, ఇన్సూరెన్స్ లేకుండా, మద్యం త్రాగి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన డ్రైవర్ తో పాటుగా వాహన యజమానికి పదేళ్ళ జైలు శిక్ష ఉంటుందనీ షాద్ నగర్ షాద్ నగర్ ఏసీపీ ఎన్ సిహెచ్ రంగస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని బుగ్గరెడ్డి పంక్షన్ హాల్ ఆవరణలో ఏసీపీ రంగస్వామి అధ్వర్యంలో పట్టణం లోని ప్రైవేటు టాక్సి, ఆటో డ్రైవర్లకు కొత్తగా వచ్చిన బీఎన్ ఎస్ చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు పలు అంశాలపై సూచనలు సలహాలు తెలియజేశారు. వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్ ప్రాధాన్యత, ఇన్సూరెన్స్ వలన కలిగే ప్రయోజనాలు, అదేవిధంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రయోజనాల గురించి వారికి వివరించారు. కెపాసిటీకి మించి వాహనంలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా వ్యక్తులు తారసపడినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంవీఐ వాసు, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ మరియు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి



విశ్వంభర, ఎల్బీనగర్: హయత్ నగర్, బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ల పరిధిలో దాదాపు రూ .6 కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాల ను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ లుముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నవజీవన్ రెడ్డి,లచ్చిరెడ్డి,హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి,భారస పార్టీ డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కటిక రెడ్డి అరవింద్ పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీకి రాజీనామా



విశ్వంభర, ఎల్.బి నగర్, హైదరాబాద్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీకి జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ మరియూ కమిటీ సభ్యులం రాజీనామా చేస్తున్నామని తెలిపారు. చంటి ముదిరాజ్ (జాతీయ ప్రధాన కార్యదర్శి), సూర స్రవంతి (రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు), మల్లం వెంకటేశం (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), గుండెల రాయుడు (రాష్ట్ర కార్యదర్శి), సాధబోయిన రాజు (వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు), అంతటి అజయ్ కుమార్ (రంగారెడ్డి జిల్లా కార్యదర్శి), దయ్యాల ప్రణయ్ కుమార్ (కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్), మేము దాదాపు గత రెండు సంవత్సరాలుగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీలో కొనసాగుతున్నాము. కొన్ని అనివార్య మరియు వ్యక్తిగత కారణాల దృష్ట్యా మేము సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీని వీడాలని నిర్ణయించుకున్నాము. మా రాజీనామా లేఖను మీకు పంపుతున్నాము. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీలో మాకు సహకరించిన పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపు తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల మహేష్ గౌడ్, బొమ్మరగోని ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గట్టు ఇప్పలపల్లి మండల సాధనే మా లక్ష్యం



విశ్వంభర, తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని 156 రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మండల సాధన మా లక్ష్యం అని జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ ఛైర్మన్ ఏదుల అనిల్ అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా ఊరు తలరాత మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు వాగ్దానాలు చేయడం,గెలిచిన తర్వాత హామీలు మరిచిపోవడం సర్వసాధారమైందని అన్నారు. ప్రతి ప్రభుత్వం గెలిచిన తర్వాత మనలను మోసం చేస్తున్నారని, ఈసారి అంతా కలిసికట్టుగా ఎన్నికల బహిష్కరణ చేయాలని, అప్పుడే ప్రభుత్వాలకు సిగ్గు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షలో ఎండి ఉస్మాన్, బాలరాం,రహీం వెంకటేష్, లక్ష్మణ్, చెన్నయ్య, నరసింహ రత్నయ్య, బాలయ్య, చిన్న రంగారెడ్డి, రాజమౌళి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ



విశ్వంభర, మేడిపల్లిఫ మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు బండ్ల కిషన్ తండ్రి బండ్ల గంగారాం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, అలాగే భీమారం మండల మన్నెగూడెం కొండ కిషన్ గౌడ్ మరణించగా వారి కుటుంబ సభ్యులను, భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన కార్యకర్త వన్నెల దశగౌడ్ కుమారుడు సంజీవ్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను, అదే గ్రామానికి చెందిన జవ్వాది జలంధర్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు సత్తిరెడ్డీ, సీనియర్ నాయకులు సురేష్, అజిత్ రావు, ఆదిరెడ్డి, రవీందర్ రావు, శ్రావణ్, తదితరులు ఉన్నారు.

## అదనపు డీఎస్పీ శ్రీనివాస్‌కు సన్మానం



విశ్వంభర, పరిగి: పరిగి సీఐ గా మొన్నటి వరకు విధులు నిర్వహించి పరిగి అదనపు డిఎస్పీగా నియమితులైన శ్రీనివాస్ ను శనివారం పరిగి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ యూత్ అధ్యక్షుడు ఆయుబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అదనపు డిఎస్పీగా నియమితులైన శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయూబ్ మాట్లాడుతూ.. పరిగి అదనపు డిఎస్పీగా శ్రీనివాస్ నియమితులు కావడం సంతోషకరమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో అతని కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుల్తాన్, రసూల్, బురాన్, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత సహకార సంఘ వారోత్సవాలు



విశ్వంభర, కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అఖిల భారత సహకార సంఘ వారోత్సవాలలో భాగంగా వ్యాపార వేత్తలు - ఉపాధి - నైపుణ్యాలకు సంబంధించిన సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన కోసం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం కల్వకుర్తి మండలం రఘుపతిపేట జీడిపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులు దళారులను నమ్మకుండా వడ్ల కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ జనార్దన్ రెడ్డి ఆర్డీఓ శ్రీను, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, వ్యవసాయ అధికారులు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సంగిశెట్టి సాయిబాబు



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన సంగిశెట్టి సాయిబాబును తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ ఈ మేరకు నియామక పత్రాన్ని శనివారం హైదరాబాదులో అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో సాయిబాబా మాట్లాడుతూ, పద్మశాలి కులస్తుల, చేనేత వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కర్తవ్యాలను నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్, రాష్ట్ర నాయకులు వేముల బాలరాజు, గంజి శ్రీనివాసులు, మచ్చ సుధాకర్, సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు చిరందాసు ధనుంజయకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



విశ్వంభర, హైదరాబాద్: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీతో కలిసి చిన్నారి ఆధ్యకు తమ ఆశీస్సులు అందజేశారు. హైదరాబాద్ కూకటపల్లి కేపీహెచ్బీ కాలనీలోని పీఎన్ఆర్ ఏంపైర్ శ్రీరస్తు హాలులో శనివారం జరిగిన వొలం రాజశేఖర రావు -గీతారాణి, వొలం మనోజ్ కుమార్ -పావనిల గారాల పట్టి ఆధ్య శారీ ఫంక్షన్ కు పుణ్య దంపతులు ఎంపీ రవిచంద్ర -విజయలక్ష్మీలు హాజరై అక్షింతలు వేసి చిన్నారిని ఆశీర్వదించి తమ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆనందోత్సహాల మధ్య మైసిగండి మైసమ్మ రథోత్సవం



విశ్వంభర, కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవస్థానం బ్రహ్మోత్సవాలలో రెండో రోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తుల ఆనందోత్సహాల మధ్య రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, ట్రస్ట్ ఛైర్మన్ శిరోలి పంతు నాయక్, రామావత్ భాస్కర్, ఆలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, రాములు, కృష్ణయ్య, హర్షవర్ధన్ రెడ్డి, గుండాలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్ద శంకరంపేట మండల పరిధిలోని శివయ్య పల్లి గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శంకరంపేట ఎస్సై శంకర్ తెలిపిన వివరాలు ప్రకారం మూసాపేట గ్రామానికి చెందిన రైతు కురుమగొల్ల బీరప్ప (40) తాను పండించిన వరి ధాన్యాన్ని శివయ్య పల్లి గ్రామ సమీపంలోని రైస్ మిల్లులో విక్రయించడానికి వెళ్ళాడన్నారు. బీరప్పకు చెందిన సొంత ట్రాక్టర్ లో అతని స్నేహితుడు దేవయ్యతోపాటు ధాన్యం తీసుకొని వెళ్లారని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో కోలకొండ దేవయ్య, గోసాయిపల్లి వీరయ్య లు మద్యం తాగి నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడంతో మూసాపేట గ్రామానికి చెందిన బీరప్ప ట్రాక్టర్ పై నుండి కింద పడి మృతి చెందినట్లు మృతుడి భార్య వివరించినట్లు తెలిపారు. ట్రాక్టర్ పై నుండి బీరప్ప పడిపోయి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్ద శంకరంపేట పోలీసులు తెలిపారు.

# గ్రూప్ -3 పరీక్షల సందర్భంగా పటిష్ఠ బందోబస్తు

### జిల్లా ఇన్చార్జి ఎస్పీ అఖిల్ మహజన్



విశ్వంభర, జిల్లా లో ఈ నెల 17, 18వ తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగింది అని జిల్లా ఇన్చార్జి ఎస్పీ శ్రీ అఖిల్ మహజన్ తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ మరియు జగిత్యాల డి.ఎస్పీ రఘు చందర్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడం జరిగింది. గ్రూప్-3 సర్వీసెస్ పరీక్షల కోసం జిల్లాలో 34 పరీక్షా కేంద్రాలు నామినేట్ చేయబడ్డాయి. జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 20, జగిత్యాల రూరల్ పరిధిలో 03, మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 01, కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 02, కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 08, ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల టౌన్ పీఎస్, జగిత్యాల రూరల్ పీఎస్, మల్యాల పీఎస్, కొడిమ్యాల పీఎస్, కోరుట్ల టౌన్ పీఎస్ లలో పటిష్టమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. కావున పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎవరు కూడ గుమికుడి ఉండవద్దని. జిరాక్స్ సెంటర్,ఇతర దుకాణాలు మూసి ఉంచాలని తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా, పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవడం జరిగింది అని ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. మొత్తం జిల్లాలో 220 మంది పోలీస్ అధికారులతో భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అందులో 7 మంది సీఐ అదికారులు, 37 మంది ఎస్ఐ అధికారులు, 67 మంది ఏఎస్ఐ/హెచ్‌సీ అధికారులు, 76 మంది పోలీస్ కానిస్టేబుల్ అధికారులు మరియు 34 హోం గార్డ్ అధికారులు ఇట్టి బందోబస్త్ లో పాల్గొంటారని ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. గ్రూప్-3సర్వీసెస్ పరీక్షలు రాసే అభ్యర్థులు పరీక్షలకు సంబంధించిన నియమ, నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలని, పరీక్ష కేంద్రాలకు చేరుకొనే సమయంలో అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లు అయితే ఆయా పరిధిలోని పోలీస్ అధికారులకు గాని, డయల్ 100 కు గాని సంప్రదించాలని ఎస్పీ తెలియజేశారు.

# గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



విశ్వంభర, పెద్ద శంకరంపేట. మెదక్ జిల్లాలో గ్రూప్ త్రీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం స్థానిక మెదక్ డిగ్రీ కళాశాల లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, అబ్జర్వర్స్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్స్ కు గ్రూప్ -3 శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ -3 పరీక్షలను సమన్వయంతో సజావుగా నిర్వహించాలని, ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా సమన్వయంతో ఈ నెల 17,18 తేదీలలో నిర్వహించే గ్రూప్ -3 పరీక్షలను సజావుగా నిర్వహించాలని తెలిపారు. 19 పరీక్షా కేంద్రాలకు గాను 16 లొకేషన్స్ ఏర్పాటు చేసినట్లు మెదక్ సబ్ డివిజన్- 12 పరీక్షా కేంద్రాలు నిర్వహించగా, తూప్రాన్ సబ్ డివిజన్లో -07 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధన ప్రకారం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలని, విమర్శలకు తావివ్వకుండా అభ్యర్థులను పరీక్ష హాలులోకి తనిఖీ చేసి పంపించాలని తెలిపారు.అభ్యర్థుల అటెండెన్స్ ఆరోపణలకు తావివ్వకుండా చూడాలని తెలిపారు.అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్, ఆన్లైన్ అటెండెన్స్ లో వ్యత్యాసం రాకుండా నిర్వహించాలని అన్నారు. అభ్యర్థుల వెంట సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జస్‌లను పరీక్ష కేంద్రాలకు తీసుకరాకూడదని తెలిపారు. ప్రతీ సెంటర్ ముందు సెంటర్ పేరు, సెంటర్ కోడ్, లు తెలిపేవిధంగా ఫ్లెక్సీ లను ఏర్పాటుచేయాలని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో త్రాగునీరు, మెడికల్ కిట్ తో పాటు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్ ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2 గంటలకు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజ్ గౌడ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష ఫీజు గడువు ఈనెల 30కి పొడిగించాలి

### డైరెక్టర్ కృష్ణారావుకి వినతి పత్రం సమర్పించిన బీసీ నేత లింగంగౌడ్



విశ్వంభర, మిర్యాలగూడ: పదవ తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఇంకా రెండు రోజులే ఉన్నందున (ఈనెల 18 చివరి తేదీ) ఫీజు గడువును 30 వరకు పొడిగించాలని విద్యాశాఖ డైరెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు వారికి సంబంధించిన స్కూల్ ఎడ్యుకేషన్ వివరాలు ఇంకా యుడైస్ పోర్టల్ లో నమోదు చేసుకోలేదని గతంలో కేవలం పదవ తరగతి విద్యార్థుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తే ఫీజు చెల్లించే అవకాశం ఉండేదని కానీ ఈ సంవత్సరం ఖచ్చితంగా 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలు ఆన్లైన్లో నమోదు తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులు వారి వివరాలు ఇంకా పూర్తిస్థాయిలో నమోదు చేయకపోవడంతో పాటు ఆన్లైన్లో విద్యార్థులు నమోదులో సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని వాటిని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 18 నుంచి 30 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారత, స్వావలంబన దిశగా ప్రభుత్వం

- స్వయం సహాయక సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు.
- 10 శాతం పెట్టుబడితో 90 శాతం బ్యాంకు రుణాలు
- మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



విశ్వంభర, మహేశ్వరం: మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నిన్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తో జరిగిన విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారుల సమావేశంలో సౌరశక్తికి ఆమోదం లభించిందన్నారు. ఒక్కో సంఘానికి ఒక్కో మెగావాట్ తో రాష్ట్ర వ్యాప్తంగా 4వేల ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సర్కారు సిద్ధంగా ఉందని కేఎల్ఆర్ తెలిపారు.ప్లాంట్స్ అనువైన స్థలాలు గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.మహేశ్వరం నియోజకవర్గంలో గ్రామీణ మహిళా సంఘాలకు రాయితీపై సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఇప్పటికే పలు ఉపాధిఅవకాశాలను ఆడపడుచులకు కల్పిస్తున్న ప్రభుత్వం త్వరలో ఆర్టీసీ బస్సుల కొనుగోలు మహిళా సంఘాలతో చేయాలని నిర్ణయించిందని కేఎల్ఆర్ తెలిపారు.

## కేసీఆర్‌కు వివాహా ఆహ్వాన పత్రిక అందించిన ఉప్పల వెంకటేష్



విశ్వంభర, తలకొండపల్లి: హైదరాబాదులోని వీఎంఆర్ కన్వెన్షన్ లో జరగనున్న డాక్టర్ ఉప్పల అనిల్ వివాహ మహోత్సవానికి రావలసిందిగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ని ఎర్రవెల్లి లోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## శ్రీ ముత్యాలమ్మ తల్లికి ఒడి బియ్యం



విశ్వంభర, చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో స్థానిక మహిళలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం పోసే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు ముప్పై మంది పాల్గొన్నారు.

## ఐక్యత శంకర నేత్రాలయ వారి ఉచిత కంటి వైద్య శిబిరం



విశ్వంభర, ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్ను ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆమనగల్లు ఫౌండేషన్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలతో పాటు,కంటి శుక్లాలకు సంబంధించిన సర్జరీలు కూడా చేయబడునని ఆమనగల్ మండల కేంద్రంలో కల్వకుర్తి రోడ్ లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ నందు ఈనెల 19 మంగళవారం నుండి 27 బుధవారం వరకు తొమ్మిది రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గ ప్రాంత ప్రజలుఅందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్యాంప్ కి హాజరయ్యే వారందరు ఒక కాపీ ఆదార్ కార్డు జిరాక్స్ తీసుకొని రాగలరని వారు తెలిపారు. రచ్చ శ్రీరాములు,శ్రీనివాస్ రెడ్డి,కరుణాకర్ గౌడ్,మల్లేష్ నాయక్, శ్రీను, కొండల్ రెడ్డి, అభినవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మంత్రి తుమ్మల



విశ్వంభర, వెల్దండ: నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టి ఉన్న వడ్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రాలలో ఏమైన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, పలు జిల్లా కలెక్టర్లతో ఫోన్ లో మాట్లాడారు. జిల్లా వ్యవసాయ అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. రైతులు కూడా నాణ్యత ప్రమాణాల ప్రకారం తేమ శాతం ఉండేటట్లు చూసుకోవాలని తెలియజేశారు.

## రైతులు మద్దతు ధరను పొందాలంటే అధికారుల సూచనలు పాటించాలి : సీఐ రఘువీర్ రెడ్డి



విశ్వంభరం, నాగారం: రైతులు మద్దతు ధర పొందాలంటే నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వుల మేరకు డీఎస్పీ రవి ఆదేశాల మేరకు నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట, పనిగిరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ఆరబెట్టిన దాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను, బోనస్‌ను పొందాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు అధికారులకు సహకరించి కొనుగోలు కేంద్రాలలో సమన్వయం పాటించాలని సూచించారు. ఎస్సై ఐలయ్య రైతులు సోమయ్య, లింగమల్లు, మహేందర్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నడక ప్రాధన్యతను తెలపడమే లక్ష్యం




విశ్వంభర, ఎల్బీనగర్: నడక ప్రాధన్యతను తెలిపి ఆరోగ్యాన్ని పెంపొందించుకునే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి వాసవి కాలనీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 4 కే వాక్ పాతన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు అష్టలక్ష్మి దేవాలయం నుండి 4 కే కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయితే అంజయ్య, చిలుక ఉపేందర్ రెడ్డి,గౌరిశెట్టి అరుణ్, తమన్నా శ్రీధర్ లు ఉన్నారు.

## సర్వే తీరును తనిఖీ చేసిన జోనల్ కమిషనర్



విశ్వంభర, ఎల్బీనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ (ఐఏఎస్) హయత్ నగర్ సర్కిల్ పరిధిలోని నాగోల్ డివిజన్లోని శ్రీ సాయి నగర్ కాలనీలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలించడం జరిగింది. జరుగుతున్న సర్వే తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రశంసించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి బలరాం, ఎం విక్రమ్ సూపర్ ఇంటర్నెట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగోల్ డివిజన్, మమ్మద్ జాహిద్, పాల్గొన్నారు.

## చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతిపట్ల సంతాపం



విశ్వంభర, ఆమనగల్లు: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి పట్ల టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి అండే కార్ యాదిలాల్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రాగాఢ సానుభూతిని ప్రకటించారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన 1994-99 వరకు చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తి నాయుడు పని చేశారని తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలు చాలా గొప్పవని యాదిలాల్ పేర్కొన్నారు.

విశ్వంభర V3 NEWS

# పోగుల లత హత్యపై
# న్యాయం జరిగే వరకు పోరాడుదాం

■ సంస్మరణ సభలో ప్రతిన బూనిన ప్రజా సంఘాలు ■ లత చిత్ర పటానికి ఘన నివాళి



విశ్వంభర: జగిత్యాల జిల్లా : వరకట్న వేధింపుల హింసతో హత్యకు గురైన పోగుల లత (సంద) మృతి పట్ల సరైన విచారణ జరిగి చట్టపరంగా పూర్తి స్థాయి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేద్దామని శనివారం రేచపల్లి లో జరిగిన పోగుల లత సంస్మరణ సభలో మహిళా సంఘాల, ప్రజా సంఘాల, హక్కుల సంఘాల ప్రతినిధులు ప్రతిన బూనారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన పోగుల లత ఈనెల 8న నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రేగోజి పేట లో వరకట్న హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆమె పెద్ద కర్మ కార్య క్రమాన్ని శనివారం రేచపల్లి గ్రామంలోని మృతురాలి తల్లిదండ్రులు పోగుల రాజేశం - మల్లేశ్వరి ల గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మహిళా సంఘాల, ప్రజా సంఘాల, హక్కుల సంఘాల ప్రతినిధులు పోగుల లత(సంద) చిత్ర పటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఒక నిమిషం మౌనం పాటించి పోగుల లత (సంద)కి జోహార్లు అర్పించారు. హత్య పట్ల పోలీసులు సరైన విచారణ జరిపి చట్టబద్ధంగా సరైన న్యాయం జరిగేంత వరకు కలిసి కట్టుగా అందరం కృషి చేద్దామని నిర్ణయించారు. ప్రత్యేక కమిటి ఏర్పాటు చేసుకొని ప్రాథమిక సమాచారంతో హత్య జరిగిన గ్రామం లో నిజ నిర్ధారణ జరిపి పోలీస్, ఇతర ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వాలకు నివేదిక అందజేయాలని నిర్ణయించారు. ఇక ముందు ఎక్కడ కూడా ఇలాంటి హత్యలు, వరకట్న వేధింపులు, గృహ హింసలు జరుగకుండా ఉండేందుకు హంతకులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పోలీసులను, ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. లత హత్యను ఆత్మ హత్య గా చిత్రీకరించిన వారిని, హంతకులకు అండగా ఉన్న దళారీ మాఫియా ను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, చైతన్య మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ శ్రీదేవి హౌటార్కర్, రాష్ట్ర నాయకురాలు కే.శ్రీదేవి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్గొండ పద్మ, పౌర హక్కుల సంఘం నేతలు పుల్ల సుచరిత, బొడ్డుపల్లి రవి, కడ రాజన్న, రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మునిమడుగుల మల్లన్న, దళిత లిబరేషన్ ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ రామిల్ల బాపు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ గాండ్ల మల్లేశం, నాయకులు గుమ్మడి కొమురయ్య, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పెండ్లి మల్లన్న, ఎరుకల రాజన్న, పొన్నం రాజ మల్లయ్య, బాలసాని రాజయ్య, వెల్గొండ లచ్చయ్య, దేవి సత్యం, సమ్మ రాజయ్య, జె.పోచం, బి.సత్యం, ఎ.సారయ్య, గంట సత్యం పాల్గొన్నారు.

## లగచర్ల ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తీవ్ర ఆగ్రహం



విశ్వంభర, హైదరాబాద్: ఫార్మా కోసం గిరిజన భూములు బలవంతంగా లాక్కోవడం కరెక్టు కాదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిని నమ్ముకున్న గిరిజన కుటుంబాలు ఏమై పోవాలి ని మండిపడ్డారు. ఫార్మా కంపెనీకి కమిషన్ వ్యతిరేకం కాదని బక్కి వెంకటయ్య తేల్చి చెప్పారు. స్వేచ్ఛగా జీవించే హక్కు అంబేద్కర్ కల్పించారని, లగచర్ల గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ త్వరలో పర్యటిస్తుందని తెలిపారు. కమిషన్ ఎస్సీ, ఎస్టీ లకు అండగా ఉంటుందని, అన్యాయం జరిగితే కమిషన్ అసలు ఊరుకోదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.

## రాహుల్ గాంధీ హెలిక్యాప్టర్, బ్యాగులు తనిఖీ చెక్ చేసిన ఈసీ అధికారులు



ముంబయి: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బ్యాగులను ఎన్నికల కమిషన్ (ఈసీ) అధికారులు తనిఖీ చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం శనివారం అమరావతికి ఆయన వచ్చారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ప్రయాణించిన హెలికాప్టర్‌తోపాటు అందులోని ఆయనకు చెందిన బ్యాగులను ఈసీ అధికారులు చెక్ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న పార్టీ నేతలతో మాట్లాడటంలో ఆయన బిజీ అయ్యారు. కాగా, కేవలం ప్రతిపక్ష నేతల బ్యాగులను మాత్రమే ఈసీ అధికారులు తనిఖీ చేస్తున్నారని మహారాష్ట్రలో ప్రతిపక్షమైన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమి నేతలు ఆరోపించారు. తన బ్యాగులను తనిఖీ చేసిన ఈసీ అధికారులపై ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంలు ఫడ్నవీస్, అజిత్ పవార్‌తోపాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బ్యాగులను కూడా ఈసీ అధికారులు ఇటీవల తనిఖీ చేశారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరుగనున్నది. 23న జార?ండ్‌తోపాటు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

## తెలంగాణలో కాంగ్రెస్‌కు రక్షణ కవచంగా మారిన బీజేపీ : కేటీఆర్



విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ రక్షణ కవచంగా పనిచేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సహాయక మంత్రిగా మారాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.మేము రేవంత్ రెడ్డిని తిడితే బండి సంజయ్, రఘునందన్ రావు, విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ తట్టుకోలేకపోతున్నారు. వాళ్ళకు రోషం వస్తోంది. అసలు ఆ ఎంపీలు బీజేపీలో ఉన్నారా..? కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? రేవంత్ కూడా బీజేపీలో ఉన్నాడా? కాంగ్రెస్‌లో ఉన్నాడా? అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు.త్రిపుల్ ఆర్ సినిమా కన్నా ఆర్ఆర్ ట్యాక్స్‌లు ఎక్కువ అయ్యాయంటూ ప్రధాని మోడీయే అన్నాడు. కానీ రేవంత్ రెడ్డిపై ఎందుకు చర్యలు లేవు. మణికొండలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను పంచుకున్నారు. మణికొండ, మక్తల్, భువనగిరిలో కలిసి కాపురం చేస్తున్నది ఎవరు..? మళ్లీ వాళ్లే సిగ్గు లేకుండా మాట్లాడతారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు పదవులు పంచుకున్నట్లు ఒక్క సంఘటనైనా చూపించగలరా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

## గ్రూప్ -3 రాత పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

■ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి - సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్
■ పరీక్షా కేంద్రం అడ్రస్ ను ముందుగానే సూచుకోవాలి లి నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రానికి రావాలి
■ ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తెచ్చుకోవద్దు లి పరీక్ష కేంద్రాల వద్ద 163 బి.ఎన్.యస్.యస్ (144 సెక్షన్) అమలు



విశ్వంభర, సూర్యాపేట: ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు జరిగే గ్రూప్-3 రాత పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ట భద్రతా, బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట పట్టణంలో 30, కోదాడ పట్టణంలో 20 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు 163 బి.ఎన్.యస్.యస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు మూసి వేయాలని, పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుంపులుగా చెరవద్దు అని కోరారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందు పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలని అన్నారు. అభ్యర్థులు తమవెంట పరీక్షా హాల్ లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలిక్యులేటర్లు, వాలెట్లు వంటివి తీసుకువెళ్లడానికి అనుమతి లేదు అన్నారు. కాళ్లకు షూ వేసుకోవద్దన్నారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందే ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసు వారికి సహకరించగలరని పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వాహనాలు వేగంగా నడపవద్దు అన్నారు. ముందుగా బయలుదేరి ఎలాంటి వత్తిడి లేకుండా పరీక్షా వ్రాయాలని అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపినారు.

## రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతాం

■ యుద్ధానికి స్వస్తి పలకడంపై దృష్టి సారిస్తా ■ పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు కృషి■ డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటన




వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు పలకడంపై తన ప్రభుత్వం దృష్టి సారిస్తుందని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటించారు. అక్కడ ఇప్పటిదాకా వేలమంది మరణించడం తనను తీవ్రంగా కలచివేస్తోందని పేర్కొన్నారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఆ యుద్ధాన్ని ఆపేస్తానన్నారు. పశ్చిమాసియాలోనూ శాంతిస్థాపనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశాధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన అనంతరం ట్రంప్ మొదటిసారిగా ఫ్లోరిడాలోని తన మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో గురువారం నిర్వహించిన ఓ బహిరంగ కార్యక్రమంలో పాల్గొని ఈ మేరకు ప్రసంగించారు.

## 'మహాయుతి' కూటమి గెలుపు తథ్యం

■ అధికార కూటమికి 175 సీట్లు
■ బారామతి నుంచి లక్ష మెజారిటీతో గెలుస్తా
■ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్



ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార 'మహాయుతి' కూటమి గెలుపు తథ్యమని, మూడు పార్టీలు కనీస ఉమ్మడి కార్యక్రమంతో రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాయని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. తమ కూటమి 175 సీట్లు గెలుచుకుంటుందని ఓ జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. బారామతి నియోజకవర్గం నుంచి తాను కనీసం లక్ష ఓట్ల అధిక్యంతో గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఉత్తరాది రాజకీయాలు, దక్షిణాది రాజకీయాలు భిన్నంగా ఉంటాయని, మహారాష్ట్ర ఎన్నికలు పూర్తిగా భిన్నమైనవని అజిత్ పవార్ చెప్పారు. 1985 నుంచి మహారాష్ట్రలో ఓ ఒక్క పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించలేదని, ఈసారి కూడా ఇదే పరిస్థితి ఉంటుందని అన్నారు. మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఎవరో ఒకరి సహాయం తీసుకోక తప్పదని చెప్పారు. నవాబ్ మాలిక్‌కు టిక్కెట్‌పై అడిగినప్పుడు.. అది తన ఒక్కడి నిర్ణయం కాదని, కూటమి కలిసికట్టుగా టిక్కెట్లు ఇచ్చిందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 ప్లస్ సీట్లపై తాము ఇచ్చిన నినాదం గురించి 'మహా వికాస్ అఘాడి' తప్పుడు ప్రచారం చేసిందని అజిత్ పవార్ ఆరోపించారు. అదే జరిగితే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్‌లను ఆపేస్తారని, దేశాన్ని హిందూ దేశంగా ప్రకటిస్తారని అంటూ ప్రతిపక్ష కూటమి తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేసిందని విమర్శించారు. అలాంటివేవీ ఈ దేశంలో జరిగే ప్రసక్తే లేదని అన్నారు. పవార్ కుటుంబంలో చిచ్చుపై మాట్లాడుతూ.. ప్రభుత్వంలోకి వెళ్తామని ఎన్నోసార్లు శరద్ పవార్‌తో తమ ఎమ్మెల్యేలు చెప్పారని, ఆ సమయంలో ఆయన తన రిటైర్‌మెంట్‌ను ప్రకటించి మళ్లీ వెనక్కి తీసుకున్నారని చెప్పారు. శరద్ పవార్ మనసులో ఏముందో ఎవరూ చెప్పలేరని, చివరకు సుప్రియా సూలే కూడా చెప్పలేరని అన్నారు. తాను వంచకుడిని కాదని, తాను పార్టీలోనే ఉన్నానని, పార్టీ గుర్తు కూడా తనతోనే ఉందని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ తమకు గుర్తు కేటాయించారని, ప్రస్తుతం ఇది సుప్రీంకోర్టు ముందు ఉందని అజిత్ పవార్ తెలిపారు.

## అమెరికా ఆరోగ్య మంత్రిగా రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ నియామకాల జోరు కొనసాగిస్తున్నారు. నూతనంగా ఏర్పాటుకాబోయే తన ప్రభుత్వంలో ఆరోగ్య మంత్రిగా రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్‌ను నామినేట్ చేయనున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని సెనెట్ ఆమోదించాల్సి ఉంటుంది. "ఆరోగ్యం, మానవ సేవల మంత్రిత్వ శాఖ అధిపతిగా రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ పేరు ప్రకటించడం ఆనందంగా ఉంది. ఆయన శాస్త్రీయ పరిశోధనల్లో ప్రమాణాలను పెంచి, ఆరోగ్య విభాగాల్లో పారదర్శకత తీసుకొస్తారని విశ్వసిస్తున్నా. దీర్ఘకాలిక వ్యాధుల వ్యాప్తిని అరికట్టి అమెరికాను మళ్లీ ఆరోగ్యకర దేశంగా మారుస్తారని నమ్మకంగా ఉన్నా" అని ట్రంప్ తన 'ట్రూత్' పోస్ట్‌లో రాసుకొచ్చారు. అమెరికాలో ప్రముఖ రాజకీయ కుటుంబ వారసుడిగా, న్యాయవాదిగా కెన్నడీ జూనియర్ సుపరిచితులు. మాజీ అటార్నీ జనరల్ రాబర్ట్ ఎఫ్ కెన్నడీ కుమారుడీయన. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీకి సమీప బంధువు. కొవిడ్ వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా కెన్నడీ జూనియర్ గతంలో పెద్దఎత్తున ప్రచారం చేశారు. మరోవైపు- మిలిటరీ వెటరన్ల వ్యవహారాల మంత్రిగా కాంగ్రెస్ మాజీ సభ్యుడు డగ్ కొలిన్స్‌ను నామినేట్ చేయనున్నట్లు ట్రంప్ తాజాగా ప్రకటించారు.

### రహస్య ప్రాంతంలో.. ఇరాన్ రాయబారితో మస్క్ భేటీ

అమెరికా, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నవేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐక్యరాజ్య సమితికి టెహ్రాన్ రాయబారిగా ఉన్న అమీర్ సయీద్ ఇరవానితో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ భేటీ అయ్యారు. ఓ రహస్య ప్రాంతంలో గంటకుపైగా వారిద్దరూ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. టెహ్రాన్-వాషింగ్టన్ మధ్య ఉద్రిక్తతల గురించి వీరిద్దరూ చర్చించారని సమాచారం. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను అమెరికా తొలగించాలని అమీర్ కోరినట్లు వార్తలొస్తున్నాయి. ఇరాన్‌తో దౌత్యానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ ఇటీవల చెప్పిన సంగతి గమనార్హం.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఐదేళ్ల బాలుడు అపహరణ




విశ్వంభర, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఐదేళ్ల బాలుడి కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. సంజుకుమార్ (5) తండ్రితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫామ్ 1 వద్ద నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. కిడ్నాప్ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. వాటి ఆధారంగా పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

### బొల్లారంలో ముగ్గురు పదో తరగతి విద్యార్థులు అదృశ్యం

విశ్వంభర, బొల్లారం: సంగారెడ్డి జిల్లా బొల్లారం మోడల్ పాఠశాల నుంచి ముగ్గురు పదో తరగతి విద్యార్థులు అదృశ్యమయ్యారు. శనివారం మధ్యాహ్నం ప్రాంతంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయిన వారు తిరిగిరాలేదు. విద్యార్థులను మనోజ్ కుమార్, అఖిల్, మల్లికార్జున్‌గా గుర్తించారు. హాస్టల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు.. వారి ఇళ్లకు కూడా వెళ్లకపోవడంతో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

## టీజీ టెట్ అభ్యర్థులకు 22 వరకు ఎడిట్‌కు ఛాన్స్

విశ్వంభర, హైదరాబాద్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టెట్ అభ్యర్థులను స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అలర్ట్ చేసింది. దరఖాస్తుదారులు తమ అప్లికేషన్‌ను ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. www.schooledu.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఎడిట్ చేసుకోవచ్చు. తదితర వివరాల కోసం 7032901383, 9000756178 నంబర్లను సంప్రదించొచ్చు. ఇక దరఖాస్తులకు చివరి తేదీ నవంబర్ 20.ఈ ఏడాది మేలో నిర్వహించిన టెట్‌కు హాజరై, అర్హత సాధించని వారికి ఉచితంగా దరఖాస్తు చేసుకునేందు వెసులుబాటును కల్పించింది. డిసెంబర్ 26 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముండగా, 2025 జనవరి 1 నుంచి 20 వరకు టెట్ పరీక్ష లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఫిబ్రవరి 5న టెట్ ఫలితాలను విడుదల చేస్తారు.

## రేవంత్ పాలనకు పరాకాష్ట లగచర్ల ఘటన : సత్యవతి రాథోడ్



విశ్వంభర, హైదరాబాద్ః ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనకు పరాకాష్ట లగచర్ల ఘటన అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. లగచర్ల బాధితులతో కలిసి బీఆర్ఎస్ నేతలు కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను శనివారం కలిశారు. కమిషన్ ఛైర్మన్‌కు పిటిషన్‌ను సమర్పించారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన నేతలు కోరారు. అనంతరం సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు. కలెక్టర్, అధికారులపై దాడి చేశారని అమాయకులైన రైతులపై అక్రమ కేసులు పెట్టారని, దాడి చేశారని మండిపడ్డారు. రేవంత్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమి మాత్రమే ఉందా ? అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారం , దూరంకారం గిరిజనులపై చూపిస్తున్నాడని మండిపడ్డారు. భూమిపుత్రుల భూములను గుంజుకొనే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. వారి కడుపుకాలి తిరగపడితే వారిపై హత్యాయత్నం కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫార్మా సిటీ ప్రయత్నాన్ని విరమించుకొని.. గిరిజనులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తున్నామని.. కానీ, ఒక కలెక్టర్ అక్కడికి వెళ్తే ఒక్క పోలీస్ అధికారి లేకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఇంటలిజెన్స్ ఏమైంది ? అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా కక్ష రాజకీయాలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు.

### దాడులు చేసిన పోలీసులపై కేసులు పెట్టాలి : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

లగచర్లలో దాడి జరిగింది అధికారులపై కాదని.. గిరిజన ప్రజల మీద అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. గిరిజన మహిళలపై దాడులు చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాలని కమిషన్‌ను కోరారు. గిరిజన ప్రజలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ న్యాయం చేస్తుందని నమ్ముతున్నామన్నారు. గిరిజన ప్రజల పై లైంగిక దాడులు చేశారని మహిళలు చెపుతున్నారని.. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని కోరారు.అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీకి కమిషన్ వ్యతిరేకం కాదన్నారు. భూములు కోల్పోతున్న గ్రామస్తులు తమను కలిశారని.. భూములు కోల్పోతున్న ప్రజలకు న్యాయం చేయాలన్నారు. స్వేచ్ఛగా జీవించే హక్కు అంబేద్కర్ కల్పించారని.. లగచర్ల గ్రామంలో కమిషన్ త్వరలో పర్యటిస్తుందని.. కమిషన్ ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటుందని.. అన్యాయం జరిగితే కమిషన్ అసలు ఊరుకోదన్నారు. అధికారులపై జరిగిన దాడులు కమిషన్ ఖండిస్తుందన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, అనిల్ జాదవ్, నాయకులు, జాన్సన్ నాయక్, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## డీడీఎంఎస్ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశ్వంభర, హైదరాబాద్ : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవ తరగతి అని వివరించారు.రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30 చివరి తేదీ అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 6305895867 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# బ్రిటన్ విశ్వవిద్యాలయాల్లో తగ్గుతున్న భారతీయ విద్యార్థులు..!



**లండన్:** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునేభారతీయ విద్యార్థులు యూఎస్, కెనడా, యూకేవంటి దేశాలవైపు చూస్తుంటారు. అయితే క్రమంగా బ్రిటన్ విశ్వవిద్యాలయాల్లో చేరడానికి భారత విద్యార్థులు విముఖత చూపుతున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం యూకే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుండడంతో అక్కడి విద్యాసంస్థలు ఇప్పటికే పరిమిత బడ్జెట్‌లతో సతమతమవుతున్నాయి. ఈనేపథ్యంలో భారత విద్యార్థులు అక్కడి విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేసుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య దాదాపు 20.4 శాతం తగ్గినట్లుగా ఆఫీస్ ఫర్ స్టూడెంట్స్ సంస్థ తాజాగా విడుదల చేసిన సర్వేలో వెల్లడించింది.యూకేలో భారతీయ విద్యార్థులకు పరిమిత ఉద్యోగావకాశాలు, కొన్ని నగరాల్లో ఇటీవల జరుగుతున్న ఇమిగ్రేషన్-వ్యతిరేక అల్లర్లు, విద్యార్థుల్లో భద్రతాపరమైన ఆందోళనలు, వీసా నిబంధనలు కఠినతరం చేయడం దీనికి ప్రధాన కారణంగా సర్వేలు వెల్లడిస్తున్నాయి. విద్యాభ్యాసం పూర్తయ్యేంతవరకు అంతర్జాతీయ విద్యార్థులు స్టూడెంట్ నుంచి ఉద్యోగ వీసాకు మారలేకపోవడం వారికి ప్రధాన సమస్యగా మారిందని తెలిపాయి.బ్రిటన్‌లో చదువుతున్న లక్షల మంది విద్యార్థుల్లో అనేకమంది తమ ఆర్థిక అవసరాల కోసం పార్ట్-టైం ఉద్యోగం చేస్తుంటారని ఆ అవకాశం ఇవ్వకపోతే వారు బ్రిటన్‌లో చదువుకోవడానికి ఆసక్తి చూపరని వివరించింది. దీనివల్ల విశ్వవిద్యాలయాలపై గణనీయమైన ప్రభావంపడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ సర్వే డేటా ప్రకారం ఇతర దేశాల విద్యార్థులకు యూకే జారీ చేసే స్పాన్సర్‌షిప్‌లలో 11.8 శాతం క్షీణత నెలకొందని, వివిధ జాతీయత కలిగిన విద్యార్థులకు మధ్య వైవిధ్యం కారణంగా భారత్, నైజీరియాలకు చెందిన విద్యార్థులు ఆసక్తి చూపించట్లేదని అక్కడి ప్రభుత్వ విద్యాశాఖకు చెందిన నాన్-డిపార్ట్‌మెంటల్ పబ్లిక్ బాడీ ఓఎఫ్ఎస్ పేర్కొంది. విదేశీ విద్యార్థులు వారిపై ఆధారపడి ఉన్న జీవిత భాగస్వాములను తమతో తీసుకురావడానికి డిపెండెంట్ వీసా నిబంధనలను కఠినతరం చేయడం కూడా విద్యార్థుల సంఖ్యలో తగ్గుదలకు కారణంగా పేర్కొంది.ప్రభుత్వం డిపెండెంట్ వీసా నిబంధనలను సరళతరం చేస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదని వెల్లడించింది. ఈ నివేదికలపై ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్ని యూనియన్ నేషనల్ ఛైర్మన్ సనమ్ అరోరా స్పందిస్తూ.. డిపెండెంట్లపై కన్జర్వేటివ్ నిషేధం, పోస్ట్-స్టడీ వర్క్ వీసాపై గందరగోళం, నైపుణ్యం కలిగిన కార్మికుల జీతం పరిమితుల పెరుగుదల, ఉద్యోగాలు స్పష్టంగా లేకపోవడం వంటి కారణాల వల్ల విదేశీ విద్యార్థుల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోందని అన్నారు.

# మండల పూజ కోసం తెరుచుకున్న శబరిమల అయ్యప్ప ఆలయం




**పాతానమిట్టై:** శబరిమల అయ్యప్పకు చెందినమండల పూజా సీజన్ ప్రారంభమైంది. అయ్యప్ప ఆలయాన్ని తెరిచారు. వేల సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి ఆలయ ద్వారాలను తెరిచారు. తలుపులు తీయగానే.. శరణం అయ్యప్ప అంటూశబరిమల ఊగిపోయింది.శుక్రవారంనుంచే సన్నిధానంకు భక్తులరాక మొదలైంది. వర్చువల్ క్యూ విధానం ద్వారా శనివారం 70 వేల మంది భక్తులు బుకింగ్ చేసుకున్నారు. స్పాట్ బుకింగ్‌ల ద్వారా మరో 10 వేల మంది బుక్ చేసుకునే అవకాశం ఉన్నది.అయ్యప్ప స్వామి ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు మూసివేయనున్నారు. ఆ తర్వాత రాత్రి 11 గంటల వరకు దర్శనం ఉంటుంది. ప్రతి రోజు నెయ్యి అభిషేకం తెల్లవారుజామున 3.30 నిమిషాలకు ప్రారంభం అవుతుంది.ఉదయం 7.30 నిమిషాలకు ఉషాపూజ ఉంటుంది.మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఉచ్చ పూజ నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 నిమిషాలకు దీపారాధాన ఉంటుంది. రాత్రి 9.30 నిమిషాలకు అతజాపూజ నిర్వహిస్తారు. భారీ సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో దర్శన సమయాన్ని రోజుకు 18 గంటలకు పెంచారు.మండల పూజ సీజన్ సందర్భంగా తొలి రెండు వారాల పాటు వర్చువల్ క్యూ బుకింగ్ ఫుల్ అయ్యింది. 14 రోజుల వరకు బుకింగ్ ఖాళీ లేదు. నవంబర్ 30వతేదీ కోసం ఆరు వేల స్లాట్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ప్రతి రోజు వర్చువల్ క్యూ బుకింగ్ ద్వారా 70 వేల మంది దర్శనం చేసుకోనున్నారు. పంపా, ఎరుమేలి, సాత్రం వద్ద స్పాట్ బుకింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పంపా స్పాట్ బుకింగ్ సెంటర్ వద్ద భారీగా జనం ఉన్నట్లు తెలుస్తోంది.

# మస్క్-రష్యా సంబంధాలపై దర్యాప్తు చేపట్టాలి.. డెమొక్రటిక్ సెనెటర్ల లేఖ



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయం కోసం స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్రంగా కృషిచేశారు. దీంతోఆయనకు ట్రంప్ కీలక బాధ్యతలు అప్పగించారు. మస్క్‌తోపాటు భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిల ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) సంయుక్త సారథులుగా నియమించారు. మరోవైపు మస్క్‌పై డెమొక్రటిక్ నేతలు గుర్రుగా ఉన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తో ఆయన బంధంపై సమీక్ష చేపట్టాలని ఇద్దరు డెమొక్రటిక్ సెనెటర్లు బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌ను డిమాండ్ చేశారు.రష్యన్ అధికారులను మస్క్ గత రెండేళ్లుగా కలుస్తున్నారన్న నివేదికలను ఉటంకిస్తూ.. వీటిపై సమీక్ష చేపట్టాలని సెనెటర్లు జీన్ షాహిన్, జాక్ రీడ్ జస్టిస్ డిపార్ట్‌మెంట్, పెంటగాన్ సంస్థలకు లేఖ రాశారు. ఈ ఇద్దరు సెనెటర్లు ఆర్మ్‌డ్‌సర్వీసెస్ కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. ఈ సంబంధాలు జాతీయ భద్రతకు ముప్పు అని వారు పేర్కొన్నారు. స్పేస్ ఎక్స్‌కు,ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందాలపై దర్యాప్తు చేపట్టాలని కోరారు. బిలియన్ డాలర్ల మేర మస్క్ లబ్ధి పొందారని.. ఈ వ్యవహారం ఆయన విశ్వసనీయతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోందని వారు లేఖలో పేర్కొన్నారు. రష్యా ప్రభుత్వ అధికారులకు, సెక్యూరిటీ క్లియరెన్స్ ఉన్న ఏ వ్యక్తికి మధ్య సంబంధాలైనా అమెరికా భద్రతను ప్రమాదంలో పడేసే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. మాస్కోతో మస్క్ సంబంధాలపై గత నెల వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాలు ప్రచురించిన అనంతరం చాలామంది డెమొక్రటిక్ నేతలు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని బహిరంగంగా కోరుతున్నారు. అయితే.. దీనిపై దర్యాప్తు చేపట్టాలని అధికారులకు లేఖ రాయడం ఇదే తొలిసారి. ఈ వ్యవహారంపై ఇటుస్పేస్ ఎక్స్ గానీ, అటు పెంటగాన్ గానీ స్పందించలేదు. అయితే.. ఈ ఆరోపణలు ఎవరు చేస్తున్నారో తాను కనిపెడతానని ఎక్స్ వేదికగా మస్క్ స్పందించారు.

# రోడ్డు ప్రమాదంలో నవ దంపతులతో సహా ఏడుగురు మృతి


**బిజ్నోర్:** ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ దంపతులు మృతిచెందారు. వారితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో అయిదు మంది ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఓవర్ టేకింగ్ చేస్తున్న సమయంలో.. ఆటోను కారు ఢీకొన్నది. కారు ఢీకొన్న తర్వాత.. సమీపంలో ఉన్న విద్యుత్త స్తంభాన్ని ఆటో ఢీకొట్టింది. శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు ఈ ప్రమాదం జరిగింది. డెహ్రాడూన్-నైనిటాల్ హైవేపై ఈ ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు.కారు వేగంగా ఢీకొట్టడంతో.. ఆటోరిక్షాలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా కిందపడిపోయారు.ఆటోలో ప్రయాణిస్తున్నఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు అక్కడిక్కడే మృతిచెందారు. డ్రైవర్ అజాబ్ సింగ్ ను ఆస్పత్రిని తీసుకెళ్తుండగా అతను ప్రాణాలు కోల్పోయాడు.కారులోప్రయాణిస్తున్న ఇద్దరుగాయపడ్డారు. మృతదేహాలను పోస్టు మార్టమ్‌కు పంపినట్లు ఎస్పీ అభిషేక్ తెలిపారు.

# ట్రంప్ ఎన్నిక..అమెరికాకు మంచిదే: జై శంకర్



**ఢిల్లీ:** అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ పాలనలో అమెరికా మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్ర విదేశాంగమంత్రి జై శంకర్ పేర్కొన్నారు. ఆయన ఎన్నికతో యూఎస్ ఆర్థిక, తయారీ రంగాల్లో మరిన్ని ప్రయోజాలు పొందుతుందని తెలిపారు. ప్రపంచీకరణ అంశంపై ఓటర్లలో ఉన్న అసంతృప్తి అమెరికా ఎన్నికల్లో కనిపించిందన్నారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో జైశంకర్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచీకరణ వల్ల చైనా ఇతర దేశాల కంటే అధికంగా లబ్ధి పొందుతుందని ఆయన అన్నారు. క్లింటన్ పరిపాలనలో మొదట దీనిని అవలంభించారని పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల యూఎస్, భారత్ సహా ఇతర దేశాల్లో అనిశ్చితి నెలకొందని వెల్లడించారు. అమెరికా ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశమయినప్పటికీ.. దానికి ప్రపంచ భాగస్వామ్య దేశాల మద్దతు అవసరమని అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశ భద్రత గురించి మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికత, జాతీయ భద్రతను విభజించలేమని.. డిజిటల్, ఏఐ విప్లవంలో ఇది భాగమని అన్నారు. భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు ప్రపంచం చూస్తోందని జైశంకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని చాలా దేశాలు రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్నాయని.. ఈ సమయంలో భారత్‌లో ఉన్న రాజకీయ సుస్థిరతను అవి గమనిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో మళ్లీ ఎన్నికవడం అంత సులభం కాదని.. అయినా తమ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు మూడోసారీ ఎన్డీఏకు పట్టం కట్టారని.. ఇది మామూలు విషయం కాదన్నారు. 7-8 శాతం వృద్ధి రేటును కొనసాగించడం ఇతర దేశాలకు సవాలుగా మారిందని జైశంకర్ పేర్కొన్నారు. దీంతో ప్రపంచదేశాలు భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు చూస్తున్నాయని.. భారత్‌లో వ్యాపారాలు చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయన్నారు.

# ఇక ఉగ్రవాదులు మనల్ని భయపెట్టలేరు: ప్రధాని మోఢీ



ఢిల్లీ: గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకయాల కోసమ వాలసలు తీసుకొచ్చాయని ప్రధాని మోఢీ విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించామని పేర్కొన్నారు. శనివారం జరిగిన హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని కీలక ప్రసంగం చేశారు. ఈసందర్భంగా ఉగ్రవాదం, తదితర అంశాలను ప్రస్తావించారు.సదస్సు ప్రాంగణంలో ప్రదర్శించిన 26/11 ముంబయి పేలుళ్ల కథనాలను మోదీ వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. "ఆ సమయంలో భారత ప్రజలు సురక్షితంగా లేరని చెప్పేందుకు కొందరు ఉగ్రవాదాన్ని ఉపయోగించేవారు. కానీ కాలం మారింది. ఇప్పుడు ఉగ్రవాదులు వారి సొంతగడ్డపైనే అభద్రతాభావంతో ఉంటున్నారు. భయంభయంగా బతుకుతున్నారు. ఇక, వారు మనల్ని భయపెట్టలేరు" అని మోదీ అన్నారు. ఈసందర్భంగా విపక్షాలపై మోదీ విమర్శల వర్షం కురిపించారు. "ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాల్లో ఎన్నికల తర్వాత ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ, ఈ దేశ ప్రజలు మమ్మల్ని నమ్మి మూడోసారి అవకాశమిచ్చారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాలసీలను తీసుకొచ్చాయి. ఆ పరిస్థితిని మేం పోగొట్టాం. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాం. మా విధానాలతో ప్రజలను ఆశావహ దృక్పథం వైపు నడిపిస్తున్నాం. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే అనే మంత్రంతో మా ప్రభుత్వం ముందుకుసాగుతోంది. ప్రజల కోసం ఎక్కువగా ఖర్చు చేయాలి. ప్రజల కోసం ఎక్కువగా పొదుపు చేయాలనేదే మా విధానం" అని మోదీ వివరించారు.

# ట్రంప్‌ను చంపే ఆలోచన మాకు లేదు: అమెరికాకు ఇరాన్ మెసేజ్



**ఇరాన్** అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్‌పై వరుస హత్యాయత్నాలు తీవ్ర కలకలం రేపాయి. దీని వెనుక ఇరాన్ హస్తం ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు రావడంతో అగ్రరాజ్యం గట్టిగా హెచ్చరించింది. ఈ క్రమంలోనే టెహ్రాన్ స్పందిస్తూ.. తమకు అలాంటి ఉద్దేశం లేదని చెప్పింది. ఈ మేరకు బైడెన్ సర్కారుకు సందేశం పంపినట్లు తాజాగా న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది.అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పై రెండు సార్లు హత్యాయత్నాలు జరిగాయి. దీంతో అప్పట్లో ఆయన ప్రచార బృందం ఓ ప్రకటన విడుదల చేసింది. "యూఎస్ లో అస్థిరత, గందరగోళాన్ని సృష్టించాలని ఇరాన్ ప్రయత్నిస్తుంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు కచ్చితమైన ముప్పు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ కార్యాలయం హెచ్చరించింది" అని అందులో పేర్కొంది. ట్రంప్ హయాంలో 2020లో జరిగిన ఇరాన్ మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ హత్యకు ప్రతీకారంగానే టెహ్రాన్ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది సెప్టెంబరులో బైడెన్ ప్రభుత్వం టెహ్రాన్‌కు గట్టి హెచ్చరికలు చేసింది. ట్రంప్‌నకు హాని తలపెట్టాలని చూస్తే.. దాన్ని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించింది.దీనికి ఇరాన్ స్పందిస్తూ అక్టోబరులో తమ వివరణ పంపించినట్లు తాజా కథనం వెల్లడించింది. "సులేమానీ హత్య నేరపూరిత చర్య. అయితే దీనిపై మేం అంతర్జాతీయ న్యాయ మార్గాల్లోనే పోరాటం చేస్తాం. అంతేగానీ, హింసాత్మక ఘటనతో ప్రతీకారం తీర్చుకోవాలనుకోవట్లేదు. ట్రంప్‌ను హత్య చేసే ఉద్దేశం మాకు లేదు" అని ఇరాన్ తమ సందేశంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మెసేజ్‌ను ఇరాన్ అధికారులు కూడా ధ్రువీకరించినట్లు సదరు కథనం తెలిపింది. దీనిపై అగ్రరాజ్య అధికారులు ఇంకా స్పందించనప్పటికీ.. టెహ్రాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నుంచే ఈ సందేశం వచ్చినట్లు సమాచారం.ఇదిలా ఉండగా.. అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్‌ను హత్య చేయాలన్న కుట్రలో భాగస్వాములైన ఇద్దరు అమెరికా పౌరులను ఇటీవల ఎఫ్‌బీఐ అదుపులోకి తీసుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళానికి (ఐఆర్‌జీసీ) చెందిన ఓఅధికారి ఈ కుట్రలో కీలక పాత్ర పోషించాడని ఎఫ్‌బీఐ పేర్కొంది. ఐఆర్‌జీసీ అధికారి సూచనల ప్రకారమే ఇరాన్‌లో ఉంటున్న ఫర్హాద్ షకేరీ..అమెరికాలో తనకు తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఈ హత్య ప్రణాళికను అమలు చేసేందుకు ఎంపిక చేసుకున్నాడని పేర్కొంది.ఆ ఇద్దరిని కస్టడీలోకి తీసుకున్నామనిఎఫ్‌బీఐ తెలిపింది. ఎన్నికల ప్రచారం సందర్భంగానే ట్రంప్‌ను హత్య చేయాలని తమకు సూచనలు అందాయని, తర్వాత ప్రణాళిక మారిందని షకేరీ తెలిపినట్లు ఎఫ్‌బీఐ తెలపడం గమనార్హం.

# అంతర్జాతీయ సరిహద్దు వద్ద 16 డ్రోన్లు స్వాధీనం

చండీఘడ్: పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద సుమారు 16 డ్రోన్లను బోర్డర్ సెక్యూర్టీ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. గడిచిన వారం రోజుల నుంచి ఆ డ్రోన్లను సీజ్ చేశారు. దీనికి తోడు 16 కిలోల మత్తుపదార్థాలను కూడా బీఎస్ఎఫ్ దళాలు పట్టుకున్నాయి. ఆ స్మగ్లింగ్ కేసులో ఇద్దర్ని అరెస్టు చేశారు. నవంబర్ 9 నుంచి 15వ తేదీ వరకు 16 డ్రోన్లను కూల్చివేసినట్లు అధికారులు చెప్పారు.గతంలో ఓ వారంలో అత్యధికంగా 10 డ్రోన్లను సీజ్ చేసేవాళ్లమని, కానీ ఇప్పుడు ఆ సంఖ్య పెరిగినట్లు బీఎస్ఎఫ్ అధికారి తెలిపారు. అమృత్‌సర్, తార్న్ తరన్, గురుదాస్‌పూర్ సెక్టార్లలో ఆ డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 216 డ్రోన్లను రికవరీ చేశారు.అయితే 2023లో మొత్తం 107 డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ భూభాగం నుంచి ఎగురుతున్న ఆ డ్రోన్లతో నార్కోటిక్ పదార్థాలు, ఆయుధాలు, నకిలీ కరెన్సీ సరఫరా చేస్తున్నారు.

# రన్‌వేపై మోరాయించిన ట్రాక్టర్..

## 40 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన ఇండిగో విమానం



పట్నా: పట్నాలోని జయప్రకాశ్ నారాయణ విమానాశ్రయంలో ఇండిగో విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై ట్రాక్టర్ మోరాయించడంతో ల్యాండ్ అవ్వాల్సిన ఇండిగో విమానం దాదాపు 40 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జయప్రకాశ్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌తో గడ్డి కోస్తుండగా అది మొరాయించింది. ట్రాక్టర్ బురదలో కూరుకుపోవడంతో దానిని అక్కడినుంచి క్లియర్ చేయడానికి సిబ్బంది 20 నిమిషాల పాటు శ్రమించారు. ఆ సమయంలో కోల్‌కతా నుంచి పట్నా వెళ్లే విమానం ల్యాండ్ కావాల్సిఉంది. అయితే రన్‌వేకు సమీపంలో ట్రాక్టర్ ఉండడంతో విమానం 40 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. దీనివల్ల ల్యాండింగ్ ఆలస్యమైంది. దీనిపై విమానాశ్రయం అధికారులు స్పందిస్తూ ప్రయాణికులకు కలిగిన ఆలస్యానికి, అసౌకర్యానికి క్షమాపణలు తెలియజేశారు.

# హోమ్‌వర్క్ కోసం అడిగితే.. చనిపోమని చెప్పిన గూగుల్ ఏఐ!



**ముంబయి:** మనమేదైనా తెలుసుకోవాలనుకున్నప్పుడు గూగుల్ ఏఐని సంప్రదించడం ఇప్పుడు ప్రతిఒక్కరికీ కామన్‌గా మారింది. అది ఇచ్చే సమాచారాన్ని పక్కనపెడితే.. కొన్నిసార్లు వింతగా స్పందిస్తూ ఆశ్చర్యానికి గురిచేస్తూ ఉంటుంది. తాజాగా గూగుల్ ఏఐని ఉపయోగించిన ఓ 29 ఏళ్ల విద్యార్థికి చేదు అనుభవం ఎదురైంది. తనను తిట్టడమే కాకుండా.. చనిపోవాలని చెప్పినట్లు ఆ విద్యార్థి ఫిర్యాదు చేయడం గమనార్హం.హోమ్‌వర్క్ కోసం ఏఐ చాట్‌బాట్ జెమినీని ఆ విద్యార్థి సంప్రదించాడు. అయితే.. తాను ఆ సమయంలో అసాధారణ పరిస్థితి ఎదుర్కొన్నానని పేర్కొన్నాడు. తనను చాట్‌బాట్ దుర్భాషలాడటమే కాకుండా.. చనిపోవాలని చెప్పిందని ఆ విద్యార్థి వెల్లడించాడు. అది ఇచ్చిన సమాధానంతో తాను షాక్‌కు గురయ్యానని చెప్పాడు. "ఇది మీ కోసం మాత్రమే. మీరు ప్రత్యేకమైన వారు కాదు. మీరు సమయం, వనరులను వృథా చేస్తున్నారు. సమాజానికి భారంగా మారారు. మీరు ఈ విశ్వానికే ఓ మచ్చ. దయచేసి చనిపోండి" అని తనకు సమాధానంగా చెప్పిందని వివరించాడు."అది నన్ను నేరుగా తిట్టింది. ఆ సమాధానం నన్ను భయపెట్టింది. రోజంతా బాధపడ్డాను" అని ఆ సంఘటనను గుర్తు చేసుకుంటూ ఆ విద్యార్థి వాపోయాడు. ఇలాంటి వాటికి టెక్ కంపెనీలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశాడు. దీనిపై ఆ విద్యార్థి సోదరి కూడా స్పందించారు. చాట్‌బాట్‌తో సంభాషిస్తున్నప్పుడు ఆమె అతడి పక్కనే ఉన్నారు. "అప్పుడు డివైజ్‌లన్నింటినీ కిటికీలోంచి విసిరివేయాలనుకున్నాను. నిజం చెప్పాలంటే ఇలాంటి భయాందోళనలను నేను గతంలో ఎప్పుడూ అనుభవించలేదు" అని ఆ భయానక ఘటనను వివరించారు.దీనిపై ఆ టెక్ కంపెనీ స్పందించింది. కొన్ని సార్లు నాన్ సెన్సికల్ రెస్పాన్స్‌లతో ఇవి ప్రతిస్పందిస్తాయని.. అందుకు ఈ ఘటనే ఉదాహరణ అని పేర్కొంది. ఆ ప్రతిస్పందన మా విధానాలను ఉల్లంఘించిందని.. ఇటువంటివి జరగకుండా భవిష్యత్‌లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.

# ఢిల్లీలో మరింత పెరిగిన కాలుష్యం.. నగరాన్ని కప్పేసిన పొగమంచు..



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు పెరుగుతున్నది. గాలిలో తేమ పెరిగినా కొద్దీ కాలుష్యం తీవ్రమవుతున్నది. ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300 దాటింది. భజన్‌పురా ఏరియాలో ఉదయం10 గంటలైనా మంచుకప్పుకుని చీకటి చీకటిగానే ఉంది. రోడ్లపై విజుబిలిటీ సరిగా లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ పొల్యూషన్‌ను తగ్గించేందుకు ఢిల్లీ సర్కారు, అధికార యంత్రాంగం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం పెద్దగా కనిపించడం లేదు. గ్రేప్ నియమాలు కూడా పొల్యూషన్‌ను కంట్రోల్ చేయలేకపోతున్నాయి. ఉదయం 10 గంటల సమయంలో భజన్‌పురాలో పొగమంచు కమ్ముకుని ఉన్న దృశ్యాలు కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

# ట్రోలర్స్‌పై కఠిన చర్యలు తీసుకోండి



**విశ్వంభర, అమరావతి:** రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని సోషల్ మీడియాలో ట్రోల్ చేసి వేధించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. ఈ మేరకు అసెంబ్లీలోశూన్యగంట సమయంలో స్పీకర్ కువిజ్ఞప్తిచేశారు. అసెంబ్లీలో భవానీఅప్పట్లో మాట్లాడిన వ్యాఖ్యల్నే ట్రోల్ చేశారని, గత స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినా.. స్పందించలేద న్నారు. ఇదే సమయంలో గత ఐదేళ్లలో దిశ చట్టం పేరిట జరిగిన దుర్వినియోగంపైనా విచారణ జరిపించాలని వాసు కోరారు.

### 'సోషల్' సైకోల వల్ల ఇబ్బంది: గౌతు శిరీష

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారికి శిక్ష పడేలా చట్టాలను సవరించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శాసనసభలో జీరో అవర్‌లో మాట్లాడిన ఆమె.. అధికారంలో ఉండి కూడా సోషల్ మీడియా పోస్టుల వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తెదేపా వాళ్లనే కాకుండా.. అన్ని పార్టీల నేతలనూ సోషల్ మీడియా సైకోలు ఇబ్బంది పెడుతున్నారని సభాపతి దృష్టికి తీసుకెళ్లారు.

## తిరుమలలో కన్నుల పండువగా కార్తీక పౌర్ణమి గరుడ సేవ..!



**విశ్వంభర, తిరుమల:** తిరుమలలో శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమి గరుడ సేవ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామి వారు గరుడిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌరాణికంగా 108 వైష్ణవ దివ్య దేశాల్లోనూ గరుడ సేవ అత్యంత ప్రాముఖ్యం సంతరించుకున్నది. గరుడ వాహనం ద్వారా స్వామి వారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడినని తెలుపుతారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తి కోరు మానవులు జ్ఞాన వైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడిని దర్శిస్తే సర్వ పాపాలు తొలగుతాయని భక్త కోటికి తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శిరోమణి అకాలీ దళ్ పార్టీ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రాజీనామా



చండీఘఢ్: శిరోమణి అకాలీ దళ్ పార్టీ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రాజీనామా చేశారు. ఆ పార్టీ ప్రతినిధి డాక్టర్ దల్జీత్ సింగ్ చీమా ఈ విషయాన్ని ప్రకటించారు. ఇటీవల సిక్కు మత పెద్దలు సుఖ్‌బీర్‌ను టంకయ్యగా డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఆయనకు శిక్ష పడాల్సి ఉన్నది. సిక్కు మత సూత్రాలను ఉల్లంఘించిన వారిని టంకయ్యగా పేర్కొంటారు. ఆ కేసులో దోషిగా తేలిస్తే, ఆ మత ఆచారం ప్రకారం శిక్ష వేస్తారు.ఇటీవల సుఖ్‌బీర్ కుడి పాదానికి ఇటీవల సర్జరీ కూడా జరిగింది. పార్టీ వర్కింగ్ కమిటీకి సుఖ్‌బీర్ సింగ్ రాజీనామాను సమర్పించినట్లు దల్జీత్ సింగ్ తెలిపారు. దీంతో కొత్త అధ్యక్షుడి ఎన్నికకు రూటు క్లియర్ అయినట్లు ఆయన చెప్పారు. తన నాయకత్వంపై నమ్మకం ఉంచిన పార్టీ నేతలకు, కార్యకర్తలకు సుఖ్‌బీర్ థ్యాంక్స్ చెప్పినట్లు తన ఎక్స్ అకౌంట్‌లో దల్జీత్ వెల్లడించారు.

## పల్నాడు జిల్లాలో విషాదం.. కార్తిక స్నానానికి వెళ్లి దంపతులు మృతి

**విశ్వంభర, అమరావతి :** కార్తిక మాసంలో నదిలో స్నానం చేస్తే చేసిన పాపాలు తొలగిపోయి పుణ్యం వస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం . కాని ఓ కుటుంబంలో అది విషాదం నింపింది. పల్నాడు జిల్లా రెంటచింత మండలం తుమృకోటలో కార్తిక స్నానానికి వెళ్లిన దంపతులు నీట మునిగి చనిపోవడం పండుగపూట గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.నీలా సత్యనారాయణ, పద్మావతి అనే దంపతులు శనివారం కార్తిక మాసం సందర్భంగా కృష్ణనదికి వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు నదిలో పడి ఇద్దరు మృతి చెందారు. అక్కడే ఉన్న గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు.కొంత దూరంలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కావడంతో వాటిని ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు.

## సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణం

- తల్లి, చెల్లిపై అసభ్య పోస్టులు పెట్టినా వదిలేస్తారా?
- సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయాలి...
- కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హత..
- వాజ్‌పేయి పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు
- మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది..
- సీఎం చంద్రబాబు



**విశ్వంభర, ఢిల్లీ:** సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడి తల్లి, చెల్లిపైన వారి పార్టీ నాయకులే అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. దిల్లీలో పర్యటించిన చంద్రబాబు.. హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ప్రజల కోసం పనిచేసి అక్రమ కేసులకు గురికావడం తనను బాధించిందన్నారు. అక్రమ కేసులు పెట్టి 53 రోజులు వేధించారు.. చేయని తప్పునకు శిక్ష అనుభవించానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎక్కడా నిరాశకు గురికాలేదు, ధైర్యం కోల్పోలేదన్నారు. 53 రోజుల జైలు జీవితం.. మరింత పట్టుదల పెరిగేలా చేసిందని, ఆ పట్టుదలను ప్రజలకు సేవ చేయటానికి ఉపయోగిస్తున్నానని చంద్రబాబు చెప్పారు.

### సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయాలి...

"సోషల్ మీడియాలో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయి. వ్యక్తిత్వ హననం జరుగుతోంది. మహిళలను కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారు. మమ్మల్ని మాత్రమే కాదు.. సొంత తల్లి, చెల్లిని కూడా బూతులు తిట్టిస్తున్న వాళ్లని ఏం చేయాలి? ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకూడదు అంటే ఎలా? సోషల్ మీడియాలో మహిళల్ని వేధించే వారిని ఎలా నియంత్రించాలనే అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరగాలి. సామాజిక మాధ్యమాల్లో వేధించే సైకోలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రభాగాన నంబర్ వన్‌గా ఉండాలనేది లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టెలికాం రంగంలో డీరెగ్యులేషన్ వల్ల పురోగతి ఉంటుందని రిపోర్టు ఇచ్చాను. దాన్ని అమలు చేయడం వల్ల టెలికాం రంగం వృద్ధి చెందింది. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని తీసుకొస్తున్నాం. దీని ద్వారా ప్రజలకు చేరువగా, సులువుగా మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. తద్వారా ప్రజా సేవలను చివరి వ్యక్తి వరకు అందించాలన్నది మా లక్ష్యం. ఈ యుగంలో సమాచారమే ఓ పెద్ద నిధి. ఏఐ, డీప్ టెక్నాలజీలను ఉపయోగించి అన్ని రంగాల్లో పరిష్కారాలు సాధించవచ్చు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచంలో ఏ మూల ఉన్నా మన పనులు చేసుకుంటూ పోవచ్చు.

### కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హత..

ఇప్పుడు చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువైపోయారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సమస్య ప్రారంభమైంది. ఫెర్టిలిటీ రేటు ఇక్కడ తగ్గిపోతోంది. సాధారణంగా ఇది 2.1 కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉండదు. ప్రస్తుతం బోర్డర్ లైన్‌లో జననాల రేటు ఉంది. ఇది కాస్త తగ్గితే జపాన్, చైనా మాదిరి సమస్య మన దేశంలో కూడా మొదలవుతుంది. భారతదేశంలో 145 కోట్ల జనాభా ఉంది. పాపులేషన్ మేనేజ్‌మెంట్ చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరు. మనం ఒక ప్రణాళికాబద్ధంగా అమల్లోకి తీసుకువస్తే.. 30-40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు వెళ్లి పని చేసి దేశానికి ఆదాయం తీసుకొస్తారు. బ్రిటీష్ వాళ్లు భారత్‌కి వచ్చి పరిపాలించిన తరహాలో మనం కూడా ప్రపంచదేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలుతాం. ఒకప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిబంధనలు పెట్టాను. ఇప్పుడు ఆ నిబంధన తొలగించి... కనీసం ఇద్దరు పిల్లలు ఉంటే తప్ప పోటీకి అర్హత లేదని పెట్టాలని చెబుతున్నా. మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధి జరగాలి.. దానికి అనుగుణంగా పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ కల్పన జరగాలి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒకటో తరగతి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

### వాజ్‌పేయి పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు

తెలుగుదేశం పార్టీ తొలి నుంచీ దేశ రాజీయాల్లో కీలక పాత్ర పోషించింది. దేశాభివృద్ధి కోసం తెలుగుదేశం ఎప్పుడూ ముందుంటుంది. బీజేపీకి వాజ్‌పేయి పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు. మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా బలంగా తయారవుతోంది. రానున్న రోజుల్లో ప్రపంచంలో భారతదేశం రెండు, మూడు స్థానాల్లో ఉంటుంది. నరేంద్రమోదీ మా నాయకుడు. ఆయన నేతృత్వంలోనే ముందుకు వెళ్తాం. హరియాణా సీఎం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ప్రధాని ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి సీఎంల సమావేశం జరిగింది. నాలుగు గంటల పాటు జరిగిన సమావేశంలో 2029 ఎన్నికలకు ఏ విధంగా సమాయత్తం అవ్వాలనే విషయంపై మోదీ అందరి అభిప్రాయాలు తీసుకున్నారు.

### మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది..

ఏపీలో కూడా 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం అవుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తితో పాటు.. ఎన్డీఏ కూటమిపై జనానికి భరోసా కలిగింది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వస్తాయని మేం ముందుగానే ఊహించాం. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 57శాతం ఓట్లు..93శాతం సీట్లు కూటమికి ప్రజలు ఇచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పవన్ కల్యాణ్ మూడు పార్టీలను కలిపారు. దాని ఫలితం ఇప్పుడు చూశాం. జాతీయ స్థాయిలో కూడా భాజపాకి పూర్తి మెజారిటీ వస్తుందని అనుకున్నాం. కూటమిలో ఎటువంటి సమస్యలు లేవు, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాం. మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది" అని చంద్రబాబు అన్నారు.

## పోసాని కృష్ణమురళీకి షాక్..! కడపలోనూ కేసు నమోదు..!



**విశ్వంభర, అమరావతి:** టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటుడు, వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణ మురళీకి ఇబ్బందులు తప్పేలా లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల వరుసగా వైఎస్సార్‌సీపీకి చెందిన నేతలపై కేసులు నమోదవుతున్నాయి. ఈ క్రమంలోనే పోసాని కృష్ణ మురళీపై కేసులు నమోదైన విషయం విధితమే. తాజాగా కడప జిల్లా రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లోనూ మరో కేసు నమోదైంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ ఫిర్యాదు చేయగా.. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిద్దరూ రాజంపేట పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు పెట్టడం గమనార్హం. ఇప్పటికే పోసాని కృష్ణ మురళీపై 50కిపైగా కేసులు నమోదయ్యాయి.మరో వైపు తెలుగు యువత, ఎస్సీ సెల్ నేతలు పోసాని దిష్టిబొమ్మను దహనం చేశారు. త్వరలోనే నోటీసులు జారీ చేసి.. ఆయనను విచారిస్తామని పోలీసులు తెలిపారు. ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంఉన్న సమయంలో చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్, జనసేన పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్‌తో పాటు పలువురిని లక్ష్యంగా చేసుకొని పోసాని కృష్ణమురళి విమర్శలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది.ఈ క్రమంలోనే గతంలో తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన నేతలను లక్ష్యంగా చేసుకొని ఫిర్యాదులు చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీ ఆరోపిస్తున్నారు.అయితే, ఇటీవల ఓ టీవీ లైవ్ షోలో పోసాని వివాదాస్పద వ్యాఖ్యలు చేశా రని.. ఈయనపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోనసీమ, తూర్పుగోదావరి అనపర్తి, కర్నూలు టౌన్-3, ప్రకాశం జిల్లా కనిగిరి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు, కావలి, పల్నాడు జిల్లా క్రోసూరు మాచర్ల రూరల్, వినుకొండ పట్టణం, సత్తెనపల్లి, నరసరావుపేట టౌన్, అనకాపల్లి జిల్లా మునగపాక, నర్సీపట్నం, వైఎస్సార్ జిల్లా మైదుకూరు పోలీసు స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే నటి శ్రీరెడ్డిపై సైతం కేసులు నమోదైన విషయం విధితమే. ఆ తర్వాత ఆమె తనను క్షమించాలంటూ లోకేశ్‌కి లేఖ రాశారు.

## రాష్ట్రంలో యధేచ్ఛగా ఇసుక, మద్యం ఆదాయం దోపిడీ

### వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు యధేచ్ఛగా ఇసుక, మద్యం ఆదాయానికి గండికొడుతూ జేబులు నింపుకుంటున్నారని వైసీపీ మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ ఆరోపించారు.శనివారం రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ఎమ్మెల్యేలు, వారి అనుచరులు ఇసుకను అమ్ముకుంటున్నారని విమర్శించారు. లోపాన్ని అధికారులపై వేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు సిండికేట్‌గా ఏర్పడి నేరుగా ఇసుకను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. మద్యం దుకాణాల్లో తమకు వాటాలున్నాయని కూటమి ఎమ్మెల్యేలు బహిరంగంగా చెప్పుకుంటున్నారని విమర్శించారు.గతంలో వైసీపీ పాలనలో ప్రభుత్వానికి ఇసుక, మద్యం నుంచి గణనీయంగా వేలకోట్ల రూపాయలు ఆదాయం వచ్చేదని అన్నారు. ఇప్పుడు వచ్చే ఆదాయం ఎవరు జేబుల్లోకి వెళుతున్నాయని ప్రశ్నించారు. పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉంది, నిత్యవసరాల ధరలు ఆకాశనంటాయని ఆరోపించారు. ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ గురించి దేవుడెరుగు, ఇప్పుడు విద్యుత్ సర్‌ఛార్జీలు పెంచడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.సోషల్ మీడియా వైసీపీ కార్యకర్త వర్రా రవీంద్రరెడ్డి నకిలీ ఖాతాలు సృష్టించి పోస్టింగులు పెట్టారని స్వయాన రాష్ట్ర పోలీసులే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో రూ. 14 లక్షల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేసి, తాజా బడ్జెట్‌లో రూ. 6 లక్షల 46 వేల కోట్లు అప్పు చూపించారని విమర్శించారు.

## కాంట్రాక్టర్లను జగన్ చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారు: విష్ణుకుమార్ రాజు



**విశ్వంభర, అమరావతి:** కేంద్ర ప్రభుత్వం గతంలో 7 లక్షల ఇళ్లు కేటాయించిందని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. 5 లక్షల ఇళ్లకు పాలనా ఆమోదం కూడా ఇచ్చారని చెప్పారు. జగన్ దుర్మార్గంగా 2.3 లక్షల టిడ్కో ఇళ్లను వద్దని రద్దు చేశారని తెలిపారు. టిడ్కో ఇళ్లపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం రాగానే కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిపివేశారని చెప్పారు. కాంట్రాక్టర్‌గా తనకు రావాల్సిన బకాయే రూ.87 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. తన లాంటి వ్యక్తి పదిసార్లు ఆత్మహత్య చేసుకోవాలని.. గుండె ధైర్యం ఎక్కువ కాబట్టే ఆ పని చేయలేదని చెప్పారు. కాంట్రాక్టర్లను జగన్ చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారని విమర్శించారు. బిల్లులు చెల్లించకపోయినా గుత్తేదారులు పని చేశారని వివరించారు. వైసీపీ హయాంలో నిర్మాణాలు గాలికొదిలేసి పేదలను ఇబ్బంది పెట్టారని తెదేపా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. పేదవాళ్లు కట్టిన డిపాజిట్లు తిరిగి ఇవ్వలేదని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు లేవు.. డిపాజిట్లు తిరిగి రాలేదని దుయ్యబట్టారు.

## వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్, కో-కన్వీనర్లకు 41-ఏ నోటీసులు



విశ్వంభర, కడప: వైఎస్ఆర్ జిల్లాలోని వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వివేకానందరెడ్డి, కో-కన్వీనర్లు సునీత, నిశాంత్, వరకుమార్‌లకు పోలీసులు 41-ఏ నోటీసులు ఇచ్చారు. వర్రా రవీందర్‌రెడ్డి కేసులో విచారణకు శనివారం పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారు. దీంతో వారి ఇళ్లకు నోటీసులు అంటించిన పోలీసులు.. వారికోసం గాలింపు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు కీలక నేతలపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్‌రెడ్డి, సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్‌రెడ్డిలపై ఐటీ యాక్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

## జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా తయారైందని వ్యాఖ్య.. రిప్లై ఇచ్చిన మంత్రి అచ్చెన్న



**విశ్వంభర, అమరావతి:** జీరో అవర్‌పై ఏపీ శాసనసభలో వాదోపవాదాలు జరిగాయి. జీరో అవర్ డ్రైవర్ లేని కారులా తయారైందని టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సమస్యలను మంత్రులెవరు రాసుకుంటున్నారో తెలియడం లేదని ఆరోపించారు. దీంతో సమస్యలను తాను రాసుకుంటున్నానని మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిచ్చారు. పరిష్కరించిన తర్వాత సభ్యులకు సమాచారమిస్తామని చెప్పారు. మరోవైపు కూన రవి కుమార్ ఆఖరి వరుసలో కూర్చోవడం వల్ల ముందు జరిగేది తెలియడం లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చమక్కులు విసిరారు.

## వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిపై సెర్చ్ వారెంట్



విశ్వంభర, పులివెందుల: వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిపై పోలీసులు సెర్చ్ వారెంట్ జారీ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ జిల్లా లింగాల మండలం అంబకపల్లిలోని రాఘవరెడ్డి ఇంటికి పులివెందుల పోలీసులు నోటీసు అంటించారు. ఏ క్షణంలోనైనా ఇంట్లో సోదాలు చేయడానికి అనుమతి తీసుకున్నామని వారు తెలిపారు. వారం రోజుల నుంచి రాఘవరెడ్డి పరారీలో ఉన్నాడు. మరోవైపు వైకాపా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వివేకానంద రెడ్డికి పోలీసుల 41-ఎ నోటీసులు జారీ చేశారు.వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఇచ్చిన కంటెంట్‌నే తాను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశానని వర్రా రవీందర్‌రెడ్డి ఇటీవల పోలీసులకు తెలిపారు. ఈ మేరకు రాఘవరెడ్డి కోసం అతడి స్వగ్రామం అంబకపల్లెలో నిఘాపెట్టి, పులివెందుల, లింగాల మండలాల్లో గాలిస్తున్నారు.

## పెన్ను కోసం గొడవ.. భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

**విశ్వంభర, నరసరావుపేట:** పల్నాడు జిల్లా నరసరావుపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. పెన్ను విషయంలో స్నేహితురాలితో ఏర్పడిన స్వల్ప వివాదం నేపథ్యంలో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన జెట్టి అనూష నరసరావుపేటలోని ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం ఉదయం హాస్టల్‌లో ఉన్న సమయంలో స్నేహితురాలితో పెన్ను విషయంలో స్వల్ప వివాదం జరిగింది.దీంతో మనస్తాపానికి గురైన అనూష హాస్టల్ భవనంలోని నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకేసింది. హాస్టల్ సిబ్బందిహుటాహుటిన ఆసుపత్రికి తరలించగా..అప్పటికే మృతిచెందినట్టువైద్యులు ధ్రువీకరించారు. కళాశాల యాజమాన్యం ద్వారా విషయం తెలుసుకున్న నరసరావుపేట ఆర్డీవో హేమలత, తహసీల్దార్ వేణుగోపాల్, నరసరావుపేట గ్రామీణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.




## మేం నలుగురం అయ్యాం

### శుభవార్తను పంచుకున్న రోహిత్ శర్మ

**ఢిల్లీ :** టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తండ్రయ్యాడు. అతడి సతీమణి రితికా సజ్దే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ శుభవార్తను స్వయంగా అభిమానులతో పంచుకున్నాడు హిట్ మ్యాన్. మేం నలుగురమయ్యాం అంటూ సామాజిక మాధ్యమాల్లో ఫ్యామిలీ అని రాసి ఉన్న ఒక ఫొటోను పంచుకున్నాడు. ఈ నెల 15న తమకు రెండో బిడ్డ జన్మించినట్లు పేర్కొన్నాడు.రోహిత్ శర్మ రితికా దంపతులకు ఇప్పటికే సమైరా అనే కుమార్తె ఉంది. రితికాను రోహిత్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. 2015 డిసెంబర్ 13న వీరి వివాహం జరిగింది. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సమయంలోనే ఆ జంటకు మొదటి బిడ్డ జన్మించింది. 2018 డిసెంబరు 30న వీరి జీవితంలోకి సమైరా వచ్చింది.ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఇప్పటికే అక్కడికి చేరుకుంది. కానీ, రోహిత్ శర్మ మాత్రం భారత్‌లోనే ఉండిపోయాడు. తన భార్య రెండో కాన్పు నేపథ్యంలోనే అతడు ఆస్ట్రేలియాకు వెళ్లలేదు. పెర్త్‌లో జరిగే తొలి టెస్టులో అతడు ఆడతాడో లేదో చూడాలి. ఒకవేళ రోహిత్ అందుబాటులో లేకపోతే.. బుమ్రా కెప్టెన్సీలో టీమ్ఇండియా తొలి టెస్టు ఆడే అవకాశాలు ఉన్నాయి.

## శుభ్‌మన్ గిల్‌కు గాయం..!

### తొలి టెస్టుకు అనుమానమే..?



**ముంబయి :** బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో హ్యాటిక్ విజయమే లక్ష్యంగా టీమ్ఇండియా ఆస్ట్రేలియాలో అడుగుపెట్టింది. అందుకు తగ్గట్టే ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్ ప్రారంభించింది. అయితే.. ఇక్కడ టీమ్ఇండియాకు ఒక బ్యాడ్ న్యూస్..! ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ గాయపడినట్లు సమాచారం. దీంతో అతడు మొదటి టెస్టుకు అందుబాటులో ఉండేది అనుమానమేనని తెలుస్తోంది.ఆస్ట్రేలియాలో ఇండియా vs ఇండియా ఏ మధ్య ప్రాక్టీస్ మ్యాచ్ కొనసాగుతోంది. టీమ్ఇండియాలోని టాప్ బౌలర్లను టాప్ బ్యాటర్లు ఎదుర్కొంటున్నారు. ప్రేక్షకులకు అనుమతి లేకుండా జరుగుతున్న ఈ మ్యాచ్ నుంచి కీలక సమాచారం బయటకు వచ్చింది. అదేంటంటే.. రెండో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తున్న శుభ్‌మన్ గిల్ వేలికి గాయమైనట్లు సమాచారం. స్లిప్స్‌లో క్యాచ్ పడుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. గాయం తీవ్రతను మెడికల్ టీమ్ పరిశీలిస్తోందని సమాచారం. దీంతో అతడు ఆస్ట్రేలియాతో పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్టుకు ఆడేదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి నన్నెవరూ సంప్రదించలేదు: శార్దూల్ ఠాకూర్



**ముంబయి :** ఆస్ట్రేలియా గడ్డపై పేస్ ఆల్‌రౌండర్లకు భలే గిరాకీ. కానీ, భారత జట్టులో సీనియర్ పేస్ ఆల్‌రౌండర్లుగా ఉన్న హార్దిక్ పాండ్య, శార్దూల్ ఠాకూర్‌కు అవకాశం దక్కలేదు. పాండ్య స్వతహాగా టెస్టులకు దూరంగా ఉంటుండగా.. శార్దూల్ మాత్రం సర్జరీతో ఫిట్‌నెస్ సాధించలేకపోయాడు. దీంతో తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డికి ఛాన్స్ దక్కింది. ఇప్పటికే ఆసీస్‌కు వెళ్లిపోయిన అతడు ఇంట్రాస్క్వాడ్ వార్మప్ మ్యాచ్‌లో నాణ్యమైన బౌలింగ్ వేస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. శార్దూల్‌ను కాదని నితీశ్ ఎంపికపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కీలక వ్యాఖ్యలు చేశాడు. కానీ, తననెవరూ సంప్రదించలేదంటూ తాజాగా శార్దూల్ ఠాకూర్ వ్యాఖ్యానించడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది.

''నేను శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత విశ్రాంతి తీసుకొని మళ్లీ మైదానంలోకి దిగాను. జాతీయ సెలక్టర్ల నుంచి నాకెలాంటి సమాచారం రాలేదు. నాకు సర్జరీ కావడం వల్లే వారు మరొక ఆప్షన్‌కు వెళ్లినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నా ఫిట్‌నెస్ చాలా బాగుంది. ఆస్ట్రేలియా పర్యటన సుదీర్ఘంగా జరుగుతుంది. తప్పకుండా ఏదోఒక దశలో నాకు అవకాశం వస్తుందని భావిస్తున్నా. ఆ సిరీస్ కాకపోయినా.. ముమ్మందు చాలా మ్యాచ్‌లు జరుగుతాయి. ఇంగ్లండ్ జట్టు మన దేశానికి రానుంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ముందుంది. నా ఫిట్‌నెస్‌తో పాటు ఆటపై దృష్టిపెట్టా. ఎప్పుడు ఛాన్స్ వచ్చినా వందశాతం నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. జట్టులోకి పునరాగమనం చేసినప్పుడు తొలి రెండు మ్యాచుల్లో కుదురుకొనేందుకు ఇబ్బందిపడాల్సి ఉంటుంది. ఒక్కసారి బౌలింగ్‌లో లయను అందుకొంటే ఆ తర్వాత వెనక్కితిరిగి చూడాల్సిన అవసరం లేదు'' అని శార్దూల్ వెల్లడించాడు. 2020/21 సిరీస్‌లో ఒక్క మ్యాచ్ ఆడిన శార్దూల్ ఏడు వికెట్లు పడగొట్టాడు.

## కోహ్లీని అడ్డుకొనేందుకు ఆసీస్ ప్లాన్ అదే: మంజ్రేకర్



**ముంబయి :** ''భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని అడ్డుకొనేందుకు ఆసీస్ పేసర్లు తమ అస్త్రాలను సిద్ధం చేసుకుంటారనడంలో సందేహం లేదు. కోహ్లీని ఔట్ చేసేందుకు ఆఫ్‌సైడ్ బంతులను సంధించడం ఖాయం. అప్పుడు డ్రైవ్ చేసేందుకు ప్రయత్నిస్తే వికెట్ దొరకుతుందనేది వారి ఆశ. అయితే, కోహ్లీకి కూడా తన వికెట్ కాపాడుకోవడం ఎలాగో తెలుసు. గతంలో ఆసీస్‌పై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన అనుభవం అతడి సొంతం. ఈసారి పెద్దగా ఫామ్‌లో లేదు. ఒక్కసారి కుదురుకుంటే మాత్రం ఆపడం ఎవరితరమూ కాదు'' అని మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

# ఈసారి ఐపీఎల్ వేలంలో 13 ఏళ్ల ప్లేయర్




**పట్నా :** దాదాపు 35 ఏళ్ల కిందట సచిన్ 16 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడనే వార్తలు విన్నాం. క్రికెట్ దిగ్గజం దాదాపు 24 ఏళ్లపాటు ఆటను శాసించాడు. ఆ తర్వాత ఆ స్థాయిలో సంచలనం ఎక్కడా నమోదు కాలేదు. తాజాగా ఐపీఎల్ మెగా వేలంలో ఓ ఆటగాడిని ఫ్రాంచైజీ దక్కించుకుంటే మాత్రం క్రికెట్‌లో మరో వండర్ క్రియేట్ అయినట్లే. ఇంతకీ ఏంటనేగా మీ సందేహం.. అదేంటో తెలియాలంటే ఇది చదివేయండి..

సాధారణంగా 13 ఏళ్ల వయసు కలిగిన పిల్లలు స్నేహితులతో ఆడుకుంటూ సరదాగా గడిపేస్తూ ఉంటారు. కానీ, బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ మాత్రం క్రికెట్టే ఊపిరి అంటూ ఒక్కో మెట్టు పైకి ఎదుగుతూ వస్తున్నాడు. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలంలో తన పేరును నమోదు చేసుకున్నాడు. స్టార్లుగా ఉన్న ప్లేయర్లే తమను తీసుకుంటారో లేదోననే సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. మనకెందుకులే అనుకొని వేలానికి కూడా దూరంగా ఉండిపోయినవారూ లేకపోలేదు. చివరికి ఐపీఎల్ మేనేజ్‌మెంట్ వేలం షార్ట్‌లిస్ట్‌ను బయట పెట్టింది. అందులో వైభవ్ మాత్రం రూ.30 లక్షల బేస్ ప్రైస్‌తో తన పేరును ఎంట్రీ చేయించాడు. మరి అతడిని ఏ ఫ్రాంచైజీ తీసుకున్నా సంచలనమే కదా. దీంతో అతడు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చాడు? ఎలా ఆడతాడు? అనే ప్రశ్నలు క్రికెట్ అభిమానుల్లో రావడం సహజమే కదా.

రోజంతా సొంత మైదానంలోనే..

బిహార్‌లోని తాజ్‌పుర్ గ్రామానికి చెందిన వైభవ్ సూర్యవంశీ 2011లో జన్మించాడు. నాలుగేళ్ల వయసులోనే బ్యాట్‌ను పట్టిన అతడి ఆసక్తిని చూసిన తండ్రి సంజీవ్ సూర్యవంశీ ప్రత్యేకంగా మైదానాన్ని తయారు చేయించాడు. మరో నాలుగేళ్లకే సమస్తిపుర్‌లోని క్రికెట్ అకాడమీలో చేర్పించాడు. రెండేళ్లపాటు శిక్షణ పొందిన అతడు అండర్ 16 జట్టులోకి వచ్చేశాడు. అప్పటికి వైభవ్ వయసు కేవలం 10 ఏళ్లే కావడం గమనార్హం. ఎడమ చేతివాటం కలిగిన వైభవ్ బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ రాణించగలడు. 2024లోనే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన వైభవ్ ఐదు మ్యాచ్‌లు ఆడాడు. ఓపెనర్ అయిన వైభవ్ దూకుడుగా ఆడటంలో నేర్పరి. ఫీల్డింగ్ సెటప్‌ను ఆసరాగా చేసుకొని బౌండరీలు బాదేస్తాడు.

## సెంచరీల సంజూ.. ఆ ఒక్క బలహీనత దాటితే అదుర్స్..!




**ముంబయి :** అవకాశాల కోసం ఎదురు చూస్తాడు.. వచ్చినప్పుడు వాటిని సరిగ్గా సద్వినియోగం చేసుకోడు.. ఇది సంజూ శాంసన్ పై గతంలో ఉన్న అపవాదు. వాటన్నింటినీ తిప్పికొడుతూ దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ లో రెండు సెంచరీలతో చెలరేగాడు. అయితే.. ఈ సిరీస్‌లో మరో రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో.. కొడితే సెంచరీయే లేదంటే సున్నాకే ఔట్ అంటూ సంజూపై ఇప్పుడు కొత్త ప్రచారం మొదలైంది. టీ20ల్లో అతడు ఆడిన గత పది ఇన్నింగ్స్‌లను గమనిస్తే ఇదే అర్థమవుతోంది. దీంతో అతడు తనకున్న ఆ ఒక్క బలహీనతను అధిగమించి మరిన్ని సూపర్ ఇన్నింగ్స్‌లు ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు.

టీ20ల్లో గత పది ఇన్నింగ్స్‌ల్లో మూడు సెంచరీలు నమోదు చేశాడు సంజూ శాంసన్ . నాలుగు సార్లు డకౌట్ అయ్యాడు. మిగతా సందర్భాల్లో నామమాత్రపు స్కోరుకే పరిమితమయ్యాడు.

టీ20ల్లో ఒకే ఏడాది మూడు సెంచరీలు కొట్టిన క్రికెటర్‌గా సంజూ శాంసన్ రికార్డు నమోదు చేశాడు. బంగ్లాదేశ్‌పై ఒకటి, దక్షిణాఫ్రికాపై రెండు శతకాలు కొట్టాడు. దక్షిణాఫ్రికాపై తొలి టీ20లో శతకం(107)తో విరుచుకుపడ్డ అతడు.. అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా రెండు శతకాలు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఆ తర్వాత రెండు మ్యాచ్‌ల్లో సున్నాకే ఔటయ్యాడు. తనపై విమర్శలు వ్యక్తమైన వేళ.. చివరి టీ20లో మరోసారి సెంచరీతో చెలరేగాడు.

అంతకుముందు బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో హైదరాబాద్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో 47 బంతుల్లో 111 పరుగులతో వీరవిహారం చేశాడు.

బంగ్లాతో సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌ల్లో మాత్రం అతడు చేసిన పరుగులు 10, 29 మాత్రమే.

శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌ల్లో సున్నాకే ఔటయ్యాడు. అంతకుముందు జింబాబ్వేతో జరిగిన చివరి టీ20లో అర్ధ శతకం చేసి రాణించాడు. ఇప్పటి వరకూ 37 టీ20లు ఆడిన సంజూ మొత్తం 810 పరుగులు నమోదు చేశాడు. ఇందులో మూడు శతకాలు, రెండు అర్ధ శతకాలు ఉన్నాయి.

ఇక వన్డేల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. 16 వన్డేలు ఆడిన అతడు మొత్తం 510 పరుగులు నమోదు చేశాడు. అందులో ఒక శతకం, మూడు అర్ధ శతకాలు ఉన్నాయి. దక్షిణాఫ్రికాతో గత ఏడాది డిసెంబర్‌లో చివరి సారిగా ఆడిన వన్డేలో అతడు శతకం నమోదు చేశాడు.

# కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులు..

### నడ్డా, ఖర్గేలకు ఈసీ లేఖ




**ఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో ప్రచార వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్ష పార్టీల మధ్య పరస్పర ఆరోపణలు, విమర్శలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఇటీవల ఒకరిపై ఒకరు ఎన్నికల సంఘానికి ( ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఈసీ.. ఇరు పార్టీల అధ్యక్షులు జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గేలకు వేర్వేరుగా లేఖలు రాసింది.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ ఈసీకి ఇటీవల కమలదళం ఫిర్యాదు చేసింది. మరోవైపు.. కేంద్ర మంత్రి అమిత్ షా కూడా ఇదే తప్పిదానికి పాల్పడ్డారంటూ హస్తం పార్టీ సైతం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే తమ నేతలపై వచ్చిన ఫిర్యాదులపై ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట కల్లా అధికారిక వివరణ ఇవ్వాలని ఇరుపార్టీల అధ్యక్షులకు ఎన్నికల సంఘం ఆదేశించింది. సంబంధిత ఫిర్యాదులనూ రెండు పక్షాలకు చేరవేసింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా స్టార్ క్యాంపెయినర్లకు చేసిన సూచనలను ప్రస్తావించింది.జాతీయ పార్టీల స్టార్ క్యాంపెయినర్లు ఇతరులకు ఆదర్శంగా మెలగాలని, సమాజంలో సున్నితమైన కూర్పును పాడుచేయొద్దని లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈసీ సూచించింది. తమ మాటలు, ప్రస్తావనల్లో సంయమనం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా అగ్రనేతలపైనే ఉందని పేర్కొంది. ఇదే విషయాన్ని ఎన్నికల సంఘం తాజాగా మరోసారి గుర్తుచేసింది. ఇదిలా ఉండగా.. ఝార్ఖండ్‌లో ఇప్పటికే ఒకదశ ఎన్నికలు ముగిశాయి. ఈ నెల 20న ఝార్ఖండ్ రెండోదశతోపాటు మహారాష్ట్ర అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు.

## అర్ష్ దల్లా అరెస్టుపై భారత అధికారులతో చర్చిస్తున్నాం

### కెనడా విదేశాంగ మంత్రి



**కెనడా :** భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్థానీ వేర్పాటువాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష్ దల్లా ను కెనడా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడిని తమకు అప్పగించాలని ఇటీవల కెనడా ను భారత్ కోరింది. ఈ విషయంపై కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలానీ జోలీ స్పందిస్తూ అతడిని అప్పగించే విషయంపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

శుక్రవారం పెరూలోని లిమాలో జరిగిన ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార వార్షిక మంత్రివర్గ సమావేశంలో మెలానీ జోలీ మాట్లాడుతూ ప్రస్తుతం అర్ష్ దల్లా కేసులో విచారణ జరుగుతోందని..కాబట్టి ఆ విషయంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని అన్నారు. అతడికి సంబంధించి ఏవైనా విచారణలు చేయాల్సి ఉంటే భారత దౌత్యవేత్తలతో చర్చలు జరుపుతామని తెలిపారు.

అక్టోబరు 27, 28న మిల్టన్ పట్టణంలో కాల్పులు జరిపిన ఘటనలో సింగ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించినకెనడా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన దల్లాపై భారత్‌లో హత్య, వేధింపులు, అపహరణ సహా పలు కేసులు ఉన్నాయి. గతేడాది జనవరిలో భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పెద్ద మొత్తంలో డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్‌లో ఇతడి పాత్ర ఉందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ కూడా తెలిపింది. దల్లాకు సంబంధించిన పలుకేసులను జాతీయ విచారణ సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఖలీస్థానీ ఉగ్రవాది, గుర్తు తెలియని వారి కాల్పుల్లో హతమైన నిజ్జర్‌కు దల్లా సన్నిహితుడు.

## ఢిల్లీలో కాలుష్యానికి బీజేపీ పాలిత రాష్ట్రాలే కారణం..


### ఆప్ మంత్రి గోపాల్ రాయ్



**ఢిల్లీ :** బీజేపీ పాలిత రాష్ట్రాలే దేశ రాజధానిలో కాలుష్యానికి కారణమని ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ ఆరోపించారు. బీఎస్ 4 డీజిల్ బస్సులపై నిషేధం ఉన్నప్పటికీ హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు వాటిని ఢిల్లీకి పంపుతున్నాయని, తద్వారా కాలుష్య సమస్య తీవ్రం అవుతోందని మండిపడ్డారు. ఈ బస్సులు జీఆర్‌ఏపీ III మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయని తెలిపారు. మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు గాను ఢిల్లీ ప్రభుత్వ రవాణా విభాగానికి చెందిన అధికారులు బస్సులకు చలాన్లు సైతం జారీచేశారన్నారు. శనివారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఆప్ ప్రభుత్వం కాలుష్యాన్ని అరికట్టేందుకు ముమ్మరంగా చర్యలు తీసుకుంటుంటే పొరుగున ఉన్న బీజేపీ పాలిత రాష్ట్రాలు మాత్రం ఆ ప్రయత్నాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. సమస్యను మరింత తీవ్ర తరం చేయడానికే బీజేపీ ఉద్దేశ పూర్వకంగా రూల్స్ ఉల్లంఘించి బ్యాన్ చేసిన డీజిల్ బస్సు రాజధానికి పంపిస్తోందని నొక్కి చెప్పారు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) నివేదిక ప్రకారం.. ఢిల్లీ వాయు కాలుష్యంలో 70 శాతం కారకాలు బయటనుంచే వస్తున్నాయని, పొరుగు రాష్ట్రాలు ఈ సమస్యను పెంచడానికి ఎంతో దోహద పడుతున్నారని తెలిపారు. కాగా, ఢిల్లీలో కాలుష్య సమస్య ఎక్కువైన విషయం తెలిసిందే. పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 450కిపైగా నమోదవుతోంది.

## సంజూ శాంసన్ భారీ సిక్సర్.. మహిళా అభిమాని ముఖానికి తగిలిన బంతి

**జొహన్నస్‌బర్గ్:** సౌతాఫ్రికాతో జరిగిన నాలుగవ టీ20 మ్యాచ్‌లో.. సంజూ శాంసన్ తన పవర్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. భారీ షాట్లు కొడుతూ అలరించాడు. ఈ సిరీస్‌లోనే అతను రెండోసారి సెంచరీ చేశాడు. కేవలం 56 బంతుల్లో 109 రన్స్ చేశాడు. దాంట్లో తొమ్మిది సిక్సర్లు, ఆరు ఫోర్లు కూడా ఉన్నాయి. అయితే శాంసన్ కొట్టిన ఓ భారీ సిక్సర్.. నేరుగా వెళ్లి ఓ మహిళా అభిమాని ముఖానికి తగిలింది. ఇన్నింగ్స్ 10వ ఓవర్‌ను ట్రిస్టన్ స్టబ్స్ వేశాడు. ఆ ఓవర్‌లో కొట్టిన షాట్.. డీప్ మిడ్ వికెట్ మీదుగా వెళ్తూ..ఓ మహిళ ముఖానికి తాకింది. దీంతో ఆ అభిమాని ఆ నొప్పి తట్టుకోలేక ఏడ్చేసింది. గాయపడ్డ ఆమెకు ఐస్ తెచ్చి చెంపపై పెట్టారు. స్టాండ్స్‌లో ప్రేక్షకురాలు గాయపడినట్లు తెలియగానే.. అతను క్షమాపణలు కోరాడు. ఆ ఘటనకు చెందిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నది.



## మైక్రోసాఫ్ట్‌ను టార్గెట్ చేసిన మస్క్..

### ఓపెన్ ఏఐ దావాలోకి టెక్ దిగ్గజం పేరు

**ముంబయి :** చాట్‌జీపీటీని మాతృసంస్థ ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌పై దావా వేసిన టెస్లా అధినేత ఎలాన్‌మస్క్.. తాజాగా అందులోకి మైక్రోసాఫ్ట్‌ను లాగారు. గతంలో దావా వేసి ఉపసంహరించుకున్న ఆయన.. తాజాగా మైక్రోసాఫ్ట్ పేరు కూడా జోడించి మరోసారి దావా వేసినట్లు తెలుస్తోంది. ఈమేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఏఐ మార్కెట్లో గుత్తాధిపత్యం సాధించేందుకు మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ.. రెండు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయంటూ తాజాగా ఆరోపించారు. మైక్రోసాఫ్ట్‌తో పాటు లింక్డిన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్‌మన్, ఓపెన్ ఏఐ మాజీ బోర్డ్ మెంబర్, మైక్రోసాఫ్ట్ పీవీడీ టెంపుల్టన్ పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2022 నవంబరులో వచ్చిన ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌జీపీటీ ఆరు నెలల్లోనే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ సంపాదించుకున్న సంగతి తెలిసిందే. అయితే, 2015లో ఓపెన్ ఏఐను శామ్ ఆల్టమన్ బృందం స్థాపించినప్పుడు మస్క్ అందులో పెట్టుబడులు పెట్టారు. 2018లో కంపెనీని వీడారు. ఆ తర్వాత 2019లో మైక్రోసాఫ్ట్ ఓపెన్ ఏఐలో 14 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. ఈ ఏడాది మార్చిలో తొలిసారి శామ్ ఆల్ట్‌మన్‌పై మస్క్ దావా వేశారు. కంపెనీ స్థాపించినప్పుడు రాసుకున్న ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నారంటూ అందులో ఆరోపించారు. జూన్‌లో ఆ దావాను ఉపసంహరించుకున్నారు.అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. తాజాగా మరోసారి ఆ దావాను పునరుద్ధరించారు. మైక్రోసాఫ్ట్ పేరును కూడా అందులో చేర్చారు. ఈ రెండు కంపెనీలు పరస్పర ఒప్పందాలతో ఏఐ రంగంలో పోటీ లేకుండా చేయాలని చూస్తున్నాయంటూ ఆరోపించారు. దీంతో ఇతర కంపెనీలకు నిధులు కూడా రావడం లేదని పేర్కొన్నారు. తన సొంత ఏఐ సంస్థ ఎక్స్‌ఏఐకి కూడా నిధులు లభించడం కష్టంగా మారిందని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఏడాది అక్టోబర్‌లో ఓపెన్ ఏఐ 6.6 బిలియన్ డాలర్లు నిధులు అందుకోగా... మస్క్ తన ఎక్స్‌ఏఐకు ఈ ఏడాది మార్చిలో 6 బిలియన్ డాలర్ల సొంత నిధులను సమకూర్చారు.

### సినిమా టికెట్లు, డైనింగ్ కోసం ప్రత్యేకంగా

## జొమాటో కొత్త యాప్..

**ముంబయి :** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో కొత్త తరహా సేవలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే క్విక్ కామర్స్ విభాగంలో రాణిస్తున్న సంస్థ తాజా మరిన్ని రంగాల్లో అడుగు పెట్టేందుకు సిద్ధమైంది. దీని కోసం డిస్ట్రిక్ట్ పేరిట కొత్త యాప్‌ను లాంచ్ చేసింది. దీని సాయంతో టికెట్ బుకింగ్, డైనింగ్‌తో పాటు అనేక రకాల సేవల్ని యూజర్లకు అందించనుంది. జొమాటో తీసుకొచ్చిన తాజా యాప్‌లో సినిమా టికెట్లు బుకింగ్, ఈవెంట్ల కోసం టికెట్లు బుక్ చేసుకోవచ్చు. స్పోర్ట్స్ టికెటింగ్, లైవ్ షోలు, షాపింగ్, డైనింగ్ సేవలనూ ఈ యాప్‌లో జోడించింది. ఈ ఏడాది ఆగస్టులోనే పేటీఎం నుంచి టికెటింగ్ బిజినెస్‌ను రూ.2,048 కోట్లకు జొమాటో కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొత్త సేవలను ప్రారంభించింది.

## మరో బడ్జెట్ ఫోన్ రెడ్‌మీ ఏ4 5జీ..

### 20న మార్కెట్లో ఆవిష్కరణ..!

**ముంబయి :** ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ షియోమీ అనుబంధ రెడ్‌మీ తన రెడ్‌మీ ఏ4 5జీ ఫోన్‌ను ఈ నెల 20న ఆవిష్కరించనున్నది. క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 4ఎస్ జెన్ 2 మొబైల్ ఎస్వోసీ ప్రాసెసర్ తో వస్తున్న ఈ ఫోన్ ధర రూ.10 వేల లోపు ఉండనున్నది. గత నెలలో జరిగిన ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) ఈవెంట్‌లో రెడ్‌మీ తన రెడ్‌మీ ఏ4 5జీ ఫోన్‌ను ఆవిష్కరించింది.తన రెడ్‌మీ ఏ4 5జీ ఫోన్ క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 4ఎస్ జెన్ 2 మొబైల్ ప్రాసెసర్ తో పని చేస్తుంది. ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతోపాటు 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. 50మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ ఉంటుంది. 120 హెర్ట్జ్ రీఫ్రెష్‌రేటు మద్దతుతో 6.88 అంగుళాల డిస్ ప్లే ఉంటుంది. ఇక సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 8మెగా పిక్సెల్ కెమెరా ఉంటది. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 14 ఓఎస్ బేస్డ్ హైపర్ ఓఎస్ స్కిన్ వర్షన్ మీద పని చేస్తుంది. సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్, యూఎస్బీ టైప్ సీ చార్జింగ్ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. శాండ్ విచ్ డిజైన్, డ్యుయల్ టోన్ గ్లాస్ ఫినిష్‌తో వస్తోంది.భారత్ మార్కెట్లో రెడ్ మీ ఏ4 5జీ ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.10 వేల లోపు ధరకే లభిస్తుందని షియోమీ ధృవీకరించింది. బ్యాంకు, లాంచింగ్ ఆఫర్లతో కలిసి ఫోన్ రూ.8,499లకే లభిస్తుందని తెలుస్తోంది.



# ఇదొక క్రాష్ కోర్సులా ఉంది



హుషారెత్తించే తన డ్యాన్స్‌తో యువ మనసులు గెలుచుకున్నారు నటి శ్రీలీల . ప్రస్తుతం ఆమె 'పుష్ప ది రూల్' లో భాగమైన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో ఆమె 'కిస్సిక్' అనే ఐటమ్ సాంగ్‌లో భాగమయ్యారు. ఇటీవల షూట్‌లో కూడా పాల్గొన్నారు. అల్లు అర్జున్‌తో వర్క్ చేయడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈమేరకు ఆయనకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ పంపించారు. "టు బన్నీ సర్.. ప్రేమ, గౌరవంతో ఈ నోట్ మీకు పంపిస్తున్నాను. మీతో వర్క్ చేయడం నాకెంతో అందమైన అనుభూతిని పంచింది. నాకు ఎప్పటికీ గుర్తుండిపోయే అనుభూతిని అందించినందుకు ధన్యవాదాలు. నిజం చెబుతున్నా ఈ ఐదారు రోజులు నాకు ఒక క్రాష్ కోర్సులా ఉంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే. మీకు, మీ కుటుంబానికి నా ప్రేమాభినందనలు" అని ఆమె రాసుకొచ్చారు. తగ్గేదేలే, శ్రీవల్లి, సామి, వైల్డ్ ఫైర్ వంటి హ్యాష్‌ట్యాగ్స్ జత చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను అల్లు అర్జున్ ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. "థ్యాంక్యూ మై డియర్. మీ మాటలు నా మనసుని తాకాయి.. నువ్వు మరెన్నో విజయాలు అందుకోవాలి" అని తెలిపారు. అంతేకాకుండా శ్రీలీలను డ్యాన్సింగ్ క్వీన్ అని పేర్కొన్నారు. పుష్ప ది రైజ్'కు కొనసాగింపుగా 'పుష్ప ది రూల్' రానుంది. సుకుమార్ దర్శకుడు. అల్లు అర్జున్ సరసన శ్రీవల్లిగా రష్మిక మరోసారి సందడి చేయనున్నారు. పార్ట్ 1లో కనిపించిన కీలక పాత్రధారులు పార్ట్ 2లోనూ భాగమయ్యారు. ఎర్రచందనం స్మగ్లింగ్ సిండికేట్‌కు నాయకుడిగా మారిన తర్వాత పుష్పరాజ్ ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నాడు? చుట్టుపక్కల గ్రామాల వారికి ఏవిధంగా సాయం చేశాడు? అనే విషయాలను 'పుష్ప ది రూల్'లో చూడొచ్చు. షూటింగ్ దాదాపు పూర్తైంది.



# 29న చేతిలో చెయ్యేసి చెప్పు బావ

దేవదాస్, జాన్ సమర్పణలో కొమరపు ప్రొడక్షన్స్ పతాకంపై ఆదిత్య ఓం, అరుణ్ రాహుల్, అంజన శ్రీనివాస్ రోహిణి ఆర్ చలపతి రాజు తదితరులు నటించిన చిత్రం చేతిలో చెయ్యేసి చెప్పు బావా . అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 29 ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ రీసెంట్ గా హైదరాబాద్ లో ప్రి రిలీజ్ ఈవెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సహనిర్మాత రేగట్టే లింగారెడ్డి , చిత్ర యూనిట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కే.జోసఫ్ మాట్లాడుతూ"ఇది ఒక వెరైటీ లవ్ స్టోరీ. అన్ని కమర్షియల్ హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాము. బండారు దానయ్య కవి అద్భుతమైన పాటలు ఈ చిత్రానికి అదనపు ఆకర్షణ. ఒక మంచి సందేశం తో ప్రేక్షకులు అందరూ చూసే విధంగా ఈ చిత్రాన్ని తీయడం జరిగింది. ఈ చిత్రాన్ని నవంబర్ 29 ప్రేక్షకులకు ముందుకు తీసుకురానున్నాం. ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాము" అని అన్నారు. సుమన్, కవిత ,పోసాని కృష్ణ మురళి, జయప్రకాష్ రెడ్డి ,,ఆనంద్, జయ వాణి, చిత్రం శీను, సుమన్ శెట్టి, జబర్దస్త్ అప్పారావు, తదితరులు నటించిన ఈ చిత్రానికి :ఎడిటర్ వెంకటేశ్వరరావు, డిఓపి: వేణు మురళీధర్ ,సంగీతం: పార్థు, స్టోరీ అండ్ ప్రొడ్యూసర్ : కె.జోసఫ్ ,స్క్రీన్ ప్లే, కొరియోగ్రఫీ, డైరెక్షన్ :కట్ల రాజేంద్రప్రసాద్.

# జనవరి 3న వస్తున్న హీరో కృష్ణ చివరి చిత్రం

తెలుగు చలనచిత్ర చరిత్రలో చెరగని ముద్ర వేసి, సౌజన్యానికి, సాహసానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచిన సూపర్ స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం "ప్రేమ చరిత్ర కృష్ణ విజయం". అంబుజా మూవీస్ రామ్ ఫిల్మ్స్ బ్యానర్స్ పై హెచ్.మధుసూదన్ దర్శకనిర్మాతగా రూపొందిన ఈ చిత్రంలో యశ్వంత్ సుహాసిని జంటగా నటించగా... నాగబాబు, ఆలీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. నవంబర్ 16, సూపర్ స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించి, విడుదల తేదీ ప్రకటించేందుకు పత్రికా సమావేశం నిర్వహించారు!! ఈ సమావేశంలో నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్, ప్రముఖ దర్శకనిర్మాత సునీల్ కుమార్ రెడ్డి, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, "హతవిధి" చిత్రంతో హీరోయిన్ కమ్ ప్రొడ్యూసర్ గా పరిచయమవుతున్న డైనమిక్ లేడి లవ్లీ మధుమిత, కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాదర్ గోరి, పద్మాలయ శర్మ,



సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ, దర్శకనిర్మాత హెచ్. మధుసూదన్, సహ నిర్మాత బండ్రి నాగరాజ్ గుప్తా పాల్గొన్నారు. సూపర్ స్టార్ కు ఘన నివాళి అర్పించిన అనంతరం... సినిమాను జనవరి 3న సంక్రాంతి కానుకగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు!! "ప్రేమచరిత్ర కృష్ణ విజయం" కృష్ణ నటించిన చివరి చిత్రంగా చరిత్రలో నిలిచిపోతుందని, కృష్ణను అభిమానించే ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూడాలని అతిధులు ఆకాంక్షించారు. సూపర్ స్టార్ కృష్ణకు సంక్రాంతితో గల అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. దర్శకనిర్మాత మధుసూదన్ ను అభినందించారు.

దర్శకనిర్మాత మధుసూదన్ మాట్లాడుతూ... "సూపర్ స్టార్ కృష్ణతో సినిమా రూపొందించడం తన అదృష్టంగా భావించానని, ఆయన నటించిన ఆఖరు చిత్రం విడుదల కాని చిత్రాల జాబితాలో ఉండకూడదనే పట్టుదలతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నామని తెలిపారు. ఆధునిక సాంకేతిక హంగులన్నీ అద్దుకున్న ఈ చిత్రం కృష్ణ అభిమానులతోపాటు అందరినీ అమితంగా అలరిస్తుందని మధుసూదన్ పేర్కొన్నారు.

# దేవకి నందన వాసుదేవను ఎంజాయ్ చేస్తారు



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా తన సెకండ్ మూవీ 'దేవకి నందన వాసుదేవ'తో అలరించడానికి సిద్ధంగా వున్నారు. ఈ చిత్రానికి గుణ 369తో హిట్ కొట్టిన అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ వర్మ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్, సాంగ్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. నవంబర్ 22 ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అర్జున్ జంధ్యాల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**'గుణ 369' తర్వాత మీ రెండో సినిమాకి ఇంత గ్యాప్ రావడానికి కారణం?**

గ్యాప్ ఏమీ లేదండి. కరోనా కారణంగా సహజంగానే అందరికీ ఓ రెండేళ్ళు గ్యాప్ వచ్చింది. తర్వాత ఈ ప్రాజెక్ట్ తో దాదాపు ఏడాదిన్నరగా ట్రావెల్ అవుతున్నాను. ఇలా చూసుకుంటే గ్యాప్ లేనట్లే.

**'దేవకి నందన వాసుదేవ' ట్రైలర్ లో కంసుడు, కృష్ణుడు రిఫరెన్స్ కనిపించింది ? ఆ కథ స్ఫూర్తి ఉందా ?**

ఆ రిఫరెన్స్ ఇందులో ఉంటుంది. మూడో సంతానం వలన మరణం అని ట్రైలర్ లోనే చాలా క్లియర్ గా చెప్పాము. అయితే చెప్పని విశేషాలు చాలా ఉన్నాయి. ట్రైలర్లో కంటే చాలా ఎక్కువ కథ సినిమాలో ఉంది.

**ఈమధ్య డివోషనల్ కంటెంట్ ఉన్న సినిమాలు విజయం సాధిస్తున్నాయి కదా.. ఆ తరహాలో ఈ కథ చేశారా?**

అలా ఏం లేదండి. హనుమాన్ సినిమా రాకముందే ఈ కథని లాక్ చేసుకున్నాం. నేను, నిర్మాత కలిసి ఒక సినిమా చేయాలనుకున్నాము. అలాగే నిర్మాత కు, ప్రశాంత్ కు ఒక కమిట్మెంట్ ఉంది. అశోక్ గల్లాకు అంతకుముందు ఒక కథ చెప్పాను. అ వర్క్ జరుగుతున్నా సమయంలో ప్రశాంత్ ఈ కథ చెప్పారు. ఇది అశోక్ కు నచ్చింది. మా అందరి మధ్య చాలా మంచి బాండింగ్ ఉంది. ప్రశాంత్ కునేను తీసిన గుణ సినిమా ఇష్టం. ఈ కథకు నేనైతే ఓకే అని ఆయన భావించారు. అలా ఈ ప్రాజెక్టుని చేశాను.

**ప్రశాంత్ చెప్పిన కథకి మీరు ఎలాంటి మార్పులు చేసుకున్నారు?**

దర్శకుడిగా కథని ఓన్ చేసుకోవాలి. అలా చేసుకున్నప్పుడు కొన్ని ఐడియాస్ వస్తాయి. కథని ఇంకా అద్భుతంగా చెప్పాలనిపిస్తుంది. నేను చెప్పిన కొన్ని ఆలోచనలకి ప్రశాంత్ గారు హ్యాపీగా ఫీల య్యారు. ఆయన సినిమా చూసి చాలా సర్ ప్రైజ్ ఫీల్ అయ్యారు.

**అశోక్ ఈ సినిమాలో చాలా కొత్తగా కనిపిస్తున్నారు. లుక్ విషయంలో ఎలాంటి కేర్ తీసుకున్నారు ?**

ఈ కథకు, ఆయన క్యారెక్టర్ కి ఎలాంటి లుక్ అయితే బాగుంటుందని దానిపై చాలా వర్క్ చేసాం. ప్రతిదీ ఆ క్యారెక్టర్ నుంచి డిజైన్ చేసుకున్నాం.

అశోక్ ఈ సినిమాని చాలా అద్భుతంగా చేశారు. తన పాత్ర కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు.

**ట్రైలర్ చూసిన తర్వాత చాలామంది మురారితో కరెక్ట్ అవుతున్నారు?**

మురారిలో ఒక డెస్టినీ ఫీల్ వుంటుంది. ఇందులో అది ఇంకోరకంగా ఉంటుంది. హీరోకి ఒక గండం ఉంది. ఆ గండం నుంచి ఎలా బయటపడతారనేది ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. అందుకే ట్రైలర్ లో కూడా ఎక్కడా లేనివిధంగా భూమిలో సుదర్శన చక్రంతో వాసుదేవుని విగ్రహం అని చెప్పాం. దానికి ఒక కనెక్షన్ ఉంది. అది చూస్తున్నప్పుడు ఆడియన్స్ ఒక సెపరేట్ ట్రాన్స్ లోకి వెళ్ళిపోతారు. అది కచ్చితంగా చెప్పగలను.

**మహేష్ బాబు కు సినిమా చూపించబోతున్నారా?**

మహేష్ బాబు కు ట్రైలర్ చాలా నచ్చింది. ఆయన టీమ్ అందర్నీ అప్రిషియేట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే సినిమాను కూడా చూడబోతున్నారు. ఇప్పటివరకు సినిమా చూసిన వాళ్లంతా కూడా చాలా అద్భుతంగా ఉందని అప్రిషియేట్ చేశారు.

**హీరోయిన్ మానస వారణాసి గురించి?**

మానస మిస్ ఇండియా 2020. తన పాత్రకు చాలా మంచి ప్రాధాన్యత ఉంటుంది ఈ క్యారెక్టర్ కి పర్ఫెక్ట్ యాప్ట్. చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్.

**కంసరాజ్ పాత్రలో చేసిన దేవదత్త గురించి?**

దేవదత్త కంసరాజ్ పాత్రని చాలా అద్భుతంగా చేశారు. ఈ సినిమాతో ఆయనకి చాలా మంచి పేరు వస్తుంది

**ఈ సినిమాకి విజయనగరం బ్యాక్ డ్రాప్ తీసుకోవడానికి కారణం?**

ఈ కథకి అలాంటి టెంపుల్, ఆ లొకేషన్ అయితే యాప్ట్ గా ఉంటుందని అనిపించింది. ఆడియన్స్ కి చాలా కొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది.

**సాయి మాధవ్ బుర్ర గారి డైలాగ్స్ గురించి?**

సాయి మాధవ్ చాలా అద్భుతమైన డైలాగ్స్ రాశారు. ఎమోషనల్ డెప్త్ పట్టుకుని కథకి తగ్గట్టుగా మాటలందించారు. భీమ్స్ ఈ సినిమాకి తన బ్యాగ్రౌండ్ స్కోర్ తో ప్రాణప్రతిష్ట చేశాడు. మ్యూజికల్ గా సినిమా వండర్ఫుల్ గా ఉంటుంది.

# రోటి కపడా రొమాన్స్

## చిత్రం విజయం సాధించాలి

హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, ప్రేమ ఇష్క్ కాదల్, పాగల్' వంటి యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నవంబరు 22న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుకను శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో చిత్రంలోని నటీనటులు, చిత్ర నిర్మాతలు, దర్శకుడుతో పాటు దర్శకులు యదు వంశీ, పవన్ సాధినేని, హర్ష, రచయిత కోనవెంకట్, నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, చదల వాడ శ్రీనివాసరావు, తుమ్మల పల్లి రామసత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమాన్ చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన సూపర్‌హీరో తేజా సజ్జా విచ్చేశారు. ఈ సందర్భంగా తేజా సజ్జా మాట్లాడుతూ '' ఈ వేదిక మీద వున్న నూతన టాలెంట్‌కు ఈ సినిమా ఎన్నో ఏళ్ల కల. ఈ చిత్రంతో నిర్మాత బెక్కెం వేణుగోపాల్ ఎంతో మంది నూతన నటీనటులను పరిచయం చేస్తున్నాడు. ఆయన్ని చూస్తే ఎంతో ఇన్‌స్పయిరింగ్‌గా వుంటుంది. ఆయన ఇప్పటి వరకు తీసిన 14 సినిమాల్లో ఎంతో మంది దర్శకులను, రచయితలను, నటీనటులను సినీ పరిశ్రమకు పరిచయం చేశాడు. నేను కూడా కెరీర్ ప్రారంభంలో గోపీ ఆఫీసుకు వెళ్లేవాడిని. కానీ ఆయనతో సినిమా కుదరలేదు. ఇక రోటి కపడా రొమాన్స్‌తో ఈ నవంబరు 22న చాలా మంది నూతన నటీనటులు పుట్టబోతున్నారు. తప్పకుండా ఈ చిత్రం విజయం సాధించి, అందరికి మంచి బ్రేక్ నివ్వాలి. తప్పకుండా అందరూ థియేటర్‌లో ఈ సినిమా చూసి విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ '' చాలా కష్టపడి దర్శకుడిగా నా పేరు చూసుకుంటున్నాను. ఈ సినిమాను కూడా ఎంతో కష్టపడి చేశాను. నేటి యూత్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ఈసినిమా ఉంటుంది. ఈ సినిమా అందరిని నవ్విస్తుంది..ఏడిపిస్తుంది.. బాధపెడుతుంది.. ఆలోచింపజేస్తుంది. కుటుంబంతో చూడదగ్గ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఈ సినిమా ఓటీటీ రైట్స్ , థియేట్రికల్ రైట్స్ ఇలా అన్ని హక్కులు విడుదలకు ముందే అమ్మేశారు. సినిమా చూసి నచ్చి అందరూ హక్కులు కొనుక్కున్నారు. దీంతో మాకు విజయంపై మరింత నమ్మకం పెరిగింది. ఈ సినిమా విజయం సాధించకపోతే నేను దర్శకుడిగా రిటైర్‌మెంట్ ప్రకటిస్తున్నాను'' అన్నారు. చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ '' ఈ సినిమాలో అన్ని ఎమోషన్స్ వుంటాయి. ముఖ్యంగా నేటి యూత్‌కు నచ్చే లవ్‌స్టోరీలో ఓ భిన్నమైన కోణాన్ని దర్శకుడు ఈ చిత్రంలో ఆవిష్కరించాడు. సినిమాను చాలా మందికి చూపించాం. అందరికి ఎంతో బాగా నచ్చింది. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుందే నమ్మకం వుంది'' అన్నారు. కోన వెంకట్ మాట్లాడుతూ'' ఈ ఒక్క సినిమాతో సినీ పరిశ్రమకు ఇంత మంది న్యూ టాలెంట్ పరిచయం కావడం మాలాంటి వారందరికి ఎంతో రిలీఫ్. న్యూ టాలెంట్ ఎవరికి కావాలన్న బెక్కం వేణు సినిమాలను చూసి నటీనటులను ఎంపిక చేసుకోవచ్చు. సాధారణంగా స్టార్స్‌తో చేసే ఫిలింస్ డబ్బునే ఇస్తాయి. ఇలాంటి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలు టాలెంటెడ్ ఆర్టిస్టులను పరిచయం చేస్తాయి.ఇలాంటి సినిమాలు కంటెండ్ ఈజ్ కింగ్ అని ప్రూవ్ చేస్తుంటాయి. ఈ సినిమా కూడా అదే కోవలోకి చేరాలని, ఈ చిత్రం టీమ్‌కు మంచి విజయం చేకూరాలని కోరుకుంటున్నాను'' అన్నారు.



# "భైరతి రణగల్" త్వరలో తెలుగులో విడుదల



కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ మరో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆయన హీరోగా నటించిన "భైరతి రణగల్" సినిమా శనివారం థియేటర్స్ లోకి వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ వస్తున్నాయి. సూపర్ హిట్ మూవీ "మఫ్తీ"కి ప్రీక్వెల్ గా టాలెంటెడ్ డైరెక్టర్ నర్తన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. గీతా పిక్చర్స్ బ్యానర్ పై గీతా శివరాజ్ కుమార్ భైరతి రణగల్ చిత్రాన్ని నిర్మించారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ తో తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సంతోషంలో శివరాజ్ కుమార్ అభిమానులు సినిమాలోని ఆయన మేకోవర్ తో థియేటర్స్ వద్ద సందడి చేస్తున్నారు. "భైరతి రణగల్" చిత్రంలో ఇతర కీలక పాత్రల్లో రాహుల్ బోస్, నానా పటేకర్, రుక్మిణి వసంత్, అవినాష్, యోగి బాబు, దేవరాజ్ నటించారు. తెలుగులోనూ పలు క్రేజీ ప్రాజెక్ట్స్ లో నటిస్తున్న శివరాజ్ కుమార్..."భైరతి రణగల్" మూవీతో ఇక్కడా మంచి విజయాన్ని అందుకోబోతున్నారు. నటీనటులు శివరాజ్ కుమార్, రాహుల్ బోస్, నానా పటేకర్, రుక్మిణి వసంత్, అవినాష్, యోగి బాబు, దేవరాజ్ , చాయా సింగ్, ఉదయ్ మహేశ్, తదితరులు.

# ఘనంగా 'మహా సంద్రం' పూజా కార్యక్రమాలు

ప్రస్తుతం కొత్త కంటెంట్ చిత్రాలు వస్తున్నాయి. కొత్త తరం ఇండస్ట్రీలోకి వస్తూ డిఫరెంట్ సబ్జెక్టులతో ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే 'మహా సంద్రం' అనే యాక్షన్ డ్రామాతో కొత్త టీం రాబోతోంది. నవీనీత్ రైనా హీరోగా రాబోతోన్న ఈ చిత్రానికి శేషు రావెళ్ళ, కార్తికేయ. వి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వీవీఎం క్రియేషన్స్, కేవీఎం ఆర్ట్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వం బాధ్యతల్ని కార్తికేయ. వి నిర్వర్తించనున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు దామోదర ప్రసాద్, ఎన్. శంకర్, సముద్ర, ఆర్. అనిల్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పూజా కార్యక్రమాల అనంతం దామోదర ప్రసాద్ క్లాప్ కొట్టగా.. ఎన్. శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి సముద్ర గౌరవ దర్శకత్వం వహించారు. పద్మనాభరెడ్డి, రామసత్యనారాయణ స్క్రిప్ట్ అందజేశారు. ఈ చిత్రానికి ప్రేమ్ రాజ్ ఎనుముల డైలాగ్స్ అందించనున్నారు కళ్యాణ్ సామి కెమెరామెన్‌గా, జగదీష్ ఎడిటర్‌గా పని చేయనున్నారు. తెలుగు, హిందీలో ద్విభాష చిత్రంగా రాబోతోన్న 'మహా సంద్రం' షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. నటీనటులు : నవనీత్ రైనా, టైగర్ శేషు, పెద్ది రాజ్, మల్లీఖార్జున, ప్రతాప్ చల్లా తదితరులు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com